అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 30-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 10 | సంచిక: 242 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50

పార్కింగ్ చార్జీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- ఫ్రీ పార్కింగ్ బాధ్యత మెట్రో సంస్థదే : డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్ డిమాండ్
- నేడు మియాపూర్ మెట్రో వద్ద సంతకాల సేకరణ



నవతెలంగాణ- సిటీబ్యూరో/ఉప్పల్

మెట్రో రైలు ప్రయాణికుల నుంచి పార్కింగ్ చార్జీలు వసూళ్లు చేసే నిర్ణయాన్ని మెట్రో సంస్థ, ఎల్అండ్‌టీ తక్షణమే ఉపసంహరించుకోవాలని, పార్కింగ్ సౌకర్యాన్ని ఉచితంగా కల్పించాలని డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్ డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం ఆయా యువజన సంఘాల ఆధ్వర్యంలో నాగోల్ మెట్రో స్టేషన్ పార్కింగ్ వద్ద ప్రయాణికులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, నాయకులు జావీద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ ప్రదీప్ మాట్లాడారు. మెట్రో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మెట్రో సంస్థదేనన్నారు. ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకుని, ప్రయాణికుల వాహనాలు నిలిపితే పార్కింగ్ చార్జీల పేరుతో దండుకోవడం సరికాదన్నారు. ప్రయాణికులు వందల రూపాయల చార్జీలు మెట్రో రైలుకు చెల్లిస్తున్నారని, మళ్లీ పార్కింగ్ పేరుతో వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. రవాణా చార్జీలతో సమానంగా అధిక మొత్తంలో పార్కింగ్ చార్జీలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే నాగోల్, మియాపూర్, మిగతా అన్ని స్టేషన్లలో ఉచిత పార్కింగ్ కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అందులో భాగంగానే శుక్రవారం మియాపూర్ మెట్రో స్టేషన్ పార్కింగ్ వద్ద ప్రయాణికులచే సంతకాల సేకరణ చేస్తామని, అనంతరం మెట్రో ఎండీకి వినతిపత్రం అందజేసి.. సమస్యను వివరిస్తామన్నారు.

అయినా పార్కింగ్ చార్జీల వసూలు నిర్ణయంపై వెనక్కి తగ్గక పోతే.. వచ్చేనెల 1న చలో నాగోల్ మెట్రో స్టేషన్ పిలుపునిచ్చి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇకనైనా మెట్రో సంస్థ, సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రవి, వెంకన్న, ఏఐవైఎఫ్ నాయకులు టి.సత్య ప్రసాద్, శేఖర్, గిరిబాబు, రాజ్ కుమార్, రవి, మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనీల్ కుమార్, పీవైఎల్ నాయకులు ఎం.రవి కుమార్, బి.ఎస్.కృష్ణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ చిక్కిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

రూ.లక్ష లంచం తీసుకుంటూ..



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. హైదరాబాద్ సిటీ రేంజ్-2 యూనిట్ ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నవ భారత్ కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌కు ఓ కుటుంబానికి మధ్య వివాదం ఉంది. దాన్ని పరిష్కరించేందుకు ఆర్బిట్రైటర్‌గా వెళ్లిన జిల్లా కో - పరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బొమ్మల శ్రీనివాస రాజు బాధితుడి నుంచి రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దాంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారు చెప్పినట్టు.. గురువారం కలెక్టరేట్ వద్ద లక్ష రూపాయలను బాధితుడు రిజిస్ట్రార్‌కు ఇవ్వగా.. కారు డిక్కీలో పెడుతుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. లక్ష రూపాయలు, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందుతుడిని కోర్టులో హాజరు పరుస్తామని అధికారులు తెలిపారు.

సహకార కార్యాలయంలో తనఖీలు

అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస రాజు విధులు నిర్వర్తిస్తున్న కలెక్టరేట్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కార్యాలయంలో పలు ఫైళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు మరికొన్నింటిని సీజ్ చేసినట్టు సమాచారం.

విపత్తుల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేస్తాం

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విపత్తుల నిర్వహణ వ్యవస్థను (డిజాస్టర్ మేనేజ్మెంట్) బలోపేతం చేయనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విపత్తుల కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని తట్టుకుని ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించేలా డిజాస్టర్ మేనేజ్మెంట్‌ను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. పదేండ్ల తర్వాత తొలిసారిగా వరదలపై యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని తెలిపారు. వరదలతో సంబంధం ఉన్న ప్రతి విభాగం రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాలలో వరద ముప్పును తగ్గించడానికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైడ్రా పరిధిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను ఆ సంస్థ కమిషనర్ రంగనాథ్ వివరించారు. గతంలో 30 బందాలుండగా వాటిని 70కి పెంచామనీ, అలాగే సిబ్బంది సంఖ్యను 1,800 నుండి 3,500లకు పెంచడం జరిగిందని వివరించారు. విపత్తులకు సంబంధించి హైడ్రాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్, రెవెన్యూ జాయింట్ సెక్రెటరీ ఎస్. హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కులగణనను వెంటనే చేపట్టండి

- రాజకీయ, బీసీ కుల సంఘాల అఖిల పక్ష సమావేశంలో పలువురు వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కులగణన వెంటనే చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌లోని సెంటర్ కోర్టు హెూటల్లో రాజకీయ పార్టీలు, బీసీ, కుల సంఘాల ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ పార్టీలతో పాటు 50కి పైగా బీసీ కుల సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కులగణన ఉద్యమానికి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మద్దతిస్తుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కుల గణన అంశం లో పూర్తి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఎల్.రమణ, మధుసూధనా చారిలు మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్లకు పూర్తి మద్దతిస్తున్నట్టు తెలిపారు. తాము ఏ పార్టీలో ఉన్నా బీసీల అభ్యున్నతికి కృషి చేసినట్టు చెప్పారు. బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, రాజారాం యాదవ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 30-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 242 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

సంపాదకీయం

బంగ్లా జమాతేపై నిషేధం రద్దు!




మతోన్మాద జమాత్-ఎ-ఇస్లామీ పార్టీపై ఉన్న నిషేధాన్ని బుధవారం నాడు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసింది. ఆ పార్టీ, దాని అనుబంధ విద్యార్థి విభాగానికి చెందినవారు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారంటూ ఆగస్టు ఒకటవ తేదీన నాటి అవామీలీగ్ ప్రభుత్వం నిషేధం విధించింది. తరువాత నాలుగు రోజులకే హసీనా ప్రభుత్వ పతనం, ఆమెను బలవంతంగా మిలిటరీ అధికారులు మనదేశానికి పంపటం తెలిసిందే. తమ దర్యాప్తులో అలాంటి రుజువులేమీ లేవని తేలినందున నిషేధాన్ని ఎత్తివేసినట్లు యూనస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిణామం తరువాత తమ పార్టీ నమోదును రద్దు చేస్తూ గతంలో ఒక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి పునరుద్ధరించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయ నున్నట్లు జమాయతే ప్రకటిం చింది. బంగ్లాదేశ్‌లో జమాతే ఇస్లామీ ఒక వివాదాస్పద సంస్థ. బ్రిటీష్ ఇండియాలో 1941లో ఏర్పడిన ఈ సంస్థ బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని వ్యతిరేకించటమే గాక పాకిస్తాన్‌తోనే కలసి ఉండాలనే వైఖరి తీసుకుంది. విముక్తి కోసం పోరాడినవారి మీద దాడులు, హత్యలకు పాల్పడింది. దాంతో ముజిబుర్ రహమాన్ ప్రభుత్వం 1972లో దాన్ని నిషేధించింది. ముజిబుర్ హత్య తరువాత అధికారానికి వచ్చిన జియావుర్ రహమాన్ ప్రభుత్వం దాన్ని ఎత్తివేసింది.జమాయతే పార్టీ కార్యకలాపాలు లౌకిక వ్యవస్థ, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నందున దాని రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ 2009లో దాఖలైన పిటీషన్‌పై 2013లో హైకోర్టు విచారించి ఆమోదించింది. అప్పటినుంచి అది ఎన్నికల్లో నేరుగా పాల్గొనటం లేదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు(బిఎన్‌పి), ఇతర పార్టీల కూటమిలో భాగస్వామిగా ఉంటూ అవామీలీగ్‌ను వ్యతిరేకిస్తున్నది. అయితే అవామీలీగ్ అణచివేత చర్యల కారణంగా జమాయతేతో చేతులు కలిపినప్పటికీ దానితో సంబంధాలను వ్యతిరేకించే శక్తులు కూడా బిఎన్‌పిలో ఉన్నాయి.గతేడాది కూడా సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసినప్పటికీ దాని ప్రతినిధులు కోర్టుకు రాని కారణంగా కొట్టివే శారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించేందుకే అవకాశాలున్నాయి. ఒక వేళ అదే జరిగితే జమాతే వచ్చే ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీకి దిగటం ఖాయం.

> షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతిచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేకత పెద్దఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది.హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమదేశానికి అప్పగించాలన్న డిమాండ్‌ను అక్కడి అవామీలీగ్ వ్యతిరేక పార్టీలు పదేపదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్రమోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు.

షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతిచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేకత పెద్దఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది.హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమదేశానికి అప్పగించాలన్న డిమాండ్‌ను అక్కడి అవామీలీగ్ వ్యతిరేక పార్టీలు పదేపదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్రమోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. అవామీలీగ్ ఇతర పార్టీనేతల మీద కూడా కేసులు నమోదు చేయటమేగాక ఇప్పటివరకు ఇద్దరు మాజీ మంత్రులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్-మనదేశం మధ్య 54వరకు చిన్నా పెద్ద నదులు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బంగ్లాదేశ్‌లో అనేక చోట్ల వరదలు వచ్చాయి.పది లక్షల మంది పౌరులు ప్రభావితమయ్యారు. దీని వెనుక భారతహస్తం ఉందని, అక్కడి రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసిన కారణంగానే ఇదంతా జరిగిందనే ప్రచారం జరుగుతోంది. త్రిపురలోని గోమతి నది మీద ఉన్న డంబూర్ డామ్ నిండిపోయిన కారణంగా నీటిని దిగువన ఉన్న బంగ్లాదేశ్‌వైపు విడుదల చేయటం మినహా మరొకమార్గం లేదు. అదే జరిగింది, దాన్ని కావాలనే విడుదల చేసినట్లు మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొడు తున్నారు. అక్కడి మన వీసా జారీ కార్యాలయాల్లో తమ పౌరులకు వీసాల జారీని కావాలనే జాప్యం చేస్తున్నారంటూ అనేక మంది నిరసన ప్రదర్శనలకు దిగారు.హసీనా ప్రభుత్వ పతనం తరువాత మనదేశం సిబ్బందిని తగ్గించిన కారణంగా ఆలస్యం జరుగుతున్నది. ఈ పరిస్థితిని కూడా మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకకు కొన్ని శక్తులు చూస్తున్నాయి.

బంగ్లాదేశ్ యువతలో ఉన్న ఆగ్రహానికి దేశ ఆర్థిక పరిస్థితి కూడా ఒక కారణం.విదేశీ చెల్లింపుల సమస్యలతో పాటు ఇటీవల వచ్చిన వరదలు కూడా గోరుచుట్టు మీద రోకటిపోటులా మారాయి. ఆగస్టు 21వ తేదీ నాటికి విదేశీ మారకద్రవ్య నిల్వలు 20బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. మొత్తంగా మరో 11బిలియన్ డాలర్లు అవసరం కాగా డిసెంబరు నాటికి కనీసం 8బిలియన్ డాలర్లు అవసరమని అంచనా వేసి ఐఎంఎఫ్‌తో సహా వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు.అక్కడి జనం షేక్‌హసీనా గద్దె దిగాలని మాత్రమే కాదు, తమ పరిస్థితి మెరుగుపడాలని కూడా కోరు కుంటున్నారు. అది జరగకపోతే మరోసారి ఆందోళన మరోరూపంలో జరగటం ఖాయం.

వేమన కవిత్వం : వైజ్ఞానిక దృక్పథం



డాక్టర్ దేవరాజు మహారాజు


సమాజంలో మనిషి ఎలా మెలగాలో, విజ్ఞతను, వివేకాన్ని ఉపయోగిస్తూ ప్రతి విషయం తర్కబద్ధంగా ఎలా ఆలోచించాలో ఈ ప్రపంచానికి తెలియజెప్పిన తెలుగుకవి వేమన. కుల మతాలు, ప్రాంతీయ భేదాలు, లింగ వివక్ష లేకుండా ప్రతి మనిషీ మానవీయ విలువలను నిలుపుకుంటూ ఎలా బతకాలో చెప్పిన మానవవాది వేమన. ఆయన చెప్పాలనుకున్నది ఆటవెలదిలో చెప్పినా, తెలుగు సాహిత్య రంగంలో తన కవిత్వంతో ఒక బలమైన ముద్ర వేసుకున్నా-ఆయన అక్కడికే పరిమితం కాలేదు. అదే కవిత్వంతో సమాజ ఉద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా కూడా ఎదిగాడు. అందువల్ల వేమన క్రాంతిదర్శి, దార్శనికుడు అని కూడా చెప్పుకోవాలి!

ఎంతో శ్రమకోర్చి గ్రంథస్థం కాని దశలో వేమన పద్యాలు ఒక్కొక్కటి సేకరించి, ముద్రించి వాటిని అను వాదాల ద్వారా యూరోప్ దేశాలకు పరిచయం చేసిన సి.పి. బ్రౌన్ (1798-1884)కి తెలుగుజాతి రుణపడి ఉండాలి. వేమన కవిత్వం సమగ్రంగా ఒకచోట భద్రపరిచిన తరువాత, వాటిని పరిశీలించి వ్యాఖ్యానాలు, వివరణలు చాలామంది రాస్తూ వచ్చారు. అది కొంత సులభమైన పని. తొలితరం మలితరం రచయితలు, పరిశోధకులు కొంత ముడిసరుకు అందించిన తర్వాత, ఇటీవలి ఆధునిక కాలంలో కొందరు సిద్ధాంత వ్యాసాలు రాసి, పలు విశ్వవిద్యాలయాల నుండి డాక్టరేట్ పట్టాలు పొందారు. అప్పటికీ ఇప్పటికీ వేమన పద్యాలు సమాజంలో ప్రకాశవంతంగా వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నాయి. అయితే వాటిమీద వెలువడిన సిద్ధాంత వ్యాసాలు జన బాహుళ్యంలోకి వెళ్లలేదు. ఆధునిక సాంకేతిక వనరులన్నీ అమరిన తర్వాత, వేమన కవిత్వం మీద రాయడం గొప్ప పనికాదు. ఎక్కడ ఏమీలేని రోజుల్లో ఎంతో శారీరక, మానసిక శ్రమకోర్చి పనిచేయడం మాటలు కాదు. అందుకే అంటున్నాను. సి.పి. బ్రౌన్ నిజాయితీ, నిబద్ధతల్ని గుర్తు చేసుకుని - వేమనని బతికించి ఈ తెలుగుజాతికి అంకితం చేసిన ఆ ఆంగ్లేయుడికి ప్రతి తెలుగువాడు నమస్కరించుకోవాలి!

ప్రపంచంలో ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు ప్రారంభమౌతున్న తొలిదశలో సాధారణ శకం 1652 -1730 జ.జు. మధ్యకాలంలో వేమన జీవించాడు. అప్పటికి 'వైజ్ఞానికుడు' సైంటిస్టు అనే పదమే వాడుకలోకి రాలేదు. అలాంటి వారిని 'నేచరల్ ఫిలాసఫర్స్' అని వ్యవహరించేవారు. అవి జ్యోతిషం ఖగోళ శాస్త్రంగా రూపాంతరం చెందుతున్న రోజులు. ల్యూవెన్ హక్ (1622-1723 జ.జు) ఆ కాలానికి సూక్ష్మదర్శినిని తయారు చేయగలిగాడు. కానీ, అప్పటికి అది ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రాలేదు. అలాగే, అప్పుడప్పుడే న్యూటన్ (1643-1727 జ.జు) తన చలన సూత్రాలు వెల్లగించిన రోజులు.

ఇక మనదేశానికి వస్తే, దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాలు మినహాయిస్తే దేశం మొత్తం మొఘలుల పాలనలో ఉంది. వీరి రాజ్యానికి కిందిభాగం మరాఠా పాలకుల స్వాధీనంలో ఉంది. వేమన జీవించిన 17వ శతాబ్దంలో దక్షిణ భారతదేశం తంజావూర్ నాయక్‌ల పరిపాలనలో ఉంది. వారు తెలుగు సాహిత్యాన్ని, కళల్ని ఎంతగానో ప్రోత్సహించారు. వేమనకు ఒకటిన్నర శతాబ్దాలకు ముందే పోర్చుగీస్ నావికుడు వాస్కోడాగామా కేరళ-కోజికోడ్ నుండి మనదేశంలోకి ప్రవేశించాడు. అప్పటి కేరళ పరిపాలకుడు సమూత్రి మహారాజు పోర్చు గీస్‌తో వ్యాపార సంబంధాల్ని బాగా ప్రోత్సహించాడు. వేమనకు అర్థశతాబ్దానికి ముందే సాధారణ శకం 1600 (జ.జు)లో ఈ దేశంలోకి ఈస్ట్ ఇండియా కంపనీ ప్రవేశించింది.

ఆ కాలపు విశేషాల్ని సమీక్షించుకోవడం ఎందుకంటే- వేమన పుట్టి, పెరిగి, కాస్త లోకజ్ఞానం సంపాదిం చుకునే నాటికి దేశ,కాల పరిస్థితులు ఎలా ఉన్నాయి. అనేది అర్థం చేసుకోవడానికి! వ్యక్తుల ఎదుగుదల మీద, రూపుదిద్దుకున్న వారి ఆలోచనాసరళి మీద బాహ్య పరిస్థితులు సామాజిక, ఆర్థిక, చారిత్రక, రాజకీయ స్థితిగతులు తప్పక ప్రభావం చూపుతాయి. కవుల, కళాకారుల, శాస్త్రవేత్తల, తాత్త్వికులవంటి వారి కృషి బేరీజు వేసు కోవాలంటే వారు జీవించిన కాలంనాటి అన్ని పరిస్థితుల్ని అన్ని కోణాల నుంచి పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పుడిక్కడ వేమన కవిత్వం గురించి చర్చిస్తున్నామంటే కేవలం ఆయన పద్యపాదాలు అర్థ తాత్పర్యాలు అర్థం చేసుకోవడం కాదు. తాత్విక కవి వేమన 'తయారు కావడానికి' దోహదం చేసిన బాహ్య, అంతర పరిస్థితుల్ని అంచనా వేసుకోగలగాలి. వేమన ఉనయోగించిన భాష, అందులోని చమక్కులు, వ్యంగ్యం, వంటి వాటిదగ్గరే ఆగిపోవడం భాషా పండితులు చేసే పని. అది ఒక కోణం మాత్రమే! వేమన లాంటి ఆలోచనాపరుడి గురించి, సమాజ క్షేమం గురించి ఆవేదన చెందిన మహనీయుని గురించి, ఇంకా అనేక కోణాలనుండి జరగాల్సిన పరిశీలనలు, పరిశోధనలు:- జరగలేదని నాకు అనిపిస్తోంది. ఈ దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు ప్రజలు ఇంకా మూఢనమ్మకాల్లో పిచ్చి సంప్రదాయాల్లో పడి కొట్టుకుపోతున్నారంటే-వేమనను అర్థం చేసుకోవల్సినంత చేసుకోలేదనీ, జీర్ణించుకోవాల్సినంత జీర్ణించుకోలేదని నాకు అనిపిస్తోంది!



నీథమ్ అనే శాస్త్రవేత్త అంగ్విునా ట్రిటిసీ అనే వృక్ష పరాన్నజీవి వివరాలు తొలిసారి 1744లో ప్రపం చానికి ప్రకటించాడు. ఇది వేరును తొలచి జీవించే నెమటోడ్ పరాన్నజీవి. అంటే 1780 జ.జులో వేమన మరణించిన 14ఏండ్లకు ఈ వేరు పురుగు పరిశోధన అధికారికంగా వెలుగుచూసింది. అయినా తన లోకజ్ఞానంతో, పరిశీలనానుభవంతో వేమన "వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును/ చీడ పురుగు జేరి చెట్టు చెరచు" - అనే పద్యం చెప్పాడు."... శిలల కెల్ల మ్రొక్కు జీవులార! శిలల నేమియుండు జీవులందే కాక?"- శిలలలో ఏ ముందని మొక్కుతున్నారూ? అని ప్రశ్నిస్తూ ఏదైనా ఉంటే గింటే అది జీవుల్లోనే ఉంది- అన్న సత్యాన్ని వెల్లడించాడు వేమన. వేమన కాలానికి దేశంలో ఆధునిక ఇంగ్లీషు చదువులు లేవు. విజ్ఞానశాస్త్ర బోధన లేదు. అయినా, ఆయన తనలోని వైజ్ఞానిక అవగాహనను తట్టిలేపాడు. జీవులకూ, నిర్జీవులకు గల తేడా తెలుసు కొమ్మని హితవు పలికాడు. అలాగే శిలల గురించి మరో విషయం కూడా చెప్పాడు. ఒక హేతువాదిగా "రాతి బొమ్మకేల రంగైన వలువలు / గుళ్ల గోపురాములు కుంభములును"- అని మనుషులు కల్పించుకున్న దైవాన్ని వారి అంధవిశ్వాసాన్ని సుతిమెత్తగా ఎత్తి చూపాడు.

చీకటి పోవాలంటే దీపం పెట్టాలి. రోగం పోవాలంటే వైద్యుడి మందు తినాలి "వ్యాధి కలిగెనేని వైద్యుని చేతను/ మందు దినక కాని మానదెందు/ చెంత దీపమిడక చీకటిపాయునా" ఇది సాధారణమైన పరిశీలనే కాని, చీకటిని రోగంతో పోల్చడంలో వేమనలోని వైజ్ఞానిక స్పృహ బయటపడింది. వైద్యుడి మందు అంటే సైన్సు లేనిది రోగం పోదు.దీపం కూడా సైన్సే. సైన్సు లేనిది చీకటిపోదు "మేడిపండు చూడు మేలిమై యుండును/ పొట్ట విప్పి చూడు పురుగులుండు"- పద్యం తెలియని తెలుగువారు ఉండరు. ఆయన పిరికివాడి బింకాన్ని మేడి పండుతో పోల్చాడు కానీ, ఇంకొంచెం లోతుకుపోయి ఆలోచిస్తే- ప్రతి కాయమీద, ప్రతి పండుమీద పురుగులు అంటే పరాన్నజీవులు జీవిస్తున్నట్టుగానే.. జంతువుల, మనుషుల శరీరాల మీద కూడా పరాన్నజీవులున్నాయని చెప్పి నట్లయ్యింది. అంతేకాదు, మేడిపండులాగా అందంగా కనబడే ఈ సమాజం మూఢనమ్మకాలతో, దారిద్ర్యంతో, మోసం, దగా, కుళ్లు, కుతంత్రాలతో ఉందని హెచ్చరించినట్టుగా కూడా ఉంది. మేడిపండులాగా అందంగా కన బడే ఈ దేశం 'పొట్టలో'- దేశంలోని సామాన్యుల్ని పీల్చి పిప్పిచేసే కార్పోరేట్లు, రాజకీయ నాయకులు ఉన్న విష యం మనకు తెలుసు. వేమన చెప్పిన ఒక సాధారణ విషయంలో అనేకానేక అసాధారణమైన అంశాలున్నాయి.

వేమన భూ విజ్ఞానశాస్త్రం గానీ, మానవం శరీర ధర్మ శాస్త్రం గానీ, అధ్యయనం చేసినవారు కాదు. కానీ, తన నిశిత పరిశీలన వల్ల 'భూమిలోన బుట్టు భూసార మెల్లను/ తనువులోన బుట్టు తత్త్వమెల్ల/ శ్రమము లోన బుట్టు సర్వంబు తానౌను"- అన్నారు. అసలు శ్రమ విలువను గుర్తించి ఎలుగెత్తి చెప్పడమన్నది గొప్ప విషయం. ప్రతిదీ శ్రమలోంచే పుడుతుందన్న అవగాహన ఆ కాలంలో ఆయనకు రావడం మామూలు విషయం కాదు. దార్శనికత అంటే అదే- వాస్తవాన్ని గ్రహించడం, నిజాల నిగ్గు తేల్చడమే కదా- వైజ్ఞానిక దృక్పథ మంటే? ఒకచిన్న ధూళికణం, లేదా ఇసుక రేణువు ఒక నీటిచుక్కతో కలిసి ఎప్పుడైతే ముత్యపుచిప్పలో పడు తుందో, అప్పుడది ముత్యమవుతుంది. ముత్యపుచిప్ప అని మనం చెప్పుకునేది సముద్రంలో ఉండే ఒక మొలస్కా జీవి. అనేక రంగుల్లో ఛాయల్లో ఏర్పడే ముత్యాలు కాల్షియం కార్బోనేట్, కాంకియోలిన్ వంటి పదార్థాలతో సహజంగా సముద్రంలో ఏర్పడతాయి. దీనివెనుక ఎన్నో వైజ్ఞానిక విషయాలున్నాయి. కానీ, వేమన కాలానికి అవన్నీ ప్రచారంలో లేవు.అయినా ఆయన తెలుసుకున్నారు.తన రచనలో పొందుపరిచారు.'చిప్పలోన బడ్డ చినుకు ముత్యం బయ్యో/నీటబడ్డ

> ఇప్పుడిక్కడ వేమన కవిత్వం గురించి చర్చిస్తున్నామంటే కేవలం ఆయన పద్యపాదాలు అర్థ తాత్పర్యాలు అర్థం చేసుకోవడం కాదు. తాత్విక కవి వేమన 'తయారు కావడానికి' దోహదం చేసిన బాహ్య, అంతర పరిస్థితుల్ని అంచనా వేసుకోగలగాలి. వేమన ఉనయోగించిన భాష, అందులోని చమక్కులు, వ్యంగ్యం, వంటి వాటిదగ్గరే ఆగిపోవడం భాషా పండితులు చేసే పని. అది ఒక కోణం మాత్రమే! వేమన లాంటి ఆలోచనాపరుడి గురించి, సమాజ క్షేమం గురించి ఆవేదన చెందిన మహనీయుని గురించి, ఇంకా అనేక కోణాలనుండి జరగాల్సిన పరిశీలనలు, పరిశోధనలు:- జరగలేదని నాకు అనిపిస్తోంది. ఈ దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు ప్రజలు ఇంకా మూఢనమ్మకాల్లో పిచ్చి సంప్రదాయాల్లో పడి కొట్టుకుపోతున్నారంటే-వేమనను అర్థం చేసుకోవల్సినంత చేసుకోలేదనీ, జీర్ణించుకోవాల్సి నంత జీర్ణించుకోలేదని నాకు అనిపిస్తోంది!

చినుకు నీళ్లగలిసే"-అన్న-ఆయనలో వైజ్ఞానిక జిజ్ఞాసఎలాంటిదో దీనితో మనం అర్థం చేసుకోవచ్చు-

"పాల సాగరమున పవ్వళించినవాడు/ గొల్ల యిండ్ల పాలు కోరనేల"- పిండములను జేసి పితరుల తలపోసి/ కాకులకును బెట్టు గాడ్దెలారా" - అంటూ తర్కబద్ధంగా అనేక ప్రశ్నలు సంధించిన వేమన, ఒక్కోచోట పరుషపదాలతో కూడా తన ఆక్రోశాన్ని వెళ్లగక్కాడు. "పేరు సోమయాజి పెను సింహ బలుడాయె/ మేకపోతు బట్టి మెడను విరువ/ కాని క్రతువు వలన కలుగునా మోక్షంబు" అంటూ జంతుబలిని నిరసిస్తూ యాగాలు చేసే సోమయాజులను ఎగతాళి చేస్తూ, మోక్షం కలిగే మార్గం ఇదేనా? అని దుయ్యబట్టాడు. "పెక్కు జనుల గొట్టి పేదల వధియించి/ డొక్క కొరకు నూళ్ల దొంగిలించి"- తన పొట్ట కోసం పేదల్ని కొట్టిచంపి, ఊళ్లు దోచుకునే దోపిడీదార్లను వేమన ఈసడించాడు. వేమన ప్రజా పక్షపాతి. తాను ఎవరి పక్షాన నిలబడ్డాడో కూడా స్పష్టం చేశాడు.

"బ్రహ్మ మనగ వేరె పరదేశమున లేదు / బ్రహ్మమనగ తానె బట్టబయలు/ తన్ను తానెరిగిన తానెపో బ్రహ్మంబు"- అని అన్న వేమనలో మనకు ఒక యోగి కనిపిస్తున్నాడు. గౌతమ బుద్ధుడు సమాధిలో కూర్చుని ఎక్కడాలేని ఏదో దేవుడి గూర్చి తపస్సు చేయలేదు. 'సర్వం దు:ఖమయం' అని గుర్తించిన బుద్ధుడు, ధ్యాన ముద్రలో కూర్చుని తనలోకి తాను ప్రయాణించాడు. మానవాళి దు:ఖాన్ని పారద్రోలడం ఎలాగా? అని తీవ్రంగా ఆలోచించాడు. వేమన కూడా అదేదారిలో పయనించి, అదే విషయం చెబుతున్నాడు. దేవుడనేవాడు ఏ దేశం లోనూ లేడు. తానేమిటో తను తెలుసుకోవడమే బ్రహ్మ. అదే జ్ఞానం అని చెపుతున్నాడు.

చివరగా ఒకమాట -నేను తెలుగు సాహిత్య విద్యార్థిని కాను. వేమన కవిత్వం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వాణ్ణి కూడా కాదు. అయితే వేమనలోని ప్రశ్నించేతత్త్వం, ప్రగతిశీల భావాలు నన్ను ఆకర్షించాయి. అందుకే ఏదో కొన్ని విషయాలు చెప్పడానికి సాహసించాను.

- కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

ముసుగుల్లో వొక అనాగరికుణ్ణి
మోసుకుపోతున్న పు-రుషులు
లోలోపల మసులుతున్నదేమిటో
ఎవ్వరికీ తెలియదు
గాంధీ మాటను పెడచెవిన పెట్టి
జెండా సిగ్గుపడ్తూనే ఎగరడానికి
ఆ రాత్రి స్వేచ్ఛనలంకరించుకుంటుంది

విషసర్పాల బుస వినిపించదు కాని
ముఖం నిండా కొన్ని నవ్వులు
గుచ్ఛం కట్టుకుంటారు
కొన్ని సభ్యతలు అభ్యంగన స్నానం చేసి
చేతుల నిండా పూజలు వేలాడ్తుంటాయి
ఇంకా కోరలేవి కన్పించని
మబ్బులు పద్తుంటారు
ఆ దుస్తులేవి నలగవు కానీ
ఆ గాలిలోకి లేచిన జిల్లేడుచూపు తొలవని

కొవ్వొత్తులు వదలాలి




అవయవ ముండదు
గెల్చిన ఓడిన రాజకీయం గొడుగుపట్టిన
వాళ్లను మనుషులనడం
అక్షరం వాంతి చేసుకుంటుంది
వాళ్ల కణాల నిండా
ఒక ఐతిహాసిక పురాణ సాంస్కృతిక
ద్రగ్గింజెక్టైదు వారసత్వ పాలసముద్రం
మధించబడుతుంటుంది

చేతినిండా అశ్లీలం
పొరలుపొరలుగా కౌగిలించుకుంటుంది
వొక గుర్తుతెలియని ముసుగులో
అవతారమెత్తిన పుంసత్వ మృత్యువేటొకటి
తొడల మధ్య గెలుపును ప్రకటించుకొని
ఒక సజల కాలాన్ని కొరికేస్తుంది
ఒక పునరుత్పాదక మానవీయ
పరిమళాన్ని మట్టి కల్పుతుంది

రాజ్యం గుడ్డితనం నవ్వుతుంటే
గుర్తు తెలియని మహమ్మారుల వేటలో
పాపం! కలకత్తా కాళిక
నూటయాభై గ్రాముల కొవ్వొత్తి పట్టుకుని
నడుస్తున్నప్పుడు తప్పదు,
మనుషులు కొవ్వొత్తులు వదలాలి!

- వడ్డెబోయిన శ్రీనివాస్
9885756071

పర్యావరణానికి 'హైడ్రా' దోహదపడుతుందా?



దొంతి నర్సింహారెడ్డి
9010205742

హైదరాబాద్ నగరంలో వేల చెరువులు వందలలోకి వచ్చాయి. కొన్ని ప్రాంతాలలో కుంటలు, చెరువులు ఆనవాళ్ల కూడా లేవు. అయితే, అదే క్రమంలో వరద ముప్పు పెరుగుతున్నది. కుంటలను, చెరువులను మాయం చేసిన దగ్గర వరద స్థాయి కూడా ఎక్కువగా ఉంటున్నది. కుంభ వృష్టి పడినప్పుడల్లా స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. మాయమైన చెరువులు, మాయం కాబోతున్న చెరువులకు కూడా అనేక స్థానిక కారణాలున్నాయి. రకరకాల వ్యూహాలతో కబ్జాదా రులు ఆక్రమించారు. గత 30ఏండ్లుగా జరుగుతున్న ఈ ఆక్రమణలు క్రమక్రమంగా జరిగాయి. ఒక్కొక్క చెరువుది ఒక్కోగాథ, బాధ, వ్యథ. మొదట్లో పేదల పేరు మీద జరిపిన ఆక్రమణ ఇప్పుడు చెరువు అవసరమే లేదు అనేకాడికి వచ్చింది. చెరువుల ఆక్రమణ వల్ల అన్యాయమైపోయిన వారి గొంతుకలు అప్పుడు ప్రభుత్వాలు, మీడియా, ఇతరులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నప్పుడు కూడా వారి గొంతు కాకుండా ఆక్రమించినవారు మాట్లాడు తున్నారు. మీడియాలో కూడా వారిమాట ప్రబలంగా వినపడుతున్నది. హాస్యాస్పదంగా చెరువులను ఆక్రమించిన ప్రజా ప్రతినిధులు రాజకీయ కోణం గురించి మాట్లాడుతున్నారు. కక్ష, వివక్ష అంటూ సమన్యాయం గురించి అరుస్తున్నారు. ప్రజల కొరకు మొదలు పెట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రజల పేరుమీద ప్రశ్నిస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో కొత్తగా ఏర్పడిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సంస్థ పని మొదలుపెట్టిన కొద్దిరోజులలోనే నగరంలో అనేక రకాల చర్చలకు దారి తీసింది. అయితే వేగంగా ఇది రాజకీయ నాయకుల చర్చగా మారింది. చెరువులు, కుంటలు, గొలుసుకట్టు చెరువులు, వాటి మధ్య వాగులు సహజ నీటి వ్యవస్థలో కీలకం. వీటిని కాపాడుకోవడం ముఖ్యం. అందుకే నీటి వనరుల నిర్వహణలో ఇమిడిఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక కోణాలను చర్చించాలి. హైదరాబాద్ నగర అభివృద్ధిలో సమిధలుగా మారిన చెరువుల గురించి రాజకీయ నాయకుల వ్యవహారంగా మారిస్తే ప్రజలకు అసలు విషయం అర్థమయ్యే అవకాశం లేదు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలలో పార్టీల మధ్య సంవాదంగా దీన్ని మార్చితే ప్రజలకు నష్టం.

రాజకీయ సవాళ్ల మధ్య హైడ్రా

ప్రకృతి వనరులను తమ కబంధహస్తాలలో బంధించిన 'ప్రయివేటు' వ్యాపార వర్గం ఉనికిని ఇప్పటి పరిస్థితి ఎత్తి చూపుతున్నది. ఈ వర్గంలో రాజకీయ నాయకులు, అధికారులు, భవన నిర్మాణదారులు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు. వీళ్లకు మద్దతుగా అనేక మంది ప్రొఫెషనల్స్ ఉన్నారు. ఈ వర్గం రాజకీయ పలుకుబడి ఉపయోగించి, మీడియాలో ఇంకా ఇతరత్రా ఉన్న సంబంధాలను వాడుకుని సమస్యను జటిలం చేసే ప్రయత్నాలను మొదలు పెట్టారు. ముందు మతం, కులం, ప్రాంతం, పార్టీ, వగైరా అన్నీ రకాల వాదనలు వినపడుతూనే ఉంటాయి. చెరువులను చెరబడుతున్నప్పుడు పట్టించు కోని వ్యక్తులు ఇప్పుడు అన్ని రకాల వాదనలతో సిద్ధంగా ఉన్నారు.

రాజకీయ సవాళ్లకు ఇది సందర్భం కాదు. చెరువుల పరిరక్షణ ద్వారా మన నివాస ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చే అవకాశం ఉన్నది. భూగర్భ జలాలు, పచ్చదనం, ఖాళీ స్థలాలు పరిరక్షిస్తే, పెరిగే వేడి తగ్గి, ఉష్ణోగ్రతలు నియంత్రణలోనికి వస్తాయి. చెరువుల పునరుద్ధరణ మీద రాజకీయ నీలినీడలు పడకుండా హైడ్రా సంస్థ పనితీరు ఉండాల్సిన ఆవశ్యకతను ప్రస్తుత విష రాజకీయ సంస్కృతి గుర్తు చేస్తున్నది. హైడ్రా పనికి ప్రజల నిరంతర మద్దతు అవసరం ఉన్నది. ప్రజల మద్దతు రావాలంటే హైడ్రా తన పనిలో ప్రజల్ని భాగస్వాములు చేయాలి. పారదర్శక పద్ధతులను అవలంబించటం ద్వార మాత్రమే ఇది సాధ్యం.

ఫలానా ఆక్రమణను తొలగించే దమ్ము హైడ్రాకు ఉన్నదా? అని కొందరు రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. తమ అక్రమ నిర్మాణాన్ని లక్ష్యం చేసుకున్నారు, ఇంకెవరిదో చేసుకోలేదు అని హైడ్రా పనిమీద బురద జల్లుతున్నారు. సామాన్యులు గమనిస్తున్నారు. ఇట్లాంటి అనుమానాలకు సమాధానం హైడ్రా పనితీరు వల్ల వస్తుందని ఆశిద్దాం. ప్రకటనల వల్ల రాదు. కొంతకాలం ఓపిక పట్టాల్సిందే. సవాళ్లను విసిరే రాజకీయ నాయకులు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలలో భాగంగా చేస్తున్నారు. ఆక్రమించిన వారికి వేరే ఆక్రమణ గురించి ఆక్షేపించే హక్కు లేదు.అన్ని రకాల ఆక్రమణలు ఎత్తి చూపే హక్కు,ఆస్కారం, అవకాశం ప్రజలకు మాత్రమే ఉన్నది. అది కల్పిం చాల్సిన బాధ్యత హైడ్రా ఉన్నతాధికారుల మీద ఉన్నది.హైడ్రాకు బలం చేకూర్చాల్సింది ప్రజలే. కొందరి స్వలాభం వేలమందికి నష్టంగా మారిన తరుణంలో ప్రభుత్వం



> హైడ్రా చేస్తున్న పని ప్రస్తుత తీవ్ర వాతావరణ మార్పుల నేపథ్యంలో, పెరుగు తున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో భాగంగా మనం చూడాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే చెరువులు చాలా అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే పచ్చదనం, చెట్లు అవసరం. పచ్చదనానికి, చెట్లకు చెరువులు అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే నీటితో నిండిన చెరువుల పాత్ర చాలా ముఖ్యం.

హైడ్రాతో ముందుకొస్తే దానికి మద్దతు ప్రకటించి, రాజకీయ ప్రాబల్యం నుంచి దానిని రక్షించుకుంటూ, చెరువుల పరిరక్షణలో ప్రజలు కూడా నడుము బిగిస్తే సవాలుగా మారిన చెరువుల పరిరక్షణ సాకారం అవుతుంది.

హైదరాబాద్ నగరమంతటా, బయటా కొన్ని వేల ఆక్రమణలు ఉన్నాయి. అన్ని ఒకే రోజు తొలగించడానికి హైడ్రా ఒక మంత్రం దండం కాదు. ఒక దాని వెంట ఒకటి తనకున్న వనరులను బట్టి ఆక్రమణలు తొలగిస్తే, కొత్త ఆక్రమణలు కూడా ఆగుతాయి. ఇది నిరంతర ప్రక్రియ. హైడ్రా తనదగ్గర ఉన్న సమాచారం మేరకు, ప్రజలు ఇస్తున్న సమాచారం జత చేర్చి కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. తయారు చేసిన చిట్టాలో కట్టడాల తొలగింపు, కూల్చివేతలకు ఒక ప్రాధాన్యత క్రమం ఏర్పాటు చేసుకోవాలి. ఇందులో రహస్యం ఏమి ఉంచకూడదు. ఆక్రమణల చిట్టా తయారుచేసి ఎప్పటికప్పుడు ప్రజలముందు పెట్టాలి.ఈ చిట్టా తీసుకుని ఆక్రమణలను తొలగిస్తూ చెరువుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టాలి. ఒక దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తే ప్రజలు కూడా ఆమోదిస్తారు.

పేదలకు పునరావాసం కల్పించాలి

ఆక్రమణలు కూడా అనేక విధాలుగా సంవత్సరాలుగా జరిగిన దరిమిలా కూల్చివేతలు కూడా ఆ మేరకు విభిన్నంగా ఉండాలి. కొన్ని చెరువులోపల కడితే, కొందరు చెరువు ఒడ్డున కట్టారు. కొందరు దొడ్డిదారిన అనుమతి తెచ్చుకుంటే, ఇంకొందరు అనుమతి లేకున్నా కట్టుకున్నారు. కొందరు తెలియకకొంటే, అనేకులు తెలిసి ఆక్రమించారు.ఏ విధంగా ఆక్రమణ జరిగినా, ఎప్పుడు జరిగినా, చివరికి ఆక్రమణలు ఉండడమే కొలమానం. కట్టడాల తొలగింపు, కూల్చివేతలు వంటి మొదటి అడుగులు అమాయకులు, పేదలు, బలహీనులు మీద పడకుండా జాగ్రత్త పడాలి. అటువంటి సందర్భంలో వాళ్ల విషయంలో, హైడ్రా తొలి అడుగు వారి పునరావాసానికి ఇచ్చి, ఆక్రమణల నిర్మూలన తదుపరి చేపట్టాలి. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వంటి చెరువుల చుట్టూ, లోపట ఉన్న ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి. ఈ జంట జలాశయాల పునరుద్ధరణ వేగంగా, పూర్తి స్థాయిలో సంపూర్ణంగా చేసి హైడ్రా తన పనితీరు మెరుగుపరచుకోవాలి. ఇక్కడి ఆక్రమణలు అన్ని తొలగించి, పూర్తిగా పునరుద్ధరణ చేసి ఫలితాలు రాబడితే ప్రజలకు హైడ్రా పని మీద విశ్వాసం పెరుగుతుంది.

చెరువుల ఆక్రమణ వల్ల అనేక రూపాలలో ప్రజలకు, ప్రభుత్వానికి నష్టమవుతున్నది. ఆర్థిక నష్టం మీద అధ్యయనాలు, అంచనాలు లేవు. చేస్తే ప్రజలు హైడ్రా చర్యలను బేరీజు వేసుకునే అవకాశం వస్తుంది. హైదరాబాద్‌లో చెరువులలో వర్షపు నీటిని నిలువ చేసుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. ఏ ఒక్క చెరువు కూడా కాలుష్యరహితంగా లేదు. పడ్డ ప్రతి వర్షపు చుక్కా కొన్ని క్షణాలలో కలుషితం అయిపోతున్నది. మరి మంచినీరు ఎక్కడ నుంచి వస్తున్నది? నిత్యం అవసరమయ్యే మంచి నీరు ఎక్కడి నుంచో వస్తే దాని ఖరీదు ఎంత? మంచి నీటి మీదనే ఖర్చు పెట్టడం వల్ల హైదరాబాద్ జలమండలి మురుగు నీటి పారుదల వ్యవస్థ మీద పెట్టుబడి పెట్టడం లేదు. ప్రతి రోజు దాదాపు 1800 మిలియన్ గ్యాలన్ల మురుగునీరు పరివాహక ప్రాంత చెరువుల ద్వార మూసినదిలోకి చేరుతున్నది. చెరువులలో దోమలు, దోమల వల్ల రోగాలు, వైద్యానికి కోట్ల రూపాయలు ప్రజలు ఖర్చు పెడుతున్నారు. ఒక్క అపార్ట్‌మెంట్, ఒక్క కాలేజి, ఒక్క లేఔట్ వల్ల చెరువు నాశనం. చెరువు నాశనం వల్ల చుట్టుపక్కల నివసించేవారికి కష్టం, నష్టం. ఈ ఆర్థికభారం భరించేకంటే చెరువులను పరిరక్షిస్తే జీవనం సుఖం.కాబట్టి హైడ్రా పనిచేస్తే ప్రజలకే లాభం.

పర్యావరణ వ్యవస్థ నిర్మాణమే ప్రధానం

చెరువుచుట్టే పల్లెలు, పట్టణాలు నిర్మాణమైనవి. అటువంటి చెరువును నీటి వనరుల సుస్థిరత మీద ఆధారపడ్డ డెక్కన్ పీఠభూమిలో కొందరు స్వార్థపూరితంగా కబ్జాచేస్తే, ఆక్రమిస్తే ఫలితాలు మొత్తం జీవనం మీద పడుతుంది.ఆరోగ్యకరమైన చెరువుల మీద ఆధారపడి మను ష్యులు, మొక్కలు, సూక్ష్మజీవు లు, జంతువులు మనగలుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సరస్సుల ద్వార ఆహారం వస్తుంది. అనేక జీవనోపాధులు చెరువుల మీద ఆధారపడి ఉంటాయి. వినోదానికి, ఆహ్లాద కరమైన వాతావరణానికి చెరువులే పరిష్కారం.మానవ జీవనం లో చెరువులకు చాలా విలువ ఉన్నది.

ఆరోగ్యం పెంపొందించే చేపలు, ఇతర జలచరాల కోసం చెరువులు ఎప్పటి నుంచో ఉపయోగిస్తున్నాము. చెరువులు కలుషితమైతే, వాటి విస్తీర్ణం తగ్గితే ఇవేవి కూడా మనకు అందవు. పుడమి మీద ఉష్ణోగ్రతలు తగ్గించడానికి, వరదలను నివారించడానికి చెరువులు సహాయపడతాయి. భూ ఉపరితలంలో 5-8 శాతాన్ని మాత్రమే ఆక్రమించినప్పటికీ, సరస్సులు, నదులు, చిత్తడి నేలలు ప్రపంచ నేల కార్బన్ లో 20-30 శాతం నిలువ చేస్తాయి. మానవులు వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడంలో దిగజారిన పర్యావరణ వ్యవస్థలను తిరిగి నిర్మించడం తొలి మెట్టు కాగా చెరువులను రక్షించడం, పునరుద్ధరించడం వంటి ఉపశమన ప్రయత్నాలు ఈ తొలి మెట్టు అందుకోవడంలో చాలా కీలకం.

హైడ్రా చేస్తున్న పని ప్రస్తుత తీవ్ర వాతావరణ మార్పుల నేపథ్యంలో, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవ డంలో భాగంగా మనం చూడాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే చెరువులు చాలా అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే పచ్చదనం, చెట్లు అవసరం. పచ్చద నానికి, చెట్లకు చెరువులు అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే నీటితో నిండిన చెరువుల పాత్ర చాలా ముఖ్యం. ■

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 30-08-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 242 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50




ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచండి

మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

ప్రజారవాణా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలి

మెట్రో బోగీలను ఆరుకు పెంచాలి : సీఎం రేవంత్‌రెడ్డికి తమ్మినేని లేఖ

వివరాలు 15 లో..



అపోహలతో విచారణను బదిలీ చేయలేం

'ఓటుకు నోటు' కేసులో సుప్రీం వ్యాఖ్య

కవిత బెయిల్‌పై సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన ధర్మాసనం

రాజకీయ పార్టీలతో చర్చించి బెయిల్, తీర్పులిస్తున్నామా ? అంటూ నిలదీత

తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అని 'ఓటుకు నోటు' కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే ప్రస్తుత స్థితిలో ఓటుకు నోటు విచారణ బదిలీ పిటిషన్‌ను ముందస్తుగా రద్దు చేయడం లేదని స్పష్టం చేసింది. అలాగే ఢిల్లీ మద్యం కేసులో కవిత బెయిల్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం తప్పుబట్టింది. ఈ వ్యవహారంలో సీఎంను మందలించింది. తదుపరి విచారణను సోమవారం (సెప్టెంబర్ 2)కు వాయిదా వేసింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని, అందుకే ఆ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు, మాజీ డిప్యూటీ సీఎం మహ్మద్ అలీ, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో...15లో

అక్రమార్కులపై హైడ్రా కొరడా..

చెరువుల్లో అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు

సీఎం, సీఎస్, కమిషనర్ ప్రత్యేక దృష్టి

- నిరంతరం సమీక్షలు, అధికారులతో సమావేశాలు
- హైడ్రా పేరిట అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు : సీఎం
- ఏసీబీ, విజిలెన్స్‌లు దృష్టి పెట్టాలంటూ ఆదేశం
- హైడ్రాకు మరిన్ని అధికారాలు
- ఓఆర్ఆర్ పరిధిలోని ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత కూడా ఆ సంస్థకే : సీఎస్ శాంతి కుమారి వెల్లడి
- సీఎం సోదరుడికీ నోటీసులు
- నిబంధనల ప్రకారం లేకుంటే కూల్చేయండి: తిరుపతి రెడ్డి
- హైడ్రాకు రూ.25 లక్షల విరాళమిచ్చిన ఎంపీ అనిల్ యాదవ్





అధికారులతో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రేటర్ పరిధిలో ఒకప్పుడు 200కు పైగా ఉన్న జలాశయాలు నేడు సగం కూడా కనిపించని పరిస్థితి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న హైడ్రా చెరువులను రక్షించేందుకు నడుం కట్టింది. ఈ దెబ్బకు ఆక్రమణదారులు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు తమ మీద పడుతుందోననే ఆందోళన వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటివరకు 18 ప్రాంతాల్లో చిన్నా పెద్దవి కలిపి దాదాపు 200కు పైగా నిర్మాణాలను అది కూల్చేసి నట్టు సమాచారం. 50 ఎకరాల వరకు ప్రభుత్వ, చెరువుల భూములను పరిరక్షించినట్టు హైడ్రా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. విద్య, వైద్య సంస్థల ముసుగులో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు చెరువులు, కుంటలను ...7లో

షోకాజ్ నోటీసులుగా మార్చండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం 7లో..

గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) ఆక్రమణదారులపై కొరడా ఝుళిపిస్తున్నది. ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభిస్తుండటంతో అది జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నది. తన, మన అనే భేదం లేకుండా ఆక్రమణ అని తేలితే చాలు యాక్షన్లోకి దిగి పని పూర్తి చేస్తోంది. గంటల వ్యవధిలో పెద్ద పెద్ద భవంతులను నేలమట్టం చేస్తోంది. ఫలితంగా భూ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎక్కడి నుండి వచ్చి తమ అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తారోనని భయంతో ఆక్రమణదారులు గజగజ వణికిపోతున్నారు. సామాన్య ప్రజల నుంచి బడా నేతలు, సెలబ్రిటీల వరకు అక్రమ కట్టడాలను కూల్చేస్తుండటంతో ప్రజలు హైడ్రాకు జేజేలు పలుకుతున్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా గణేష్ ఉత్సవాలు

అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్

అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి

సుప్రీంకోర్టు నిబంధనలు పరిగణనలోకి తీసుకోవాలి :గణేష్ ఉత్సవ సమితి సమీక్షలో సీఎం రేవంత్

వివరాలు 7 లో..

కవితను చూసి కేసీఆర్ భావోద్వేగం

ఎర్రవల్లి గెస్ట్‌హౌస్‌కు ఎమ్మెల్సీ



నవతెలంగాణ-మర్కుక్

మాజీ సీఎం కేసీఆర్ తన కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఎర్రవల్లి గెస్ట్‌హౌస్‌లో నివాసముంటున్న తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్ దగ్గరికి గురువారం కవిత, ...15లో

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై సమగ్ర అధ్యయనం

- కార్మిక సంఘాల పునరుద్ధరణ చేస్తాం : ఎమ్మెల్యే కూనంనేని, ఏఐటీయూసీ నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరా బాద్‌లో కూనంనేనితోపాటు టీజీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మజీద్, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న కలిసి వినతిపత్రం సమర్పించారు. 2013 బాండ్ డబ్బులు విడుదల చేయాలని కోరగా వెంటనే విడుదల చేస్తా మంటూ సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. కార్మిక సంఘాల పునరుద్ధరణ గురించి ప్రస్తావించగా.. 'ఇంతపెద్ద ఆర్టీసీ సంస్థలో కార్మిక సంఘా ల్లేకుంటే వాళ్ల బాధలు ఎవరికి చెప్పు కుంటారు. కచ్చితంగా కార్మిక సంఘా లను పునరుద్ధరిస్తాం. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే అంశంపై గత ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయలేదు. సంస్థ ఆస్తులకు భంగం కలగకుండా ఉద్యోగుల సౌకర్యాలు, హక్కులకు హాని కలగకుండా సమగ్ర అధ్యయనం చేస్తాం'అని రేవంత్‌రెడ్డి అన్నారని వివరించారు. మిగతా అంశాలను పూర్తిగా అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎస్ బాలరాజుకు ధన్యవాదాలు ప్రకటించారు.

లారీ ఢీకొని విద్యార్థిని మృతి

- హబ్సిగూడలో 15 రోజుల్లో రెండో ఘటన


(ఫైల్)

నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్‌లోని హబ్సిగూడలో లారీ ఢీకొనడంతో మరో విద్యార్థిని మృతిచెందింది. తల్లి, తమ్ముడితో కలిసి పాఠశాల నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక డివిజన్ హనుమాన్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 12లో నివాసముండే సంతోషి-నీల్‌కుమార్ దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు కామేశ్వరి(10) జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతోంది. కుమారుడు వేదాంశ్ సైతం అదే పాఠశాలలో చదువుతున్నాడు. రోజులాగే మధ్యాహ్నం పాఠశాల నుంచి పిల్లలను తీసుకుని సంతోషి తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరింది. హబ్సిగూడలోని అన్‌లిమిటెడ్ షోరూం దగ్గరికి రాగానే వెనుకనుంచి వేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంపై నుంచి వాళ్లు కింద పడిపోయారు. కుడివైపు పడిపోయిన కామేశ్వరి కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను నాచారంలోని ప్రసాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే బాలిక మృతిచెందినట్టు నిర్ధారించారు. లారీ డ్రైవర్ మియారామ్ జట్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో తల్లి కన్నీరుమున్నీరవడం. చూపరులను కంటతడి పెట్టించింది. వారం కిందట కూడా.. ఉదయం పాఠశాలకు వెళ్తున్న ఆటోను హబ్సిగూడలోనే లారీ ఢీకొనడంతో విద్యార్థిని మృతిచెందిన ఘటన మరవకముందే అదే ప్రాంతంలో.. లారీ వల్లే మరో బాలిక ప్రాణం కోల్పోయింది.

సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

- తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని సీపీఐ ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్ బాలమల్లేష్ కలిసి వినతిపత్రం సమర్పిం చారు. వీరోచిత సాయుధ పోరాట చరిత్రను గుర్తించాలని కోరారు. ఆ పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. మఖ్దూంమొహియుద్దీన్ విగ్రహం పక్కనే రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సూచించారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీల విగ్రహాలను సరైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పలు ప్రజాసంఘాల నాయకులు వినతిపత్రాలను సమర్పించారు.

ప్రఖ్యాత న్యాయవాది ఎజి నూరానీ కన్నుమూత


(ఫైల్)

న్యూఢిల్లీ : ప్రఖ్యాత న్యాయవాది, రాజ్యాంగ నిపుణులు, ప్రముఖ రచయిత ఎజి నూరానీ గురువారం ముంబయిలో తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 94 ఏళ్లు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం నూరానీ అంత్యక్రియలు పూర్తి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. న్యాయవాది వృత్తిలో ఎంత ఖ్యాతి గడించిన నూరానీ రచయితగానే అంతే గుర్తింపు పొందారు. 1930 సెప్టెంబరు 16న ముంబయిలో అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ జన్మించారు. విద్యాభ్యాసం అంతా ఇక్కడే గడిచింది. ముంబయిలోని ప్రభుత్వ లా కాలేజీ నుంచి లా డిగ్రీని పొందారు. బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఆయన ప్రాక్టీస్ కొనసాగింది. బ్రిటీష్ పాలనలో ముంబయి హైకోర్టులో ప్రాక్టీస్ చేసిన మొట్టమొదటి భారతీయ న్యాయవాది. 1960 ప్రారంభంలో రచనా వ్యాసాంగంలోకి ప్రవేశించారు. 'ది కాశ్మీర్ డిసిప్యూట్ 1947-2012', 'ఆర్టికల్ 370: ఎ కానిస్టిట్యూనల్ హిస్టరీ ఆఫ్ జమ్మూకాశ్మీర్', 'ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్' వంటి పుస్తకాలు రచించారు.

భయమెరగని రచయిత

అబ్దుల్ గఫూర్ నూరానీ భారత దేశపు అత్యుత్తమ మేధావుల్లో ఒకరుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రఖ్యాత న్యాయవాది, రాజ్యాంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకులుగా ఎంత పేరుతెచుకున్నారో రచయితగానూ అంతే ఖ్యాతి గడించారు. 1960 ప్రారంభంలో రచనా వృత్తిని ప్రారంభించిన నూరానీ తుది శ్వాస వరకూ దానిని కొనిసాగించారు. 94 ఏండ్ల ఏజీ నూరానీ చివరి రోజుల్లో మృత్యువు ఆయన్ని కబలిస్తున్న సమయంలోనూ సుప్రీంకోర్టు బాబ్రీ మసీదు తీర్పుపై పుస్తకం రూపొందించే పనిలో ఉన్నారు. సుదీర్ఘకాలం రచయితగా కొనసాగిన నూరానీ ఏ దశలోనూ నిజాన్ని, ఉద్రేకాన్ని భుజాలపై నుంచి దించలేదు.

మోడల్ రాష్ట్రంలో ఇండ్లపైకి మొసళ్లు..

వర్ష బీభత్సంతో గుజరాత్ అతలాకుతలం

- 40కు పెరిగిన మృతుల సంఖ్య
- నీట మునిగిన పలు ప్రాంతాలు, రోడ్లు, ఇండ్లు
- 939 రహదారులు, 90కిపైగా రైళ్లు బంద్
- దాదాపు 40 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ట్రాఫిక్, విద్యుత్, రైల్వే సర్వీసులకు అంతరాయం
- సహాయక చర్యల్లో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్‌తో పాటు త్రివిధ దళాలు





దేశానికే గుజరాత్ మోడల్ అంటూ ప్రధాని మోడీ చెబుతుంటారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు గుజరాత్‌ను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఇంటి పై కప్పులపై మొసళ్లు తిరుగుతున్నాయి. వర్షబీభత్సంతో జనం బిక్కుబిక్కుమంటూ.. కాపాడాలంటూ దీనంగా ప్రాధేయపడుతున్నారు.

గాంధీనగర్ : గుజరాత్‌లో వర్షాలతో చెరువులు తెగిపోతున్నాయి. వరదలతో ఇండ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అకాల వర్షాలతో ఇప్పటివరకు మృతుల సంఖ్య 40కు పెరిగింది. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి దాదాపు 40 వేల మందిని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. ముఖ్యంగా, సౌరాష్ట్ర ప్రాంతం ఉక్కిరిబిక్కిరయ్యింది. పలు ప్రాంతాలు నీట మునిగాయి. రిజర్వాయర్లు, డ్యామ్‌లు, నదులు ప్రమాదకరస్థాయికి చేరాయి. పలు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. రోడ్లు, ఇండ్లు నీట మునిగాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. విద్యుత్, ట్రాఫిక్, రైల్వే సర్వీసులకు అంతరాయం కలిగింది. ఫలితంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గుజరాత్ తన సగటు వర్షపాతంలో 105 శాతం నమోదు చేసిందని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఈఓసీ) వివరించింది.

పలు సౌరాష్ట్ర జిల్లాలు భారీ వర్షాలను నమోదు చేశాయి. ఇందులో ద్వారక జిల్లాలోని ఖంభలియా తాలూకాలో అత్యధికంగా 454 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది. అధికారుల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 140 రిజర్వాయర్లు, డ్యామ్‌లు, 24 నదులు ప్రమాదకరస్థాయిని మించి మరీ ప్రవహిస్తున్నాయి. నీటి మట్టం వేగంగా పెరుగుతుండటంతో 206 డ్యామ్‌లలో 122 డ్యామ్‌లను హైఅలర్ట్‌లో ఉంచారు. భారీ వర్షాల ధాటికి ట్రాఫిక్‌కు, రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. రోడ్లు, రైల్వే లైన్లు నీటితో నిండిపోయాయి. విశ్వమిత్రి నది ఉప్పొంగటంతో దాని తీర ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికంగా ఇండ్లలో వరద నీరు చేరింది. రోడ్లు, వాహనాలు, ఇండ్లు వరద నీటిలో మునిగి కనిపించాయి. వడోదరలో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. ఇక్కడ 1200 మందికిపైగా ప్రజలను రక్షించినట్టు అధికారులు తెలిపారు. ఇండ్లల్లో, ఇంటిపై ప్రాంతంలో చిక్కుకున్న ప్రజలను రక్షించి, సురక్షిత ప్రాంతాలను తరలించ టానికి వడోదర నగరంలో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, ఆర్మీ సిబ్బంది మోహరించాయి. అలాగే, భారత వైమానిక దళం (ఐఏఎఫ్), కోస్ట్ గార్డ్ కూడా సహాయక చర్యలో పాలుపంచుకున్నాయి. 17,800 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. 2000 మందిని రక్షించాయి.

సౌరాష్ట్ర ప్రాంతంలోని దేవ్‌భూమి ద్వారక, జామ్‌నగర్, రాజ్‌కోట్, పోర్‌బందర్ జిల్లాలు అధిక వర్షాలను నమోదు చేశాయి. ఈ జిల్లాల్లో 50-200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ద్వారక జిల్లాకు చెందిన భన్వడ్ తాలుకా అత్యధికంగా 185 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని చూసింది. సౌరాష్ట్ర జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) అంచనా వేసింది. ఇప్పటికే, గురువారం ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

సీఎంకు మోడీ ఫోన్

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల ప్రభావ పరిస్థితులను తెలుసుకోవటానికి ప్రధాని మోడీ గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో మాట్లాడారు. ప్రకృతి విపత్తు విషయంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రధాని.. సీఎంకు హామీ ఇచ్చారు.

ఇంటి పైకప్పు మీద మొసలి..వీడియో వైరల్

భారీ వర్షాల ధాటికి ఒక మొసలి ఇంటిపైకి వచ్చి చేరిన దృశ్యం వడోదరలో చోటు చేసుకున్నది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ వైరల్‌గా మారింది. న్యూస్ ఏజెన్సీ పీటీఐ ఈ వీడియోను షేర్ చేసింది. భారీ వర్షాలకు వడోదర ప్రాంతంలోని అకోటా స్టేడియం వద్ద భారీగా నీరు చేరింది. ఈ సందర్భంగా అక్కడ ఒక ఇంటి పై కప్పు మీద మొసలి వచ్చింది.

సెప్టెంబరు 19న మిలాద్-ఉన్ నబి ప్రదర్శనలు

ప్రభుత్వ విజ్ఞప్తికి మిలాద్ కమిటీ సానుకూలత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మిలాద్-ఉన్-నబి ప్రదర్శనలను సెప్టెంబరు 19వ తేదీన నిర్వహించుకునేందుకు మిలాద్ కమిటీ ప్రతినిధులు అంగీకరించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 16న మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించాలని మిలాద్ కమిటీ నిర్ణయించింది. మిలాద్ ఉన్ నబి ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబరు ఏడు నుంచి గణేష్ నవరాత్రోత్సవాలు, 17న గణేష్ నిమజ్జనం ఉన్న విషయం చర్చకు వచ్చింది. దీంతో మిలాద్ ఉన్ నబీ ప్రదర్శనలను వాయిదా వేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి, మంత్రులు మిలాద్ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ అంశంపై చర్చించే బాధ్యతను మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ, మిలాద్ కమిటీ సభ్యులకు అప్పగించారు. సమీక్ష అనంతరం వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రదర్శన వాయిదా వేయాలని ప్రభుత్వ ప్రతినిధులు కోరగా మిలాద్ కమిటీ సభ్యులు సానుకూలత వ్యక్తం చేశారు.

మహ్మద్ ప్రవక్త 1499వ జన్మదినం వచ్చే సెప్టెంబర్ 16న జరుగుతుందనీ, వచ్చే ఏడాది 1500వ జన్మదినం కనుక ఏడాది పాటు ఉత్సవాల నిర్వహణకు అనుమతించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మిలాద్ ఉన్ నబి ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మసీదుల అలంకరణ, వివిధ జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలకు అనుమతులు ఇవ్వాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఒక జాబితా తయారు చేసి ఇవ్వాలని కమిటీ సభ్యులకు ముఖ్యమంత్రి సూచించారు. వాటిని పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ వేతనాలు

- పూర్తి సమాచారం పంపండి : రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యామండలి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ ఏడో వేతన సంఘం సిఫారసులను అమలు చేయడానికి పూర్తి సమాచారాన్ని పంపించాలని ఉన్నత విద్యామండలి ఆదేశించింది. ఈ మేరకు రిజిస్ట్రార్లకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ గురువారం లేఖ రాశారు. 2018, ఏప్రిల్ 18న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 11 ప్రకారం విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వివరాలను పంపించాలని కోరారు. విశ్వవిద్యాలయాల వారీగా ఎంత మంది కాంట్రాక్టు అధ్యాపకుల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వివరాలతోపాటు విశ్వవిద్యాలయాలు ఎప్పటికప్పుడు జారీ చేసిన పునరుద్ధరణ సమాచారాన్ని పంపాలని సూచించారు. సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల్లో ఎంత మంది పనిచేస్తున్నారో వివరాలను సమర్పించాలని కోరారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని 12 విశ్వవిద్యాలయాలు వెంటనే పంపాలని ఆదేశించారు.

టీఆక్టా జేఏసీ హర్షం

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్టు అధ్యాపకులకు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా యూజీసీ ఏడో వేతన సంఘం సిఫారసుల ప్రకారం వేతనాలను చెల్లించాలన్న నిర్ణయంపై తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (టీఆక్టా జేఏసీ) చైర్మెన్ శ్రీధర్‌కుమార్‌లోధ్, వర్కింగ్ చైర్మెన్ ఎం రామేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామనీ, వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో 12 విశ్వవిద్యాలయాల పరిధిలో 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు.

38 మంది విద్యార్థులు మరణించినా గురుకులాల పరిస్థితిలో మార్పేది? : బీఆర్‌ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వివిధ కారణాలతో 38 మంది గురుకుల విద్యార్థులు మరణించినా పరిస్థితిలో మార్పు తీసుకురావడం లేదని బీఆర్‌ఎస్ విమర్శించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ పార్టీ నేతలు డాక్టర్ కె.వాసుదేవ రెడ్డి, డాక్టర్ బాలరాజు యాదవ్ మీడియాతో మాట్లాడారు. గురుకులాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కారు గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. తాము ముందు నుంచి హెచ్చరిస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోగా వాటి నుంచి దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తున్నదని తెలిపారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాల మూతపడిందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు కూడా అధ్వాన్నంగా తయారయ్యాయని తెలిపారు.

సీఎం రేవంత్‌కు అక్రమ ఫార్మ్ హౌజ్

సీఎం రేవంత్ రెడ్డికి వట్టి నాగులపల్లిలో అక్రమ ఫార్మ్ హౌజ్ ఉందనీ, ముందు దాన్ని కూల్చాలని వారు డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు కాంగ్రెస్ నిధుల కోసమే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా అనేది కాంగ్రెస్‌కు నిధుల సేకరణ కోసమేనని ఎద్దేవా చేశారు.

సంక్షోభంలో ప్రభుత్వ విద్యారంగం

- పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదీ
- బెంగాల్‌లో వైద్య విద్యార్థిని హత్యాచార నిందితులను శిక్షించాలి
- బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై దాడులకు ఖండన ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జాతీయ అధ్యక్షులు విపి సాను అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి నిధుల్లో కోత విధించి మరింత నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నిర్మాణ వర్క్‌షాప్ గురువారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైంది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విపి సాను మాట్లాడుతూ అంతర్జాతీయంగా బంగ్లాదేశ్‌లో విద్యార్థుల అవిశ్రాంత పోరాటంతో రాజకీయ అనిశ్చితి తలెత్తిందని చెప్పారు. అక్కడ తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని ఫాసిస్ట్ మూకలు హిందువులకు, ముస్లింలకు మధ్య తలెత్తిన సమస్యగా చూస్తున్నారని అన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై దాడులను ఖండిస్తున్నట్టు చెప్పారు. అక్కడ ఇంటి రుణాలపై, చదువుల కోసం తీసుకునే రుణాలపై 20 శాతం వడ్డీ వసూలు చేసిన గ్రామీణ బ్యాంక్ వ్యవస్థాపకుడికి నోబెల్ బహుమతి దక్కిందని గుర్తు చేశారు. అతడే నేడు బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా నియమించడటం వెనుక సామ్రాజ్యవాద దేశాల హస్తం ఉందని విమర్శించారు. బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు దేశంలో పునరావృతం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్సీ, ఐఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, జవహర్ నవోదయ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని సూచించారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి : టి నాగరాజు

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,245 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, శ్రీకాంత్ వర్మ, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కిరణ్, వీరభద్రం, పూజా, అశోక్ రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి భవిష్యత్ కోసం కలిసి నడుస్తాం

- కార్మికుల సంక్షేమం, సంస్థ మనుగడే అత్యంత ముఖ్యం : కొత్త గనులపై ఐదు జాతీయ కార్మిక సంఘాలతో యాజమాన్యం చర్చలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సింగరేణి సంస్థ మనుగడ కోసం, తెలంగాణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం కొత్త బ్లాక్‌లను దక్కించుకుని బొగ్గు ఉత్పత్తి చేయడం అత్యంత అవసరమని ఐదు జాతీయ కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కంపెనీ మనుగడ కోసం యాజమాన్యం తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సంస్థ, కార్మికుల భవిష్యత్తే తమకు ప్రధానమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదల, కంపెనీ భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన వ్యూహాత్మక విధానాలపై గురువారం సింగరేణిభవన్‌లో వాసిరెడ్డి సీతారామయ్య (ఏఐటీయూసీ), జనక్‌ప్రసాద్ (ఐఎన్టీయూసీ), నర్సింహారావు (సీఐటీయూ), రియాజ్ అహ్మద్ (హెచ్ఎంఎస్), యాదగిరి సత్తయ్య (బీఎంఎస్) సంఘాల ముఖ్య నేతలతో సింగరేణి సీఎండీ బలరామ్, ఇతర ఉన్నతాధికారులు మేథోమథనం చేశారు. అంతకు ముందు కొత్త గనుల ఆవశ్యకతను, ఉత్పత్తి వ్యయం, మానవ వనరుల వినియోగం, ప్రస్తుతం బొగ్గు రంగంలో ఎదురవుతున్న సవాళ్లపై సీఎండీ బలరాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. గత తొమ్మిదేండ్లుగా ఒక్క బ్లాక్ కూడా సింగరేణికి దక్కకపోవడంపై అన్ని సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత విధానం కొనసాగిస్తే రానున్న ఆరేండ్లలో బెల్లంపల్లి, మణుగూరు, ఇల్లందు ఏరియాల మనుగడ ప్రశ్నార్థకంగా మారబోతుందని తెలిపారు. ప్రతి ఏడాది కొత్త బొగ్గు గనులు ప్రారంభించుకోకపోతే, సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందని తెలిపారు. రానున్న 15 ఏండ్ల సింగరేణిలో బొగ్గు గనులు గణనీయంగా తగ్గిపోనున్నాయనీ, ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోతుందని డైరెక్టర్లు ఎన్.వి.కె.శ్రీనివాస్ (ఆపరేషన్స్), జి.వెంకటేశ్వరరెడ్డి (పీఅండ్‌పీ) పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వ సంస్థలైన నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్, అస్సాం మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తదితర కంపెనీలు వేలంలో గనులు దక్కించుకుని బొగ్గు తవ్వకాలు చేపట్టాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎం (కో ఆర్డినేషన్) సుభానీ, జీఎం (సీపీపీ) జక్కం రమేశ్, జీఎం (మార్కెటింగ్) రవి ప్రసాద్, జీఎం (పర్సనల్) దీక్షితులు, జీఎం (ఎఫ్ అండ్ ఎ) ఎం.సుబ్బారావు, జీఎం (ఎంఎస్) టి.వి.సురేశ్ బాబు, ఆయా యూనియన్ల నాయకులు కె.రాజ్ కుమార్, ఎస్.నర్సింహారెడ్డి, వై.సారంగపాణి, గడిపెల్లి కృష్ణ ప్రసాద్, నాగరాజ గోపాల్ తదితరులు హాజరయ్యారు.

6న జీపీల్లో పంచాయతీ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితా

- ఆ తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో పార్టీల నేతలతో భేటీలు
- ఓటర్‌లిస్టుపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణ
- ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ సిబ్బందికి శిక్షణలో గైడ్‌లైన్స్ పాటించాలి : రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారధి ఆదేశాలు
- కలెక్టర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వార్డులు, గ్రామపంచాయతీల వారీగా రూపొందించిన ఓటర్ల ముసాయిదా జాబితాను సెప్టెంబర్ ఆరోతేదీన పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్ధసారధి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ రెండో సార్వత్రిక ఎన్నికల ఓటర్ లిస్టు తయారీ, ప్రచురణ పురోగతిపై గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు (హైదరాబాద్ మినహాయింపు), అడిషనల్ కలెక్టర్లు(స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, అసెంబ్లీ నియో జకవర్గాల ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, కమిషనర్ అనితారామచంద్రన్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంగ్రామ్, కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, సెంటర్ ఫర్ గుడ్‌గవర్నెన్స్, ఎన్నికల అధి కారులు పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రూపొందించిన ఓటర్ల లిస్టుల ప్రకారం యధావిధిగా వార్డు, పంచాయతీ వారీగా జాబితాను తయారు చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఆ ముసాయిదా ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయంలో అంటించిన తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో వేర్వేరుగా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేయాలనీ, వారి నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆదేశించారు.



ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే సెప్టెంబర్ 13వ తేదీ వరకు సంబం ధింత మండల పరిషత్ అధికారులకు, జిల్లా పంచాయతీ అధికారులకు రాతపూర్వకంగా తెలపాలని సూచించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆ అధికారులు తగిన చర్యలు తీసుకుని సవరించిన తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 21వ తేదీన ప్రచురించాలని ఆదేశించారు. ఎవరైనా అర్హులైన ఓటర్లు తమ పేర్లను గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలన్నా, ఓటర్లుగా ఉండేందుకు ఆక్షేపణలున్నా నిర్దేశించిన ఎన్నికల ఫారమ్‌ను నింపి సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ ఓటర్ల చేర్పు, తొలగింపు తర్వాతనే గ్రామపంచాయతీ ఓటరు లిస్టును పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఓటర్ లిస్టుల తయారీ తర్వాత వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, తదితర అంశాలపై అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు ఆయన వివరించారు. ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం తయారు చేసిన సర్క్యులర్‌ను తూ.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఓటర్ లిస్టుల తయారీలో పురోగతి, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు.

గ్రీవెన్స్ మాడ్యూల్ విడుదల

సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో రాష్ట్ర ఎన్నికల సంఘం తయారు చేసిన గ్రీవెన్స్ మాడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారధి గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ మాడ్యూల్ ద్వారా ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనపై సాధారణ పౌరులు కూడా ఫిర్యాదు చేయవచ్చుననీ, అలాంటి ఫిర్యాదుదారుల వివరాలు రహస్యంగా ఉంచుతామని హామీనిచ్చారు. ఆ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుని ఫిర్యాదుదారునికి తెలియజేస్తారని వివరించారు. దీనివల్ల ఎన్నికలు మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా గణేష్ ఉత్సవాలు..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ తొలి నుంచి మత సామరస్యానికి, ప్రశాంతతకు పేరు పొందిందనీ, ఆ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలనీ, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలనీ, ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా ఉత్సవాలు, నిమజ్జనం కొనసాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ అధికారి ఏ జోన్‌లో బాధ్యతల్లో ఉన్నారు.. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రముఖులు, మండపాల బాధ్యులు అన్నింటి వివరాలు సమగ్రంగా ఉండాలని సూచించారు.

ఔటర్ రింగు రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలనీ, అలా తీసుకోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లోనే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సరూర్‌నగర్‌తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయనీ, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందుగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు.

నిమజ్జనానికి ముఖ్యతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలనీ, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశముంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చనీ, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబీ, 17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడతాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఏ.వి.ఎస్.రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చెట్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గాలిని కొనాల్సి వస్తుంది

- మొక్కలు పెంచడం అనివార్యం : నర్సరీ మేళా ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మొక్కలను పెంచడం అనివార్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇప్పటి వరకు నీళ్ల మాత్రమే కొంటున్నామనీ, చెట్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గాలిని కూడా కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో 16వ గ్రాండ్ నర్సరీ మేళాపేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టీకల్చర్ షోను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని పట్టణాలకు ఆక్సిజన్ కొనుక్కొనే పరిస్థితి ఉందని చెప్పారు. ఢిల్లీలో ఆక్సిజన్ కేంద్రాలు వెలుస్తున్నాయని గుర్తు చేశారు. మంచినీళ్ల కొనుక్కోవడమే కాకుండా ఆఖరుకు గాలి కూడా కొనుక్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే రూఫ్‌గార్డెన్, వర్టికల్‌గార్డెన్స్ ఇలా ఇంటి నిండా మొక్కలు పెంచుకోవాలనే ప్రజల ఆకాంక్షను చూస్తున్నామని తెలిపారు. ఇంట్లో, ఇంటిపక్కన ఏ మాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలతోపాటు పచ్చదనంగా ఉండేలా మొక్కలు పెంచాలని కోరారు.

తుపాకీతో బెదిరించి ..

- దారి దోపిడీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్
- రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రోడ్డుపై వెళ్తున్న ఒంటరి వ్యక్తులను టార్గెట్ చేసుకొని తుపాకీతో బెదిరించి అందిన కాడికి దోచుకుంటున్న దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ చింతామణిని శ్రీనివాస్ గురువారం మీడియాకు వెల్లడించారు. బీహార్‌కు చెందిన మహమ్మద్ మసూద్ అలం, మహమ్మద్ దిల్బర్, మొహమ్మద్ షానావాజ్.. ముగ్గురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు తమ సొంత రాష్ట్రం బీహార్‌కు వెళ్లి ఒక తుపాకీ కొనుగోలు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా తిరుగుతున్న వ్యక్తులను తుపాకీతో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్లు తీసుకొని వెళ్తున్నారు. ఈనెల 22న జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఒక వ్యక్తిని ఈ ముగ్గురు వ్యక్తులు తుపాకీ, కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.11 వేల నగదును తీసుకొని వెళ్లారు. అలాగే, కిస్మత్‌పూర్ బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న ఒక బైక్‌ను ఆపి అతని వద్ద ఉన్న రూ.200 తీసుకున్నారు. ఈ రెండు ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముఠాలో ప్రధాన నిందితులు మహమ్మద్ ముర్షద్ ఆలాం, మొహమ్మద్ దిల్బర్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహమ్మద్ షానావాస్ మాత్రం పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి ఒక తుపాకీ, తూటా, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ఇల్లు అద్దెకిచ్చే విషయంలో ఇంటి యజమానులు వారిని పూర్తిగా విచారించి వారి ఆధార్‌కార్డు తీసుకున్న తర్వాతనే అద్దెకి ఇవ్వాలని డీసీపీ సూచించారు. వారిపై ఎలాంటి అనుమానం ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన పోలీస్ సిబ్బందికి డీసీపీ రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, డీఐ విజయ్‌కుమార్, రాజేంద్రనగర్ సీఐ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై 'హైడ్రా' కొరడా..



(మొదటిపేజీ తరువాయి)

చెరబట్టారు..ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎం శాంతి కుమారి హైడ్రా కూల్చివేతలపై రోజువారీ సమీక్షలు చేస్తూ తగు సూచనలు చేస్తున్నారు. తరతమ భేదం లేకుండా ఆక్రమణలకు పాల్పడితే తన కుటుంబ సభ్యుల నిర్మాణాలు కూడా కూల్చేయండని సీఎం చెప్పడంతో హైడ్రా మరింత దూకుడు పెంచింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇండ్లు నిర్మించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం నోటీసులు జారీ చేసింది. అయితే హైడ్రా దూకుడుపై హైకోర్టు పలు సూచనలు చేసింది. ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించడంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు వివిధ శాఖల అధికారులతో సీఎస్ గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేటర్ పరిధిలో పలుచోట్ల అనేక చెరువులను ఆక్రమించుకుని భారీ నిర్మాణాలు చేపట్టారు. గత పదేండ్లలో అవి మరీ ఎక్కువగా ఆక్రమణలకు గురయ్యాయనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షణాధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో చేపడుతున్న నిర్మాణాలు నిబంధనల మేరకు జరుగుతున్నాయా? లేదా? అన్నది తనిఖీ చేయాల్సి ఉంటుంది. అనుమతులు లేకపోతే కూల్చివేతలు చేపట్టాలి. పర్యవేక్షణ అధికారులే కాదు ప్రతి విభాగంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కూడా నిర్మాణాలపై ఓ కన్నేసి ఉంచాల్సిన బాధ్యత ఉంది. కొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్లు వేరుగా వేసి నిర్మాణ అనుమతులు తీసుకున్నట్టు కూడా హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రతి రోజూ వందల సంఖ్యలో ఫిర్యాదులు అందుతు న్నాయి. వాటిపై రోజువారీ సమీక్ష నిర్వహిస్తూ ఆయన నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యం లో నిబంధనలకు తిలోదకాలిచ్చి చెరువులు, నాలాలను ఆక్రమించిన వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

అవినీతిపై దృష్టి పెట్టండి: సీఎం రేవంత్‌రెడ్డి

హైడ్రా పేరు చెప్పి అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు విజిలెన్స్, ఏసీబీలను అప్రమత్తం చేశారు. గత కొద్ది రోజులుగా హైడ్రా కూల్చివేతలను ఆసరాగా తీసుకుని కొంత మంది కింది స్థాయి అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకొని డబ్బులు అడుగుతున్నట్టు తెలిసిందన్నారు. అమాయకులను భయపెట్టి డబ్బు వసూలు చేస్తున్నారనీ, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని సీఎం చెప్పారు. అక్రమంగా డబ్బు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు.

హైడ్రాకు మరిన్ని అధికారాలు: సీఎస్

హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఆ సంస్థకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని అప్పగించేందుకు అవసరమైన చర్యలపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె సంబంధిత అధికారులతో చర్చించారు. కూల్చివేతలపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్, తదితర శాఖలు వేర్వేరుగా నోటీసులు ఇస్తుండడంతో గందరగోళం తలెత్తుతోందని సీఎస్ పేర్కొన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు విధివిధానాలను రూపొందించాలని పురపాలక శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. హైడ్రా ఆధ్వర్యంలో ఏర్పాటైన 72 బందాలను మరింత బలోపేతం చేయడానికి పోలీసు, సర్వే, ఇరిగేషన్ తదితర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని కేటాయించనున్నట్టు వివరించారు.

చెరువుల్లో అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు

చెరువులు, కుంటల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై చర్యలకు హైడ్రా సిద్ధమైంది. కూల్చివేతల సమయంలో కొన్ని చోట్ల ఆ సంస్థకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు అనుమతి ఇస్తేనే తాము నిర్మించుకున్నామనీ, ఇందులో తమ తప్పేముందని పలువురు అధికారులను నిలదీస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో మరెవ్వరూ పొరపాటు చేయబోరనే ఉద్దేశంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు హైడ్రా సిఫారసు చేసినట్టు సమాచారం. చందానగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, హెచ్ఎండీ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, గండిపేట సూపరింటెండెంట్, నిజాంపేట మున్సిపల్ కమిషనర్, సర్వేయర్, నిజాంపేట ఎమ్మార్వోలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫారసు చేసినట్టు సమాచారం.

హైడ్రాకు రూ.25 లక్షల నిధులందించిన ఎంపీ అనిల్

గ్రేటర్ పరిధిలో హైడ్రా చేస్తున్న మంచి పనులకు గాను తన ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు అందిస్తున్నట్టు సికింద్రాబాద్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన ఆయన రూ.25 లక్షలు కేటాయిస్తూ లేఖను అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ తరాల గురించి ఆలోచించి, హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకే ఇలాంటి కీలక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.. రాజకీయాల కోసం హైడ్రాపై విమర్శలు ఆపి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి

- ఆ చట్టాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది
- అమలుకు కార్యాచరణ సిద్ధం చేయండి : ఆర్థికశాఖకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రాధాన్యతనివ్వండి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఆ శాఖ ప్రత్యేక అధికారి మిగతా అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఈ అంశాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు సబ్ ప్లాన్ నిధుల్లో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. గురువారం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో 'ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు-ప్రణాళిక'పై వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపుల్లో విద్యకు మొదటి ప్రాధాన్యతని వ్వాలని సూచించారు. అంగన్వాడీలు, పాఠశాలల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారులు, డ్రయినేజీ నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని చెప్పారు.

సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చిన స్ఫూర్తిని కొనసాగించేలా అధికారుల పని విధానం ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని వంద శాతం పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల్లో ఉన్న అధికారులు సబ్ ప్లాన్ చట్టాన్ని అర్థం చేసుకుని చట్టం ప్రకారం వారి నిధులను వారికే ఖర్చు పెట్టాలని సూచించారు. ఈమేరకు ఉన్నతాధికారులు సాధ్య సాధ్యాలను దృష్టిలో పెట్టుకుని మేధోమధనం చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. చట్టం ముఖ్య ఉద్దేశాన్ని అమలు చేసి దళిత, గిరిజన జీవితాల్లో మార్పు తీసుకొస్తేనే దానికి అర్థం, పరమార్థం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆ చట్టంపై యాక్షన్ ప్లాన్ తయారు చేసిన తర్వాత అన్ని శాఖలకు నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఆ తర్వాత వ్యయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీల భూములను అభివృద్ధి చేసేందుకు వీలుగా ఇందిరా జల ప్రభ పథకం అమలు కోసం అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు... దళిత, గిరిజనుల వ్యవసాయం కోసం కావాల్సిన నీటి వనరులను సమకూర్చేందుకు బోర్లు వేయించాలనీ, భూగర్భ జలాలు పెరగడానికి చెక్ డ్యాముల నిర్మాణం చేపట్టాలని కోరారు. పోడు సాగు చేసుకునే ఆదివాసీ రైతులకు ఆదాయం వచ్చేలా, అడవిని కాపాడుకునేలా ఆయిల్‌పామ్, పండ్ల తోటల పెంపకం, అంతర్గత పంటల సాగుకు డిజైన్ చేయాలని సూచించారు. అడవి ద్వారా ఆదాయం ఉండేలా కొత్త పథకాలను తీసుకురావాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపు, వాటి ఖర్చు గురించి అధికారులను భట్టి అడిగి తెలుసుకున్నారు.

షోకాజ్ నోటీసులుగా మార్చండి

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగం ఏరియా, కావూరిహిల్స్ లేఔట్‌లో ఎఫ్‌టీఎల్ ఏరియాలో ఉందని, వాటి కూల్చివేతలకు ఇచ్చిన నోటీసులపై సవాలు చేసిన పిటిషన్లను హైకోర్టు విచారించింది. కూల్చివేత నోటీసులను షోకాజ్ నోటీసులుగా మారుస్తామని ప్రభుత్వ హామీని నమోదు చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. షోకాజ్ నోటీసులపై ఆధారాలు సమర్పించడానికి పిటిషనర్లకు ఆస్కారం ఇవ్వాలన్నది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలోని ఆక్రమణల తొలగింపునకు వీలుగా వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద జారీ చేసిన నోటీసులను షోకాజ్ నోటీసులుగా మార్పు చేస్తూ చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ ఇచ్చిన కూల్చివేత నోటీసులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను ముగించింది.

వర్గీకరణ అమల్లోకొచ్చే వరకు ఫలితాలు నిలిపేయాలి



- క్రిమిలేయర్ లేకుంటే పేద దళిత, గిరిజనులకు న్యాయమెలా? : మంద కృష్ణ మాదిగ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణను అమలు చేసేంత వరకు గ్రూప్ 1 తదితర ఉద్యోగ నియామకాల పరీక్షల ఫలితాలను నిలిపేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) అధ్యక్షులు విరహత్ అలీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుత నియామకాల నుంచే వర్గీకరణను అమలు చేయాలన్నారు. ఇదే విషయంపై రెండు రోజుల్లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్‌ను కలవనున్నట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో క్రిమిలేయర్ అంశంపై మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తున్న వారు పేద దళిత, గిరిజనులను న్యాయమెలా దక్కుతుందో చెప్పడం లేదని విమర్శించారు. సంపన్న దళిత, గిరిజనులకు మాత్రమే ప్రయోజనం కలిగించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీల్లో 1,108 కులాలుంటే ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లతో కేవలం 10 నుంచి 15 కులాలు మాత్రమే జనాభా కంటే ఎక్కువ లబ్ధి పొందాయని చెప్పారు. వర్గీకరణ అమలైతే అన్ని కులాలు తమ జనాభా ప్రాతిపదికన లబ్ధి పొందడానికి వీలు కలుగుతుందని చెప్పారు. గతంలో వర్గీకరణ అమలు అనుభవం ఇదేనని వివరించారు. వర్గీకరణకు సమాజం, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, కమిషన్లు, న్యాయవ్యవస్థ మద్దతుగా నిలిచాయనీ, సమాజానికి ఎమ్మార్పీఎస్ సామాజిక బాధ్యతగా అనేక పోరాటాల ద్వారా కృతజ్ఞతలు తెలిపిందని గుర్తుచేశారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న కొంత మంది తాము సమాజం నుంచి ఒంటరవుతున్నామన్న సోయి కూడా లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

తాను ఏ పార్టీలో చేరబోనని మందకృష్ణ మాదిగ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అణగారిన వర్గాల తరపున మాట్లాడే పరిస్థితి లేనప్పుడు చట్టసభల్లో వెళ్లి చేసేదేముంటుందని ప్రశ్నించారు. తాను స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉన్నప్పుడు మాత్రమే తన వర్గాల తరపున మాట్లాడగలుగుతానని చెప్పారు.

పాఠ్యాంశంగా హౌ టు రెస్పెక్ట్ ఉమెన్

- నేరాల కట్టడికి ద్విముఖ వ్యూహం
- నేరస్తులను సత్వర శిక్ష, ప్రజలకు అవగాహన కల్పన
- హైడ్రా తరహాలో పోలీస్ శాఖ స్వేచ్ఛగా పనిచేయాలి : మానవ అక్రమ రవాణా నివారణ సదస్సులో మంత్రి డాక్టర్ సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పిల్లల్లో మహిళల పట్ల గౌరవం పెంచేందుకుగానూ హౌ టూ రెస్పెక్ట్ ఉమెన్ అనే పేరుతో ఒక పాఠ్యాంశాన్ని చేరుస్తామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. శిక్ష, శిక్షణ ఏకకాలంలో జరిగినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని అభిప్రాయపడ్డారు. నేరం జరిగిన వెంటనే బాధితులకు సత్వర న్యాయం చేయడంతో పాటు, నిందితులకు త్వరగా శిక్షపడేలా వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించారు. నేరాల కట్టడికి ద్విముఖ వ్యూహాన్ని అనుసరించాలని కోరారు. మానవ అక్రమ రవాణా నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో సదస్సును ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో అమ్మాయిలు మహిళల భద్రత కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. షీ టీం వ్యవస్థ, టి సేఫ్ యాప్ మహిళలకు భద్రత కల్పించడంతోపాటు భరోసానిస్తుందని చెప్పారు. మహిళలపై నేరాలను తగ్గించే విధంగా ఉమెన్స్ సేఫ్టీ వింగ్ పనిచేస్తుందని అభినందించారు. పేదరికం, వెట్టి చాకిరి ఆసరాగా కూలీలు, మహిళలు, పిల్లలను అక్రమ రవాణా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ అక్రమ రవాణా నివారణ కోసం.. దాని చుట్టూ అల్లుకొని ఉన్న ఆర్థిక సమస్యలను ఛేదించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

మహిళల పట్ల చిన్న చూపు కొనసాగడమే హత్యలకు, లైంగికదాడులకు కారణమవుతుందని అభిప్రాయపడ్డారు. మహిళలను సెక్స్ సింబల్‌గా, వ్యాపార వస్తువుగా చూసే విధానం పోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌కు భద్రత లేకపోతే ఇంకా మహిళలకు ఎక్కడ భద్రత ఉంటుందని మంత్రి ప్రశ్నించారు. పురుషులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. తమ పిల్లలకి మహిళలను గౌరవించడం నేర్పాలని, లింగ బేధం లేకుండా అమ్మాయి అబ్బాయిలను మధ్య వివక్ష చూపకుండా సమానంగా పెంచాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలలు, చిన్నారులు మీద జరుగుతున్న అఘాయిత్యాలకు గంజాయి వ్యసనం కూడా కారణంగా కనిపిస్తోందని చెప్పారు. వ్యసనాల నుంచి సమాజాన్ని బయటికి తీసుకొచ్చేలా డ్రగ్స్ మహమ్మారిపై తమ ప్రభుత్వం యుద్ధం చేస్తున్నదన్నారు.

నేరస్తులపై చర్యలు తీసుకునే విధంగా పోలీస్ వ్యవస్థకు తమ ప్రభుత్వం స్వేచ్ఛనిచ్చిందనీ, ఇక్కడ ఎవరికీ తలవంచకుండా పోలీసులు వ్యవస్థ పని చేయాలని కోరారు. నేరం ప్రాతిపదికన పని చేయాలి తప్ప నేరస్తుడి బ్యాక్ గ్రౌండ్ను పట్టించుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. హైడ్రా తరహాలో అందరి పట్ల ఒకే రకంగా వ్యవహరించాలని విన్నవించారు. గుడిసెలో బతికే ఆడబిడ్డకైనా నేనున్నాను అనే భరోసా పోలీస్ శాఖ కల్పించినప్పుడే మహిళ సాధికారత సాధ్యపడుతుందన్నారు. రెండు రోజులపాటు మానవ అక్రమ రవాణాపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తే అమలు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీనిచ్చారు. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖా గోయల్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ప్రజ్వల ఫౌండేషన్ నిర్వాహకురాలు సునీతా కృష్ణన్‌తో పాటు ఐదు రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

కేంద్రానికి రూ.3,662 కోట్ల ఎల్ఐసీ డివిడెండ్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) కేంద్రానికి రూ.3,662.17 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్దార్థ మోహంతి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం అందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ డివిడెండ్‌ను ప్రకటించింది. ఆగస్టు 22న జరిగిన ఎల్ఐసీ వార్షిక జనరల్ బాడీ మీటింగ్‌లో దీనికి ఆమోదం తెలిపారు. ఎల్ఐసీలో కేంద్రానికి ప్రస్తుతం 96.50 శాతం వాటా ఉంది.

హైదరాబాద్‌లో కొచ్చర్ అండ్ కో విస్తరణ

హైదరాబాద్ : కొచ్చర్ అండ్ కో తమ హైదరాబాద్ కార్యాలయంను విస్తరించినట్లు ప్రకటించింది. తమ నూతన కార్యాలయాన్ని జూబ్లీహిల్స్‌లోని ద్వారకా స్క్వేర్ వద్ద ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. 'మా కొత్త, అత్యాధునిక కార్యాలయం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతంలోని మా కార్యాచరణ సామర్థ్యాలలో ఒక పెద్ద ముందడుగును సూచిస్తుంది. ఈ అప్‌గ్రేడ్ సమగ్ర చట్టపరమైన పరిష్కారాలను అందించడంలో మా దృఢమైన అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది . స్థానికంగా వృత్తి నైపుణ్యం, క్లయింట్ సేవ అత్యున్నత ప్రమాణాలను నిర్వహించాలనే మా నిబద్ధతను నొక్కి చెబుతుంది" అని కొచర్ అండ్ కో మేనేజింగ్ పార్టనర్ రోహిత్ కొచ్చర్ పేర్కొన్నారు.

సెంట్రల్ బ్యాంక్‌లో స్పోర్ట్స్ దినోత్సవం

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ ఆఫీసులో ఆటల దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్ కె ముఖ్య అతిథిగా పాల్గొనగా.. డిజిహెచ్ రామక్రిష్ణన్, డిజిఎం సురేష్, రీజినల్ హెడ్ కనక రాజు, ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు



చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు

- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు
- సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి సైతం నోటీసు



నవతెలంగాణ- మియాపూర్

చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. చెరువులు, కుంటలు నాలాల పరిరక్షణకు మరో ముందడుగు వేసింది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పరిధిలోని దుర్గం చెరువు పరిరక్షణ కోసం చర్యలకు ఉపక్రమించింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కావూరి హిల్స్, అమర్ సొసైటీ నివాసితులకు శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. సుమారు 200 మందికిపైగా నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు పలు ఇండ్లకు అధికారులు నోటీసులను అంటించారు. వీరిలో రాజకీయ, సినీ ప్రముఖులతోపాటు ఐఏఎస్, ఇతర ముఖ్య అధికారులు సైతం ఉన్నట్టు తెలుస్తోంది. వీరికి నెల రోజుల గడువు ఇస్తూ ఎఫ్టీఎల్‌లో ఆక్రమించి కట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా కూల్చివేయాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో తామే కూల్చివేతలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒక్కరోజే ఈ నాలుగు కాలనీల్లోని వందల ఇండ్లు, వాణిజ్య సముదాయాలకు వాల్టా చట్టంలోని సెక్షన్ 23(1) కింద నోటీసులు ఇచ్చారు. దీంతో దుర్గం చెరువు పరిసర కాలనీలో ఇప్పుడు నోటీసుల అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది.

సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం నోటీసు

సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. అమర్ కో ఆపరేటివ్ సొసైటీలో ఆయన నివాసం ఉంటున్నారు. ఇది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండటంతో అధికారులు ఆయన ఇంటికి సైతం నోటీసులు అంటించారు. అయితే దీనిపై తిరుపతిరెడ్డి స్పందించారు. తాను అక్కడ ఇల్లు కట్టలేదని, మరొకరి వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆ ఇంటికి సంబంధించిన అన్ని పత్రాలు తన వద్ద ఉన్నాయన్నారు. అయినప్పటికీ తన ఇల్లు నిబంధనలు మేరకు లేకుంటే ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.


నల్లగొండలో...


యాదాద్రిలో...



జగిత్యాలలో...

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

అర్హులైన రైతులందరికీ న్యాయం చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

- రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం.. ఎలాంటి షరతులు, ఆంక్షలు లేకుండా రైతులందర్నీ రుణవిముక్తులను చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాంకేతిక పేరుతో కాలయాపన చేయకుండా, అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేసి, తిరిగి రుణాలు ఇవ్వాలని కోరారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్, మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు. రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని, ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ అనేది సాహసోపేతమైన నిర్ణయమని, దాన్ని తాము స్వాగతించామన్నారు. తొలుత ప్రతి రైతుకూ రూ.2లక్షలు అని చెప్పిన ప్రభుత్వం తర్వాత రైతు కుటుంబానికి అని మాట మార్చిందని, అది కూడా అందరికీ మాఫీ చేయడం లేదన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 567లో అనేక నిబంధనలు విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రూ.22 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా జమ చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్ధానం ప్రకారం రుణం తీసుకున్న ప్రతిరైతుకు రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఆందోళన నిర్వహించారు. పెన్‌పహాడ్, మునగాల, నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. గుండాల మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మోత్కూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఆధ్వర్యంలో అనంతరం డీఆర్‌ఓ పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రైతు సంఘం సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కొండపాక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో రైతులు ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా అమనగల్ సిండికేట్ బ్యాంక్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ డివిజన్ కేంద్రంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. కొల్లాపూర్, పెంట్లవల్లి మండలాల్లో ఆర్డీవో కార్యాలయాల ముందు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం ఇచ్చారు. కొల్లాపూర్‌లో ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. వనపర్తి జిల్లా వనపర్తి, పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. జోగులంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు.

ధరూర్‌లోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్మూర్, మాక్లూర్‌లో తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బోధన్‌లో ఆర్‌డీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ప్రతీ ఐదు రోజులకు ఓ కుబేరుడు

దేశంలో కొత్తగా పుట్టుకొస్తున్నారు

- చైనాలో తగ్గిన సంఖ్య
- షారుక్ ఖాన్‌కు తొలిసారి చోటు
- పిన్న వయస్సులో జెప్టో వ్యవస్థాపకులు



న్యూఢిల్లీ : దేశంలో అధిక ధరలతో ఓ వైపు పేదలు, మధ్యతరగతి ప్రజల ఆదాయాలు హరించుకుపోతుంటే.. మరోవైపు సంపన్నుల ఆదాయాలు కోట్ల రూపాయాల్లో పెరిగిపోతున్నాయి. భారత్‌లో ప్రతీ ఐదు రోజులకు ఒక్క కుబేరుడు పుట్టుకొస్తున్నారని హురున్ ఇండియా వెల్లడించింది. గతేడాది వీరి సంఖ్య 29 శాతం పెరిగిందని హురున్ ఇండియా వ్యవస్థాపకులు అనస్ రెహమాన్ జునైద్ వెల్లడించారు. దేశంలో రికార్డ్ స్థాయిలో 334 మంది బిలియనీర్లు నమోదయ్యారని తెలిపారు. మరోవైపు చైనాలో బిలియనీర్ల సంఖ్య 25 శాతం పడిపోయిందన్నారు. జులై 31 నాటి గణాంకాలను ఆధారంగా చేసుకొని హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024 నివేదికను ప్రకటించింది. గౌతం అదానీ అగ్రస్థానంలో నిలువగా.. ముకేష్ అంబానీ రెండో స్థానానికి పడిపోయారు. మొదటిసారిగా బాలివుడ్ నటుడు షారుఖ్ ఖాన్ హురున్ ఇండియా రిచ్ లిస్టులో చోటు సంపాదించారు. ఐపిఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్‌లో తాను వాటాలు కలిగి ఉండడంతో వాటి విలువ పెరిగింది. దాంతో మొత్తంగా రూ.7,300 కోట్లతో ఈ లిస్ట్‌లో స్థానం సంపాదించారు.

గతేడాది అదానీ సంపద 95 శాతం పెరిగి రూ.11.61 లక్షల కోట్లకు చేరింది. అంబానీ సంపద రూ.10.14 లక్షల కోట్లుగా ఉంది. గత ఐదేళ్లుగా శివ్ నాడార్, సైరస్ ఎస్ పూనావాలా అండ్ ఫ్యామిలీ, గోపిచంద్ హిందుజా అండ్ ఫ్యామిలీ, డీమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ అండ్ ఫ్యామిలీ టాప్ 10 స్థానాల్లో ఉన్నారు. సినీ ప్రముఖుల విషయంలో జుహీ చావ్లా, హృతిక్ రోషన్, అమితాబ్, కరణ్ జోహార్ టాప్-5లో నిలిచారు. ఈ జాబితాలో జెప్టో వ్యవస్థాపకుడు 21 ఏండ్ల కైవల్య వోహ్రా అతి పిన్న వయసులోనే బిలియనీర్‌గా నమోదయ్యారు. ఆ సంస్థ మరో సహ వ్యవస్థాపకుడు 22 ఏండ్ల అదిత్ పలిచా ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు.

కాశ్మీర్ అభ్యర్థుల జాబితాలో ఓబీసీలు ఏరి ?

బీజేపీలో అసంతృప్తి



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ శాసనసభ ఎన్నికల కోసం పార్టీ ప్రకటించిన అభ్యర్థుల్లో ఓబీసీలకు ప్రాతినిధ్యం లభించకపోవడంపై బీజేపీలో అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఇప్పటికే మూడు జాబితాలు ప్రకటించినప్పటికీ ఒక్క ఓబీసీ అభ్యర్థికి కూడా చోటు దక్కలేదని పార్టీ నేతలు బాహాటంగానే మండిపడుతున్నారు. జనాభాలో 30-40 శాతంగా ఉన్న ఓబీసీలకు అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యతే కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమకు జరిగిన అన్యాయంపై ఓబీసీ ఓటర్లు కూడా రగిలిపోతున్నారు. తమ హక్కులను పరిరక్షిస్తామని బీజేపీ హామీలు కురిపించిందని, కానీ చేసిందేమీ లేదని వారు ధ్వజమెత్తారు. అభ్యర్థుల తదుపరి జాబితాలో అయినా తమకు ప్రాతినిధ్యం కల్పిస్తారేమోనని బీజేపీలోని ఓబీసీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. అయితే ఆ ఆశలేవీ నెరవేరేలా లేవు. జమ్మూ ప్రాంతంలోని ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వీటిలో మూడు స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. మిగిలిన మూడు స్థానాల కోసం అభ్యర్థుల్లో పోటీ అధికంగా ఉన్నదని, ఈ నేపథ్యంలో ఓబీసీలకు కనీసం ఒక స్థానమైనా కేటాయించే అవకాశాలు కూడా లేవని పార్టీ వర్గాలు తేల్చేశాయి. జమ్మూ ప్రాంతంలో 43, కాశ్మీర్ ప్రాంతంలో 47 శాసనసభ స్థానాలు ఉన్నాయి. బీజేపీ ఇప్పటి వరకూ ప్రకటించిన జాబితాలో 14 మంది ముస్లింలకు చోటు కల్పించారు. అయితే ఆ జాబితాలో ఓబీసీలకు చెందిన వారు ఒక్కరూ లేరు. అన్ని వర్గాలకూ సమాన ప్రాతినిధ్యం కల్పిస్తామని పార్టీ చెబుతోందని, కానీ ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని బీజేపీ నేత ఒకరు అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ ఇప్పటి వరకూ 44 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. రాష్ట్రంలో కనీసం 58 స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ భావిస్తోంది. మిగిలిన స్థానాల్లో బలమైన స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ఇస్తామని సీనియర్ నాయకుడొకరు చెప్పారు. బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో ఎక్కువ మంది నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, కాంగ్రెస్, అప్నీ పార్టీ నుండి వలస వచ్చిన వారే. అయితే వీరిలో ఒక్కరు కూడా ఓబీసీ లేరు.

మహిళల్లో స్టెరిలైజేషన్ అధికం

పురుషులకంటే పది రెట్లు ఎక్కువ

- స్త్రీల మీదే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ భారం
- ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదేండ్లలో ఇదీ పరిస్థితి



రాయ్‌పూర్ : కుటుంబ నియంత్రణ(స్టెరిలైజేషన్)కు సంబంధించి అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ.. ప్రజల ఆలోచనలో మార్పు కనిపించటం లేదు. దీంతో, ఇలాంటి ఆపరేషన్లు చేయించుకోవాల్సిన బాధ్యత మహిళల మీదనే పడుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదేండ్లలో నమోదైన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల సంఖ్య ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. ఇక్కడ పురుషుల కంటే మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పది రెట్లు అధికంగా ఉన్నాయి. కుటుంబ నియంత్రణ కోసం మహిళలకు చేసే ఆపరేషన్‌ను వైద్య పరిభాషలో ట్యూబెక్టమీ అనీ, పురుషులకు సంబంధించి వేసెక్టమీ అని అంటారు. అయితే, ఈ స్టెరిలైజేషన్ భారం మహిళల మీదనే పడుతున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా ఈ పరిస్థితి కనబడుతున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. గత ఐదేండ్లలో ఛత్తీస్‌గఢ్‌లో 2,92,668 మంది మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఆశ్రయించారు. అయితే, పురుషుల విషయంలో ఈ సంఖ్య 25,308గా మాత్రమే ఉండటం గమనార్హం. అయితే, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలో అవగాహన కార్యక్రమాలు మంచి ఫలితాలనే ఇస్తున్నా.. ఇప్పటికీ చాలా మందిలో పలు అపోహలున్నాయని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌తో మహిళలు, పురుషుల్లో ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావమూ ఉండదని అన్నారు. సుముఖత చూపకపోవటం, విద్య అనే అంశాలు కూడా జనన నియంత్రణ ఆపరేషన్ల విషయంలో మహిళలతో పోలిస్తే పురుషులు వెనకబడిపోయి ఉన్నారని ఆరోగ్యాధికారులు చెప్తున్నారు. అంతేకాకుండా, పురుషుల స్టెరిలైజేషన్ ప్రక్రియ సరళంగా ఉండటంతో పాటు త్వరగా అయిపోతుందని వివరిస్తున్నారు. ఇక స్టెరిలైజేషన్ చేయించుకునేవారి కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రోత్సాహకం పురుషులకు రూ.3000లు కాగా, మహిళలకు రూ.2000గా ఉన్నది.

కుటుంబ నియంత్రణ ఆపరేష్ల భారం మహిళలపై పడుతున్న దృగ్విషయం ఒక్క ఛత్తీస్‌గఢ్‌కు మాత్రమే పరిమితం కాలేదనీ, ఇదే పరిస్థితి భారత్‌లోని మిగతా రాష్ట్రాల్లో సైతం కనిపిస్తున్నదని కొందరు వైద్య నిపుణులు అంటున్నారు. ప్రభుత్వాలు నిర్వహించే అవగాహనా కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా ఉండాలని వారు సూచిస్తున్నారు.



కారుణ్య నియామకాలు చేపట్టాలి

చనిపోయిన కుటుంబాల పిల్లల విజ్ఞప్తి

సీఎం దృష్టికి తీసుకెళ్తాం : టీఎన్జీవో నేతల హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జిల్లా పరిషత్ జూనియర్ అసిస్టెంట్ కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల పిల్లలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లును గురువారం హైదరాబాద్‌లో పలు కుటుంబాలకు చెందిన పిల్లలు కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌లలో కారుణ్య నియామకాల ద్వారా జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలను కల్పించాలని కోరుతూ 2016 నుంచి దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగాలు రాలేదని పేర్కొన్నారు. తాము డిగ్రీ, పీజీ చదువులు పూర్తి చేసుకుని ఎనిమిదేండ్లుగా కుటుంబాలకు భారంగా బతకులీడుస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు జిల్లా పరిషత్ వివిధ కార్యాలయాల్లో కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏండ్లకు పెంచడం, వీఆర్వో ఉద్యోగాలను రద్దుచేసి వారిని ఇతర శాఖల్లో గత ప్రభుత్వం విలీనంతోపాటు సర్దుబాటు చేసిందని వివరించారు. దీంతో అన్ని శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలు నిండిపోయాయని తెలిపారు. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న తమలాంటి వారికి తీవ్ర ఇబ్బంది కలిగిందని పేర్కొన్నారు. అందువల్ల గత ప్రభుత్వం 2023, జులై 20న జీవోనెంబర్ 79 ద్వారా ఆఫీసు సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసిందని వివరించారు. ఆ పోస్టుల నియామక బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించిందని తెలిపారు. అన్ని శాఖల్లో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఉద్యోగాలను కల్పించారనీ, కేవలం జిల్లా పరిషత్‌లలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం ఇప్పటివరకు నోడల్ అధికారిగా ఉన్న జిల్లా పరిషత్ సీఈవో ఉండడం వల్ల ఉద్యోగాలు దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ 79 జీవో ఆధారంగా ఇతర శాఖల్లో అభ్యర్థులను సూపర్ న్యూమరరీ పోస్టులను కల్పించినట్టు జిల్లా పరిషత్ వారికి కూడా ఈ విధానం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని సూచించారు. అందుకు సంబంధించిన దస్త్రం సిద్ధమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉందని తెలిపారు. ఈ విషయంలో టీఎన్జీవో నాయకులు చొరవ తీసుకుని జిల్లా పరిషత్‌లలో ఎనిమిదేండ్లుగా కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల చెందిన తమకు ఉద్యోగాలు కల్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

తప్పకుండా కృషిచేస్తాం : టీఎన్జీవో నేతలు

త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి తప్పకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జిల్లా పరిషత్‌లోని జూనియర్ అసిస్టెంట్ కారుణ్య నియామకాలు ఇప్పించేలా తప్పకుండా కృషిచేస్తామని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ వారికి భరోసా ఇచ్చారు. ఎవరు కూడా అధైర్య పడకుండా ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని కోరారు. ఈ సమస్యను మానవతా దృక్పథంతో ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల పిల్లలు బి భాగ్య, ఆర్ నాగమణి, ఎస్ భారత్, కే సంతోష్, ఎన్ రాహుల్, పీ విజయ రెడ్డి, ఎస్ శ్రీకృష్ణ, పి శ్రీకుమార్, బి కిరణ్ కుమార్, మీరాజ్ హాయ్, రామకృష్ణ, బి రమేష్, ఎం సాయికృష్ణ, ఆర్ శ్రీకాంత్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో దేశాల మధ్య సంఘీభావం, సమన్వయం అవశ్యం

చైనా నేత జిన్‌పింగ్ స్పష్టీకరణ అమెరికా జాతీయ భద్రతా సలహాదారుతో భేటీ



బీజింగ్ : అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్‌తో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ గురువారం ఇక్కడి గ్రేట్‌హాల్ ఆఫ్ ది పీపుల్ భవనంలో సమావేశమయ్యారు. ప్రస్తుతం వేగంగా మారుతున్న పరిణామాలు, అల్లకల్లోలంగా వున్న ఈనాటి ప్రపంచంలో దేశాల మధ్య సంఘీభావం, సమన్వయం వుండాల్సిన అవసరం వుందని, కానీ విభజన లేదా సంఘర్షణలు కాదని జిన్‌పింగ్ పేర్కొన్నారు. పారదర్శకత, పురోగతిని ప్రజలు కోరుకుంటారని, అంతేకానీ బహిష్కరణలు లేదా తిరోగమనాలు కోరుకోరని ఆయన వ్యాఖ్యానించారు. రెండు ప్రధాన దేశాలుగా చైనా, అమెరికాలు చరిత్రకు, ప్రజలకు, యావత్ ప్రపంచానికి బాధ్యత వహించాల్సి వుందన్నారు. ప్రపంచ శాంతి, ఉమ్మడి అభివృద్ధి ప్రయోజనాలకు ఒక స్థిరమైన వనరుగా వుండాలని జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు.

రెండు దేశాల్లోనూ అలాగే చైనా-అమెరికా సంబంధాల్లోనూ గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. సుస్థిరమైన, ఆరోగ్యకరమైన, నిలకడతో కూడిన చైనా-అమెరికా సంబంధాల పట్ల చైనా నిబద్ధత విషయంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, సమాన అవకాశాలు, సహకారం ప్రాతిపదికన సంబంధాలు కొనసాగాలన్న మౌలిక సూత్రంలో మార్పు లేదన్నారు. దేశ సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాల విషయంలో చైనా వైఖరి ధృఢంగా వుందన్నారు. చైనా, అమెరికా ప్రజల మధ్య నెలకొన్న సాంప్రదాయ స్నేహ బంధాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో కూడా ఎలాంటి మార్పు లేదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. అమెరికా కూడా ఇదే దిశా నిర్దేశంతో చైనాతో కలిసి పనిచేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చైనాను, చైనా అభివృద్ధిని సానుకూల, సహేతుకమైన కోణంలో చూడగలదని ఆశిస్తున్నట్లు తెలిపారు. పరస్పర అభివృద్ధిని సవాలుగా తీసుకోవడం కన్నా ఒక అవకాశంగా చూడాల్సి వుందన్నారు. రెండు దేశాలు కలిసి ముందుకు సాగేందుకు సరైన మార్గాన్ని కనుగొనడంలో చైనాతో కలిసి పనిచేయగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు.

లక్ష్యానికి దూరంగా దుస్తుల ఉత్పత్తి

అధికంగా ఉన్న తయారీ ఖర్చు



న్యూఢిల్లీ : 2030 నాటికి వస్త్రాలు, దుస్తుల ఎగుమతులను వంద బిలియన్ డాలర్లకు చేర్చాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో ఒక్క దుస్తుల వాటాయే 50-60 శాతం. ఉత్పత్తిని పెంచితే దేశంలో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అయితే ఈ రంగంలో మన రికార్డును పరిశీలిస్తే అదేమంత తేలిక కాదని అర్థమవుతుంది. 2015-2020 మధ్యకాలంలో మన దేశం నుండి దుస్తుల ఎగుమతి 16-19 బిలియన్ డాలర్లు దాటలేదు. అదే సమయంలో వియత్నాం తన ఎగుమతులను 70 శాతం పెంచింది. బంగ్లాదేశ్ కూడా రెట్టింపు చేసింది.

పరిస్థితుల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని కేంద్రం గుర్తించింది. అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో ఉపాధితో ముడిపడిన ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించింది. అయితే బంగ్లాదేశ్, వియత్నాంతో పోలిస్తే మన దేశంలో దుస్తుల తయారీ ఖర్చు చాలా ఎక్కువ. ఉదాహరణకు దేశంలోని దుస్తుల తయారీ పరిశ్రమ రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తూ ఏడాదికి 60 లక్షల పాలియస్టర్ టీ-షర్టులు ఉత్పత్తి చేస్తుందని అనుకుందాం. అప్పుడు ఒక్కో టీ-షర్ట్ ఉత్పత్తికి రూ.238 ఖర్చవుతుంది. అదే బంగ్లాదేశ్, వియత్నాంలో కేవలం రూ.24 మాత్రమే అవుతుంది. అదీకాక ఫ్యాబ్రిక్స్...ముఖ్యంగా సింథటిక్ ఫ్యాబ్రిక్స్ దిగుమతులపై మన ప్రభుత్వం అధిక సుంకాన్ని వసూలు చేస్తోంది. వియత్నాం 12 శాతం వసూలు చేస్తుంటే మన ప్రభుత్వం 20 శాతం వసూలు చేస్తోంది. ముడి సరుకు ఖర్చు అధికంగా ఉండడంతో స్థానిక దుస్తులు కూడా ఎక్కువ ధర పలుకుతున్నాయి. పనివారు తయారు చేసే దుస్తుల ధరలు అంతర్జాతీయ ధరల కంటే అధికంగా ఉంటున్నాయి.

తాగునీటి సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్య నగర్ కాలనీలో డ్రయినేజీ పనులను చేస్తుండగా తాగునీటి పైపులైను పగిలిపోయింది. దీంతో కాలనీవాసులు ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డికి తెలియజేశారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పగిలిపోయిన పైపులైను స్థానంలో కొత్త వాటిని అమర్చారు. దీంతో కాలనీవాసులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కృష్ణ, సిబ్బంది, కాలనీవాసులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్

ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు గౌడ్



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన నాగరాజు రాచకొండ కమిషనరేట్‌లోని మాడ్గుల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీపై హయత్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ వచ్చే వినాయక చవితి పండుగను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు.రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంటుందన్నారు.

వినాయక చవితి సందర్భంగా అధికారులతో సమీక్ష



నవతెలంగాణ - ఎల్బీనగర్

రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో గణపతి విగ్రహాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. కాలనీలలో గుంతలుగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూసుకోవాలని సూచించారు. వినాయక మండపాల వద్ద శుభ్రతగా ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఈఈ రమేష్ బాబు, స్ట్రీట్ లైట్స్ ఏఈ జగన్నాథం, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ ఏడుకొండలు, హార్టికల్చర్ మేనేజర్ మేధ, కరెంట్ ఏఈ రణధీర్, ఎంటమాలజీ ఏఈ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సెప్టెంబర్ 10లోగా పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగిలిన పనులను వచ్చేనెల 10లోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ప్రత్యేక అధికారులు, డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐవోఎస్‌లు, డీఈలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆదర్శ పాఠశాలలో భాగంగా 384 పాఠశాలల్లో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 306 పాఠశాలల్లో పనులు పూర్తయినవని, 78 పాఠశాలల్లో పనులు 80 శాతం పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన పనులను వచ్చేనెల 10లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన తాగునీరు సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, రిపేర్ తదితర పనులను ప్రత్యేక అధికారులు, డిప్యూటీ ఈవోలు, ఐవోఎస్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తనఖీ చేయాలన్నారు. డిప్యూటీ ఐవోఎస్‌లు పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లో ఉన్న సమస్యలను, పరిస్థితులను పరిశీలన చేయాలని, ఎఫ్ఆర్ఎస్ 100శాతం నమోదయ్యేలా.. విద్యార్థులు హాజరు శాతం పెరిగేలా చూడాలన్నారు. ప్రత్యేక అధికారులు పాఠశాలను సందర్శినప్పుడు ఎఫ్ఆర్ఎస్, అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్ అప్‌డేట్, కాంప్లెక్స్ హెచ్ఎం, ఎమ్ఎన్ఓల సందర్శన, ఏపీసీలో మిగిలిన 78 పాఠ శాలలో పనులు వచ్చేనెల 10 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు.

అనంతరం విద్యాశాఖపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు విద్యార్థుల హాజరు శాతం పెంచుటకు కృషి చేయా లని తెలిపారు. పనితీరు సరిగా లేని డిప్యూటీ ఐవో ఎస్‌లు బండ్లగూడ లక్ష్మణ్ సింగ్, షేక్ పేట్ యా దగిరి, బహదూర్‌పూర-2, (ఈబీ) ఖలీల్ అహ్మద్, బహదూర్ పుర కుల్దీప్ కౌర్, ఆసిఫ్‌నగర్, ఎండి ముస్తఫాలకు షోకాస్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, ప్రత్యేక అధికారులు, డిప్యూటీ ఈవోలు, ఐవోఎస్‌లు పాల్గొన్నారు.





- ఇప్పటి వరకు 306 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి
- ప్రభుత్వ పాఠశాలల్లో షిఫ్ట్ విధానం లేకుండా చూడాలి
- పనిచేయని డిప్యూటీ ఐవోఎస్‌లకు షోకాస్ నోటీసులు : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీలో వనస్థలిపురం భక్త సమాజం, సంస్కార భారతి సంయుక్తంగా గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై మాట్లాడారు. తెలుగు భాషా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రతి సంవత్సరం ఆగస్టు 29న తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటామని అన్నారు. మన భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయులను స్మరించుకుందామని, అమ్మభాషకు సేవ చేసిన తెలుగు పెద్దలకు కృతజ్ఞతలు చెబుదామని పేర్కొన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ మన భాషను సుసంపన్నం చేసుకుందామని తెలిపారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించే బృహత్తర బాధ్యత తీసుకుందామన్నారు. అదే వారికి మనమిచ్చే ఘననివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్‌వి ఆర్ కె మూర్తి, కార్యదర్శి సూర్య ప్రకాష్, డాక్టర్ శివరామ ప్రసాద్, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మంగపతిరావు, సంస్కార భారతి వనస్థలిపురం శాకాధిపతులు సిరిపురం అప్పారావు, కన్యక పరమేశ్వరి దేవాలయ కార్యదర్శి వేముల జయరాం, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శేషాచలపతి, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ కృష్ణాది శేషు, జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షులు భావన శ్రీనివాస్, నాయకులు విజయ్ నేత, సంగమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ రోడ్డుకు మోక్షం



- రూ.కోటి 25లక్షలతో రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీకి హెచ్ఎండీఏ నిధులు రూ.40 కోట్లు మంజూరు కాగా.. అందులో 1కోటి 25 లక్షల రూపాయలు నిధులు బాలాపూర్ రోడ్డుకు మంజూరు చేయడం జరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను వినాయక చవితి పండుగ ప్రారంభం కాకముందే పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఒక్క పైసా అయిన నిధులు ఇచ్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నిధులతోనే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ కూడా రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కొంత మంది రాజకీయ దురుద్దేశంతోనే ప్రజలలో సింపతి సంపాదించాలని తప్పుడు వార్తలను ప్రజలకు చేరవేయాలని ధీమాతో నిధులు నేను తెచ్చాను నేను తెచ్చానని అంటున్నారని.. నిధులు ఎక్కడి నుంచి తెచ్చారు, ఎట్లా తెచ్చారు ప్రజలందరికీ చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి



నవతెలంగాణ - సిటీబ్యూరో

వ్యావహారిక భాష కోసమై తన జీవితమంతా ధారబోసిన గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి కార్యక్రమాన్ని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షతన విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భాషలోని అన్ని వాగ్రూపాలకు సముచిత గౌరవం లభించాలని, అన్ని మాండలికాలు గౌరవనీయమే అని అనేక పండితులను ఒప్పించి వ్యావహారిక భాషకు గౌరవాన్ని లభింపజేసిన గొప్ప భాషా సంస్కర్త అని ఆచార్య పిల్లలమర్రి అభివర్ణించారు. తెలుగు శాఖ అధ్యాపకులు ఆచార్య డి విజయలక్ష్మి గిడుగు రామ్మూర్తి పంతులు ఆనాటి గురజాడ, శ్రీనివాస అయ్యంగార్లతో కలిసి తెలుగు భాష సమున్నతి కోసం ఏ రకంగా కృషి జరిపారో సోదాహరణంగా వివరించారు. డాక్టర్ బాణాల భుజంగ రెడ్డి మాట్లాడుతూ తన సమకాలం నాటి పండితులలో సహితం వారనుకునే గ్రాంథికరూపాలు లేవని అనేక వ్యవహారిక రూపాలు వాడాల్సిన పరిస్థితి నెలకొన్నదని అందుకే వ్యర్థంగా గ్రాంథిక రూపాలను వాడి భాషకు చెడు చేయకూడదని, వ్యవహారిక భాష కోసమై ఆయన రచించిన పండిత భిషక్కుల భాషా భేషజం లాంటి పుస్తకాలలోని విశేషాలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య గోన నాయక్, ఆచార్య వారిజారాణి, ఆచార్య వి త్రివేణి, డాక్టర్ భూక్య తిరుపతి, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ బాశెట్టి లతా పరిశోధక విద్యార్థులు పాల్గొని గిడుగు రామ్మూర్తి పంతులు గారికి ఘనంగా నివాళులర్పించారు.

తెలంగాణ ఇసుక లారీ యజమానుల సమావేశం



నవతెలంగాణ -వనస్థలిపురం

వనస్థలిపురం ఆటోనగర్‌లో తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ అధ్యక్షతన గురువారం ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య గౌడ్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో అక్రమ వసూళ్ళి అరికట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోదామని అన్నారు. నూతన తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ యజమానుల సంఘం జనరల్ సెక్రెటరీగా నొప్పిడి శ్రీనివాస్ రెడ్డిని నియమించినట్టు తెలిపారు. సంఘం యొక్క ముఖ్య ఉద్దేశం లారీ యజమానుల సమస్యలే ఎజెండాగా ముందుకు సాగాలి అని అన్నారు. నేను నా వంతుగా నిరంతరం సమస్యలపై పోరాటం చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం జనరల్ సెక్రటరీ నొప్పిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నా మీద నమ్మకంతో తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ సమావేశంలో చెరుకు మధు గౌడ్, సుర్వి శేఖర్, పందుల యాదగిరి గౌడ్, నాది బద్రి గౌడ్, శ్రావణ్ గౌడ్, సుర్వి శేఖర్ గౌడ్, పెద్దగోని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



నవతెలంగాణ - హయత్‌నగర్

విఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపల్ డా. కె.జ్యోత్స్నప్రభ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుందని అన్నారు. క్రీడల వలన దేశభక్తి, జాతీయస్ఫూర్తి అలవడుతాయని నక్క శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విద్యార్థులందరూ క్రీడల్లో కూడా ముందుండాలని ఆకాంక్షించారు. కళాశాల వ్యాయామ అధ్యాపకురాలు కె.అనిత ఈ నెల 22 నుండి 28 వరకు వారం రోజుల పాటు విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. మరొక వ్యాయామ అధ్యాపకులు డా.కె.సురేష్‌రెడ్డి బహుమతులను సమకూర్చారు. విజేతలకు క్రీడాదినోత్సవ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డా.బి.నరసింహ, సీనియర్ అధ్యాపకులు డా. ఎస్.సుబ్రహ్మణ్యం, చరిత్ర అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు యాదగిరిరెడ్డి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగంలో

రాగ రాగిణి సోదరీమణులు ప్రత్యేకులు



నవతెలంగాణ-కల్చరల్

రాగ రాగిణి సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకులు రమణ కుమారి, సుబ్బ లక్ష్మీ సోదరీమణులు సాంస్కృతిక రంగంలో ప్రత్యేక గుర్తింపు కలవారని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ప్రశంసించారు. వారు ఉత్తమ నాణ్యమైన కార్యక్రమాలు సమర్థతతో నిర్వహిస్తారని తెలిపారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా లలిత కళా వేదిక పై రాగ రాగిణి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ సినీ గీత కదంబం కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ గాయని రమణ కుమారి సహా గాయకులు శశి రేఖ, మల్లాది ఉష, సుబ్రహ్మణ్యం, దినకర్ రావు, కమలాకర రావు, ప్రభు కుమార్, రామ కుమార్‌లతో కలసి నాటి ఘంటసాల సుశీల జానకి సినిమాలో పాడిన పాటలతో పాటు నేటి బాలు చిత్ర తదితరులు పాడిన పాటలు సుమధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వంశీ రామరాజు పాల్గొని మాట్లాడుతూ నాటి సుశీల పాటలు రమణ కుమారి హృద్యంగా పాడ గలరని అభినందించారు. సంస్థ కార్యదర్శి సుబ్బ లక్ష్మీ నివేదిక సమర్పించారు.

అనురాగ్ యూనివర్సిటీ అక్రమాలపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-హయత్‌నగర్

అనురాగ్ యూనివర్సిటీ అక్రమాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు గురువారం సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ నాయక్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా గాంధీ నాయక్ మాట్లాడుతూ హైడ్రా పరిధిలోని వెంకటాపురం గ్రామం, ఘట్కేసర్ మండలం, మేడ్చల్ జిల్లా పరిధిలో సర్వే నెంబర్ 813లో అనురాగ్ యూనివర్సిటీని అక్రమంగా బహుళ అంతస్తులతో నిర్మించారని, అలాగే నీలిమ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌ను చెరువును ఆక్రమించి నిర్మించారని ఆరోపించారు. ఈ నిర్మాణలపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరశురాం, రవి నాయక్, గణేష్ నాయక్, వీకే రంగారెడ్డి, వెంకన్న, వెంకట్ రెడ్డి, గిరి, శ్యాం ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ తహసీల్దార్‌కు సన్మానం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇందిరా దేవిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూల బొకేను అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలువురు కొన్ని భూ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. దావూద్ ఖాన్ గూడ సర్వే నెంబర్ 02 భూ బాధితుల తరుపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తహసీల్దార్‌ను సన్మానించిన వారిలో కర్రె రమేష్, ఉమాకాంత్, సురేష్, పుట్టగళ్ల శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాలాపూర్ తహసీల్దార్‌గా ఇందిరాదేవి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల తహసీల్దార్‌గా ఇందిరా దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ మాధవి రెడ్డి సీసీఎల్ఏ హెడ్ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లగా.. హెడ్ ఆఫీస్‌లో పనిచేసిన ఇందిరాదేవి బదిలీపై బాలాపూర్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడ ప్రభుత్వ భూములను ఆక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిల్‌లో నిలిచిపోయిన బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు..



నవతెలంగాణ-ఎల్బీనగర్

జీహెచ్ఎంసీ ఎల్బీ నగర్ జోన్ పరిధిలోని సరూర్‌నగర్, ఎల్బీనగర్ సర్కిల్స్‌లోని డివిజన్‌లో 5 రోజుల నుండి బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జారీ ప్రక్రియ నిలిచిపోయింది. ఉన్నతాధికారులకు తెలియకుండానే అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను బర్త్ అండ్ డెత్ జారీ చేసే బాధ్యత నుండి తొలగించారు. దీంతో ఐదు రోజుల నుండి బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ ప్రక్రియను నిలిపివేశారు. బాధితులు కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గత కొద్ది రోజులుగా బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. సక్రమంగా జరుగుతున్న ప్రక్రియను కొనసాగించకుండా కొత్తగా వచ్చిన ఏఎంహెచ్‌ఓ బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం తనకే కావాలని పట్టుబట్టి బాధ్యతలు తీసుకుంది. ఏఎంసీ శ్రీనివాస్ నుండి బాధ్యతలను తీసుకున్నారు. సీఎంఓ నుండి డిజిటల్‌కి రాకపోవడంతో ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని డివిజన్‌లో బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. బాధితులు ఐదు రోజులుగా సర్కిల్ కార్యాలయం చుట్టూ పడిగాపులు కాస్తున్న తాము ఏమీ చేయలేమని డిజిటల్ కీ వస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తాము అంటున్నారు. ఉన్నతాధికారి నుండి డిజిటల్ కీ వచ్చేంత వరకు వేచి చూడాలని బాధితులను తిప్పి పంపుతున్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే ఏఎంసీ శ్రీనివాస్‌ను బర్త్ అండ్ డెత్ సెక్షన్ నుండి తొలగించారు.

శ్రీనివాసన్‌ను బాధ్యతలు నుండి తొలగించి కొత్తగా వచ్చిన ఏఎంహెచ్‌ఓకు చీఫ్ మెడికల్ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించినారు. డిజిటల్ కీ ఇవ్వడం అధికారులు మర్చిపోయారు. బర్త్, డెత్ సర్టిఫికెట్స్ జారీ చేయలేకపోతున్నారు. ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని సరూర్‌నగర్, ఆర్కేపురం, కొత్తపేట, చైతన్యపురి, లింగోజిగూడ, చంపాపేట్, హస్తినాపురం, వనస్థలిపురం, డివిజన్ పరిధిలో బర్త్, డెత్ సర్టిఫికెట్స్ జారీ ప్రక్రియ నిలిచిపోయింది. డిజిటల్ కీ వచ్చేది ఎప్పుడు.. సర్టిఫికెట్స్ ఇచ్చేదే ఎప్పుడో.. అర్థం కానీ పరిస్థితి జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ పరిధిలో నెలకొన్నది. ఉన్నతాధికారులు వెంటనే డిజిటల్ కీ సమస్యను పరిష్కరించి వెంటనే బర్త్, డెత్ సర్టిఫికెట్స్ జారీ చేసే విధంగా చూడాలని బాధితులు కోరుకుంటున్నారు.

బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు







నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 రోజుల వ్యవధిలో రెండు హత్యలు జరిగిన నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. యువత పెడదారిన పడకుండా, వారిని దారిలో పెట్టాలనే ఆలోచనతో రాచకొండ కమిషనర్ ఆదేశంతో మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి నేతృత్వంలో బాలాపూర్ (డిఐ) డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధు ఆధ్వర్యంలో చబూత్ర మిషన్, నైట్ పెట్రోలింగ్ బాలాపూర్ పరిధిలో ఉన్న షాహీన్ నగర్, బిస్మిల్లా కాలనీ, వాదీ ఏ ఒమర్, వాదీ ఏ షాలేహీన్, క్యూబా కాలనీ, స్మశాన వాటికలలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ మధు మాట్లాడుతూ కొంత మంది యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చి పంపివేసినట్టు తెలిపారు. మరికొందరికి హెచ్చరికలు ఇవ్వడం జరిగిందన్నారు. మధ్య కాలంలో యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, కొన్ని షాప్‌లకు నోటీసులు ఇస్తూ వారికి జరిమానా విధించినట్టు తెలిపారు. గంజాయి పీలుస్తున్న మందుబాబులను గుర్తించి, వారికి కౌన్సి లింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఎవరైన అనుమానస్పం దంగా కనిపించిన, చెడ్డ సాహసాలు పట్టిన తల్లీ తండ్రులు వెంటనే 100కు డైల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాచకొండ

కమిషనరేట్‌లో భారీ బదిలీలు

అప్పుడు ఎన్నికల కోడ్ ఎఫెక్ట్.. ఇప్పుడు పొలిటికల్ ఎఫెక్ట్ అని వినబడుతున్న గుసగుసలు

నవతెలంగాణ - హయత్ నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో 19 మంది ఇన్‌స్పెక్టర్లు, 10మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికలు ముగిశాక ఎల్బీనగర్, హయత్‌నగర్, మాడ్గుల్, చౌటుప్పల్, చర్లపల్లి పోలీస్ స్టేషన్‌లకు నూతనంగా ఇన్‌స్పెక్టర్లు బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు గడిచాయి. పైనున్న స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు కనీసం ఎలాంటి ఆరోపణలు లేకుండా ఉంటే పోలీస్ రూల్ ప్రకారం రెండేండ్లు విధులు నిర్వహించాలి. కానీ ఆరు నెలలకే బదిలీ కావడంతో ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఎఫెక్ట్.. ప్రస్తుతం పొలిటికల్ ఎఫెక్ట్ అని.. పోలీస్ వర్గాలలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా పోలీసులపై రాజకీయల జోక్యం మారాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్సీని కలిసిన సీపీఐ(ఎం) సౌత్ కమిటీ..



నవతెలంగాణ-ధూల్ పేట్

ఎమ్మెల్సీగా ఎన్నికైన సియాసత్ న్యూస్ ఎడిటర్ జనాబ్ ఆమిర్ అలీ ఖాన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ(ఎం) పార్టీ సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.విఠల్, పి.నాగేశ్వర్, ఎం. మీనా నాయకులు అబ్దుల్ సత్తార్, శ్రవణ్ కుమార్ తదితరులు..

నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి

● ఉస్మానియా దంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ యాదవ్

నవతెలంగాణ-ధూల్ పేట్

నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తానని ఉస్మానియా ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎస్ యాదవ్ అన్నారు. ఆస్పత్రి ప్రిన్సిపల్‌గా నూతనంగా నియమితులయ్యారు. ప్రస్తుతం దంత వైద్య కళాశాల కన్జర్వేటివ్ విభాగాధిపతిగా ఉన్న ఆయన ఇదే ఆస్పత్రిలో గత మూడు దశాబ్దాలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. సీనియర్ ప్రొఫెసర్ వైద్యసేవలు అందిస్తున్న ఆయనను అదే దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ.. దంత సంబంధిత సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే దంత సేవలు అందిస్తున్న పెద్దాస్పత్రిగా ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా దంత వైద్య కళాశాలలో బీడీఎస్, ఎండీఎస్ వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు.

దేవాలయాన్ని పున:నిర్మించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



అమ్మవారి విగ్రహాల ధ్వంసం కేసులో నిందితులను కఠినంగా శిక్షించడం తో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ శ్రీ మహాంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మెన్ గాజుల అంజయ్య, మాజీ చైర్మన్ రాకేష్ తివారీతో కలిసి డిమాండ్ చేశారు. రక్షాపురంలో విగ్రహాలు ధ్వంసం అయిన దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంఘటనపై దేవాదాయ శాఖ వెంటనే స్పందించి దేవాలయాన్ని పున:నిర్మాణం చేయాలని కోరారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాతబస్తీ లోని అమ్మవారి దేవాలయాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడిన నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తే.. రాబోయే రోజుల్లో మరెవరు చేయకుండా ఉండేందుకు అవకాశాలుంటాయన్నారు. రాజకీయ ఒత్తిడులకు తలొగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని కోరారు.

అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం



నవతెలంగాణ-అంబర్‌పేట

రంగు సతీష్ గౌడ్ జ్యోతి దంపతులు అంబర్‌పేట మున్సిపల్ కాలనీలోని నివాసంలో అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్స వం నిర్వహించారు. ఉదయం గణపతి హోమం నిర్వహించిన పురోహితులు తీర్థ ప్రసాదాలను బంధువులు, భక్తులకు, రాజకీయ పార్టీ నాయకులకు అందజే శారు. ఈ సందర్భంగా హరి హర భజన మండలి జి.కార్తీక్ గౌడ్ భజన బృందం, భజనలతో, గాత్రాలతో అందరినీ ఆలరించారు.

కేంద్ర ప్రభుత్వం కుట్రవల్లే కవిత అరెస్ట్

● అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట



కేంద్ర ప్రభుత్వం బీజేపీ కుట్రవల్లనే ఎమ్మెల్సీ కవిత అక్రమంగా అరెస్టు చేయ బడ్డారని బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్సీ కవిత నివాసంలో జైలు నుంచి విడుదలైన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందించాలి

● గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందించాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని జవహర్ నగర్‌లో ఇటీవలే ప్రారంభించుకున్న వరదనీటి పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సుదర్శన్ 35 ఎంఎం థియేటర్ వద్ద చాలా రోజులుగా పేరుకుపోయిన మట్టి చెత్తాచెదారాన్ని తొలగించాల్సిందిగా థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఆ ప్రాంతంలో సందర్శించి వెంటనే పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ప్రజా సమస్యలను ప్రజల్లో ఉండి పరిష్కరించాలి తప్ప ప్రచారాలతో కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గీత, అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సిబ్బంది బీజేపీ నాయకులు సాయి కుమార్, ఆనంద్ రావు,అరుణ్ కుమార్,దినేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఫీజుల దోపిడే ఏకైక లక్ష్యంగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న నారాయణ, చైతన్య రిసోనేన్స్, శ్రీ గాయత్రి వంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలను తీసుకోవాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో స్పష్టం చేయాలని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'హైడ్రా' పేరుమీద ఎలాగైతే అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారో, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కూడా అదేవిధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల అధినేతలు కేవలం సంపాదనే లక్ష్యంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నారని, కానీ విద్యా ప్రమాణాలను మాత్రం తుంగలో తొక్కుతున్నారని ఆయన దుయ్యబట్టారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చని విద్యాసంస్థలపై సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విద్యార్థుల, తల్లిదండ్రులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే హైడ్రా మాదిరిగా ఒక కమిషన్ ఏర్పాటు చేసి అక్రమ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం కూడా కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకుంటానని లోపాయికారీ ఒప్పందం చేసుకొని కోట్ల రూపాయల దండుకున్నారని ఈ ప్రభుత్వమైనా చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నామన్నారు.

డెంగ్యూ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

● ఎం.ఏ అండ్ యూ.డీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్





దానకిషోర్ (ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎం.ఏ అండ్ యూ.డీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ అధికారులు, జిల్లా కలెక్టర్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, చీఫ్ మెడికల్ ఆఫీసర్‌లు, సీనియర్ ఎంటమాలజీ, ఏఎం హెచ్‌ఓలు, తహశీల్దార్‌లు, అసిస్టెంట్ ఎంటమాజిస్టులు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశ నిర్దేశం చేశారు. డెంగ్యూ పాజిటివ్ కేసులన్నింటినీ తనిఖీ చేయాలని, ప్రతి రోజు బస్తీ దవాఖానాలను, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని జోనల్ కమిషనర్లు డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా, ఇతర విక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధులను క్రమం తప్పకుండా డీసీలు, ఎస్ఈలు, ఏఈలతో సమీక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని పాఠ శాలలు కళాశాలలు హాస్టళ్లను సందర్శించి డెంగ్యూ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్లమ్ ఏరియాలో పాజిటివ్ కేసులు గల ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని, సీనియర్ ఎంటమాలజిస్టులు, అసిస్టెంట్ ఎంటమాలజిస్టులు ప్రతిరోజు 5 నుండి ఆరు ప్రాంతాలను తప్పకుండా రీ చెక్ చేయాలని సూచించారు.

అక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించాలి

● మీ సేవా డాష్ బోర్డ్‌లో సమస్యలు పెండింగ్ లేకుండా చూడాలి : అదనపు కలెక్టర్ వెంకట చారి

నవతెలంగాణ-సిటీబ్యూరో



రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకట చారి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ సెక్షన్స్ పర్యవేక్షకులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాండ్ బ్యాంక్, పీవోబీ, ప్రభుత్వ భూముల కేటాయింపులు, ఆక్రమణలు, మూసీనది ఆక్రమణలు, ఎన్‌వోసి బిల్డింగ్ అనుమతులు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వాల్టా చట్టం, మీసేవ ధృవపత్రాలు, ఆసరా పెన్షన్లు, సీఎంవో ప్రజావాణి, కలెక్టర్ ప్రజావాణి నివేదికలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ఆదేశించారు. సీఎంవో, ప్రజావాణి, మీసేవ దరఖాస్తులన్నీ వెను వెంటనే పరిష్కారం చేయాలని, మీ సేవా డాష్ బోర్డ్‌లో పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భవనాలు, భూములను గుర్తించాలన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు జ్యోతి, దశరథ్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



నవతెలంగాణ-అంబర్‌పేట

కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రజల మధ్య మత విద్వేశాలు రెచ్చగొడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ పబ్బం గడుపుకుంటుందని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. గురువారం అంబర్‌పేట జోన్ సీఐటీయు జోన్ కార్యాలయాన్ని నగర కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ అధ్యక్షతన జరిగిన సభలో ఈ సందర్భంగా ఎస్.వీరయ్య మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలోని సీఐటీయు అనేక కార్మిక పోరాటాలు చేసిందని కార్మికుల పక్షాన నిలబడి అనేక సంక్షేమ పథకాలు కనీస వేతన అమలు కోసం పోరాటం నిర్వహించిందన్నారు. ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేసి వేల మందికి ఇండ్లు ఇప్పించిందని కానీ ఇప్పుడు దేశంలో మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండి కార్మికుల యొక్క హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తుందని 44 కార్మిక చట్టాలు రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని యజమానులకు అనుకూలంగా ఉండే లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల జీవితాలు నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో వేల సంఖ్యలో అసంఘటితరంగా కార్మికులు ఉన్నారని వారందరి కోసం సీఐటీయు అహర్నిశ లు కృషి చేస్తూ పనిచేస్తుందని సీఐటీయు ఆఫీసు కార్మికుల అడ్డాగా పనిచేయాలని కార్మికులకు ఏ సమస్య వచ్చినా సీఐ టీయు ఆఫీసుకు వచ్చే విధంగా నాయకత్వం పనిచేయాల ని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, అంబర్‌పేట జోన్ నాయకులు జి.రాములు, బి.సుబ్బారావు, షబానా, వరలక్ష్మి ,హైదరా బాద్ జిల్లా నాయకులు ఎం. శ్రీనివాస్, నాగలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, కుమార్, కె.అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో ఉన్న ఆర్టిజెన్లకు వెంటనే కన్వర్షన్ ఇవ్వాలి



● సీఐటీయు అజామాబాద్ డివిజన్ సర్కిల్ ప్రెసిడెంట్ వెంకన్న

నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యుత్ సంస్థలో ఉన్న ఆర్టిజెన్సీకి వెంటనే కన్వర్షన్ ఇవ్వాలని సీఐటీయు అజామాబాద్ డివిజన్ సర్కిల్ ప్రెసిడెంట్ వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం ఆజామాబాద్ డివిజన్ ఆర్డినెన్స్ సమావేశం సీఐటీయు సిటీ కార్యాలయంలో నాయకులు కే సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సర్కిల్ ప్రెసిడెంట్ వెంకన్న, ఎఫ్ఎం రాకేష్, జేఎల్ఎం కిరణ్ కుమార్, రాజేశ్వర్‌లు హాజరై మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో ఉన్న ఆర్టిజెన్సీకి వెంటనే కన్వర్షన్ ఇవ్వాలని కన్వర్షన్ ఇచ్చే లోపు స్టాండింగ్ ఆర్డర్‌లో ఉన్న ప్రకారంగా ప్రతి ఒక్క కార్మికునికి గ్రేట్ చేంజ్ ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్ 82 యూనియన్ నుండి 30 మంది ఆర్టిజన్స్ తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. కొత్తగా చేరిన వారికి యూనియన్ కండువా కప్పి యూనియన్లకు ఆహ్వానించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని పోరాటాలు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం చేశారు. చేరిన వారిలో టీ. సైదులు, శ్రీరాములు, సోమయ్య, మధు, యాదగిరి కుటుంబరావు చేరారు.

వచ్చేనెల 1న అఖిలభారత పశుగణన కార్యక్రమం

● గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చేనెల 1వ తేదీ నుంచి 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం జరుగుతుందని, ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు పశువుల సమగ్ర సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు జరుగు అఖిలభారత పశుగణన గోడ పత్రికను గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశమంతా జరుగు ఈ పశుగణన కార్యక్రమంలో అన్ని పశు జాతులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, గుర్రాలు, గాడిదలు, కుక్కలతో పాటు అన్ని రకాల పశు సంపద గణన అని తెలిపారు. పశు గణన కోసం ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు మీ పశువుల సమగ్ర సమాచారం అందించాలనీ, తద్వారా పశుగణ రంగ పథకాల రూపకల్పనకు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పశు గణన కోసం 127 మంది ఎన్యు మారేటర్లు, 30 మంది సూపర్‌వైజర్లు, 92 వార్డులలో ఇంటింటికి సందర్శించి పశుగణన చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశు సంవర్థక అధికారి డాక్టర్ పి వెంకటేశ్వర్లు, డీఈవో ఆర్. రోహిణి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈవో పామీయా నాయక్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

బహదూర‌పుర మండల విద్యాధికారి(డిప్యూటీ ఈవో)గా పామీయా నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అందుల పాఠశాల దారుల్ షిప్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు కలిసి అభినం దించారు. అనంతరం శాలువలతో సన్మానించి.. పలు స్థానిక సమస్యలను నూతన డిప్యూటీ ఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, ఖురీష్య, ఉపాధ్యాయులు రామారావు, జావేద్, నాగేశ్వర రావు, సద్గుణ, పార్వతి, యాదమ్మ, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రమాదేవి, ఐఈఆర్పీ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎంపీ కంగనా రనౌత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

● పోలీసుల ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీ వీహెచ్.హనుమంతరావు



నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీహెచ్.హనుమంతరావు మండి పడ్డారు. సంబంధంలేని అంశాలను ప్రస్తావి స్తూ రాజకీయ గుర్తింపు తెచ్చుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలపైన అనేక ఆరోపణలు చేస్తున్నారని, మహిళ సీఆర్పీఎఫ్ అధికారి చెంప దెబ్బకొట్టినా కూడా తనలో మార్పు రాలేదనీ మాజీ ఎంపీ వీహెచ్. హనుమంతరావు అన్నారు. గురువారం కంగనా రనౌత్‌పై అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులపై రైతులపై అసభ్యకరంగా మాట్లాడుతున్న కంగనా రనౌత్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి డ్రగ్స్ అలవాటు ఉందనే ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ఆయన చెత్త ప్రసంగాలు చేస్తాడని కామెంట్ చేయడం పట్ల తమ మనోభావాలు దెబ్బ తిన్నాయన్నారు వీహెచ్. అన్నారు. కంగనా మీద హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, ఈ లాంటి వాళ్ళను బీజేపీ ప్రోత్సహిస్తే ప్రజలు తిరగబడి తరిమికొడతారన్నారు. కంగనా రనౌత్ ను కంట్రోల్ చేయాల్సిన బాధ్యత పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా మీద ఉందన్నారు. కంగనా మీద కేసులు నమోదు చేయా లని డీజీపీ, కమిషనర్‌లకు విజ్ఞప్తి చేస్తున్నామ న్నారు. రంగనాథ్ మంచి పనిచేస్తున్నారు కాబట్టి తనను అప్రిషేట్ చేస్తున్నానన్నారు. పేదల ఇండ్లు కూల్చితే.. డబుల్ బెడ్ రూం ఇండ్లు వాళ్లకు ఇవ్వాల ని, అంబర్‌పేటలోని ముస్లిం స్మశాన వాటికలో కూడా ఇండ్ల నిర్మాణం చేస్తున్నారని, దీని మీద కూడా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల వైపు నిలబడాలని.. కుటుంబ సభ్యులు అక్రమ నిర్మాణం చేపట్టినా కూల్చే స్తామని సీఎం ప్రకటన చేశారని ఇది స్వాగతించాల్సిన అంశమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్య క్షులు పొలినేని రామ్మోహన్‌రావు, గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్, కిషోర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

లేబర్ డిపార్టుమెంట్ ఎన్నికలు నిర్వహించిన ఐఎన్‌టీయుసీ విజయం ఖాయం

● ఐఎన్‌టీయుసీలో చేరిన 200మంది జీహెచ్ఎంసీ ఉద్యోగులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

లేబర్ డిపార్టుమెంట్‌లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఐఎన్‌టీయుసీ విజయం సాధించడం ఖాయమని ఐఎన్‌టీయుసీ అనుబంధ మున్సిపల్ సహకార్ మజూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఆదిల్ షరీఫ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూనియన్ కార్యాలయంలో సుమారు 200 మంది జీహెచ్ఎంసీ ఉద్యోగులు ఆదిల్ షరీఫ్ సమక్షంలో ఐఎన్‌టీయుసీలో చేరారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు 4వ తరగతి నుండి ఎంసీ కేటగిరీలకు పదోన్నతుల కోసం మున్సిపల్ సహకార్ మజూర్ యూనియన్ పోరాడుతుందన్నారు. జీహెచ్ఎంసీ ఉద్యోగుల బదిలీ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, 2004 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే పాత పెన్షన్ విధానం అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేస్తున్న ఐఎన్‌టీయుసీ అనేక విజయాలు సాధించిందన్నారు.

శ్రీశైలం సేవలు ఎనలేనివి..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆర్యవైశ్య సంఘంగా ప్రజలకు ఆయన చేసిన సేవలు ఎనలేనివని పురానాపూల్ డివిజన్ మజ్లిస్ కార్పొరేటర్ సున్నం రాజ్మోహన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు లక్ష్మణరావులు అన్నారు. పాతబస్తీ దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ట్రస్ట్ భవన్ ప్రధాన కార్యదర్శి, సేవారత్న స్వర్గీయ కల్వగూరి శ్రీశైలం శ్రద్ధాంజలి కార్యక్రమం భవన్‌లో నిర్వహించారు. పురానాపూల్ డివిజన్ మజ్లిస్ కార్పొరేటర్ సున్నం రాజ్మోహన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు లక్ష్మణరావు, దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దోరేటి ఆనంద్ గుప్తా, శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయ ప్రధాన కార్యదర్శి కట్టా నర్సింహారావు ముదిరాజ్, దూద్‌బౌలి ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు, పాతబస్తీ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు కె.రమేష్, ప్రధాన కార్యదర్శి బి.భరతాచారి, కోశాధికారి కె.శ్రావణ్ కుమార్, ప్రతినిధులు పి. సూర్య నారాయణ, విజయానంద్రరావు, సయ్యద్ నిస్సార్ అహ్మద్ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీనియర్ జర్నలిస్టు శ్రవణ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ రూ.4016 నుంచి రూ.6 వేలకు పెంచాలని ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ నేషనల్ ప్రెసిడెంట్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి గురువారం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ నేషనల్ ప్రెసిడెంట్ వల్లభనేని ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా వికలాంగులు ఉన్నారు. వికలాంగుల పరిరక్షణ చట్టం 2016 ఆర్‌పీడబ్ల్యూడి ప్రకారం వికలాంగులకు సకలాంగుల సమాన స్థాయికి కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలుగా అయినా ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేయూత పథకం వికలాంగుల పెన్షన్ రూ. 4016 నుంచి రూ. 6వేల వరకు పెంచి పంపిణీ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర మంతటా ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ వసతి కల్పించాలన్నారు. వికలాంగులకు కేటాయించిన ఉద్యోగాలు క్యాలెండర్ పద్ధతిలో భర్తీ చేయుటకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలన్నారు. వికలాంగుల హక్కుల చట్టం చట్టం 2016ను అమలు చేసి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 5శాతం కేటాయించాలన్నారు. వెంటనే సమస్యల పై స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి భారతి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ గౌడ్, కిరణ్ కుమార్, ఇమ్రాన్, కిషోర్, వెంకటేష్, దస్తగిరి ,తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ సరళిపై దిశా నిర్దేశం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా.. గురువారం కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివ చౌదరి, బచ్చుమల్లి, సీనియర్ నాయకుడు బాబ్జి కుమార్‌లు పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ ఓటింగ్ అప్డేట్, ఓటింగ్ సరళి, ఓటింగ్ వేసే విధానాన్ని గురించి యూత్ కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ వసుంధర హాస్పిటల్ దగ్గర నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టార్మ్ వాటర్ డ్రయినేజీ మెయిన్ హెూల్ డ్యామేజ్ కవర్స్ మార్చాలని అధికారులకు సూచించారు. వర్షకాల దృష్ట్యా నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయుడు, జిల్లా గోపాల్, భాస్కర్ రావు, శారద తదితరులు పాల్గొన్నారు.

రంగధాముని చెరువు వద్ద 7 క్రేనుల ఏర్పాటు



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వినాయక చవితి ఉత్సవాలలో భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూడాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 7వ తేదిన జరగనున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ ఎమ్మెల్యేతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ మాట్లాడుతూ రానున్న వినాయక చవితి ఉత్సవాలలో ప్రజలకు భక్తులకు కావాల్సిన మౌలిక వసతుల గురించి జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ అధికారులతో, పోలీస్ అధికారులు, ట్రాఫిక్ అధికారులతో, ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలలో రంగధాముని చెరువు వద్ద 7 క్రేనులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా భక్తులకు ప్రజలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా జీహెచ్ఎంసీ అధికారులు శానిటేషన్, ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్ అధికారులు, పోలీసు అధికారులతో మాట్లాడుతూ గత సంవత్సరం ఉత్సవాలలో అన్ని విభాగాల వారు పని చేయడం వల్ల ఎలాంటి ఆటంకాలు జరగలేదని పేర్కొన్నారు. ఈ యేడు కూడా ఎలక్ట్రిసిటీ అధికారులు రంగధాముని చెరువు వద్ద ఎలాంటి ఆటంకాలు కలగకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ పోలీసులకు భక్తులు విగ్రహాలు నిమర్జనానికి వచ్చే సమయంలో భక్తులకు వాహనాలను పార్కింగ్ చేయడం కొరకు ప్రయివేటు స్థల యజమానులతో మాట్లాడి పార్కింగ్ కావాల్సిన స్థలాన్ని ఇప్పించే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శానిటేషన్ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రతి రోజు శానిటేషన్ పర్యవేక్షణ చేయాలన్నారు. మొదటి రోజు నుండే ఆరోగ్య శాఖ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కార్పొరేటర్లు సబిహా గౌసుద్దీన్, మహేందర్, జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ అధికా రులు ఎలక్ట్రిసిటీ అధికారులు, ఆర్టీసీ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భారీ బందోబస్తు

- రాచకొండ సీపీ సుధీర్ బాబు
- వివిధ విభాగాల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం



నవతెలంగాణ-నేరేడ్ మెట్

గణేశ్ నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్టు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం నేరేడ్ మెట్ లోని కమిషనర్ కార్యాలయంలో సీపీ సమన్వయ సమావేశంను నిర్వహించారు. హాజరైన వారితో చర్చించి క్షేత్ర స్థాయిలో గణేశ్ ఉత్సవ నిర్వాహకులు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం ప్రణాళిక ప్రకారం జరిగేలా, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని పోలీసు శాఖ కృషి చేస్తోందని, కమిటీల నిర్వాహకులు కూడా సహకరించాలన్నారు. వేడుకలను భక్తులు శాంతియుతంగా, ఘనంగా జరుపుకోవాలన్నారు. మండపాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతి భద్రతల సమస్య రానివ్వవద్దని సూచించారు. ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. మండపాల్లో డిజే ఏర్పాటుకు అనుమతి లేదని, గణేష్ మండపంలో రోజంతా వాలంటీర్లు తప్పనిసరిగా ఉండే విధంగా చూడాలని, రాత్రి సమయంలో కనీసం ముగ్గురు ఉండేలా చూసుకోవాలని, భక్తుల సందర్శనను దృష్టిలో ఉంచుకుని మండపాలలో క్యూలైన్లను ఏర్పాటు చేసేలా నిర్వహకులు చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక ప్రాతిపదికన అయినా ఉత్సవాలు ముగిసే వరకు సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపాల నిర్వాహకులు, కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. సమీపంలో ఉన్న చెరువు లేదా కుంటల లోతును బట్టి విగ్రహాల ఎత్తును నిర్ణయించి ఏర్పాటు చేయాలని సూచించారు. గణేశ్ ఉత్సవ నిర్వాహకుల సౌలభ్యం కోసం ఇక నుండి రాచకొండ పోలీసు వెబ్‌సైట్ ఆన్లైన్ లింక్ ద్వారా స్థానిక పోలీసు వారికి నిర్దీత వివరాలతో సమాచారం ఇవ్వాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన లింక్ https://policeportal.tspolice.gov.in/index.htmను రాచకొండ పోలీస్ సామాజిక మాధ్యమాల అకౌంట్లలో ఇప్పటికే పోస్టు చేసినట్టు పేర్కొన్నారు.

గణేష్ నవరాత్రోత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన మేరకు అన్ని శాఖల అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన బుక్ లెట్లను త్వరలోనే గణేశ్ ఉత్సవ నిర్వాహకులకు అందిస్తామన్నారు. నిమజ్జనోత్సవానికి అవసరమైన పోలీస్ బందోబస్తు, స్విమర్స్, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, ఇతర నిమజ్జన నీటికుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు కట్టల వద్ద టెంట్లు, విద్యుత్ లైట్లు, బారికేడ్లను, మంచినీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, డీసీపీ ఎస్వీ కరుణాకర్, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ మురళీధర్, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, ఎల్బీ నగర్ మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, పలువురు ఏసీపీలు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, అధికారులు, తదితరులు ముఖ్య అతిథులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు..



- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ అధికారులకు ఆదేశించారు. గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ అధ్యక్షతన కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో చెరువుల దగ్గర గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జంట సర్కిల్ పరిధిలో గణేష్ నిమజ్జనం కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న కొలనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జనం నిర్వహించే చెరువుల వద్ద సకల సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద రక్షణ కంచలు, పెద్ద క్రేన్లు, చిన్న క్రేన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా లైటింగ్ వ్యవస్థ, పారిశుధ్యం, తాగునీటి వసతి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ అంతరాయం కలిగినట్లయితే ఇబ్బందులు తల్తితకుండా జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఘాట్ వద్ద పోలీస్, మున్సిపల్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో పాటు వాలంటీర్లను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సజావుగా జరగడంతో పాటు నిమజ్జనం తర్వాత విగ్రహాలతో సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ, కుత్బుల్లాపూర్ తహశీల్దార్ అబ్దుల్ రెహమాన్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు, చిన్నారెడ్డి, పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఘనంగా 'జాతీయ క్రీడా దినోత్సవ' వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లలో గురువారం హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి టీవీఆర్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి ఆదేశాల మేరకు 'టీవీఆర్ మోడల్ హై స్కూల్ ', 'సత్యవాణి విద్యానికేతన్ ' స్కూల్ ల క్యాబినెట్ విద్యార్థిని విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో.. స్పోర్ట్స్ టార్చ్ వెలిగించి.. అపురూప, ఎస్ఆర్ నాయక్ నగర్ కాలనీలలో ర్యాలీ నిర్వహించారు. 'వన్ టీం వన్ డ్రీమ్' 'దు వామప్ బి హెల్తి' 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ ధ్యాన్ చంద్ ఇండియా స్టార్' వంటి నినాదాలతో కాలనీలు హెూరెత్తాయి. మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, సంకల్పం ఉంటే ప్రతి విద్యార్థి కూడా ఒక గొప్ప ఆటగాడిగా తయారవుతారన్నారు. దేశంలోని దేశంలోని క్రీడాకారు లందరికీ ధ్యాన్ చంద్ స్ఫూర్తి అని కొనియాడారు. ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని దేశానికి పథకాలు సాధించే క్రీడాకారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడాలో అతిముఖ్యుడు ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. క్రీడల వల్ల మానసిక, శారీరక ఉల్లాసము పొందవచ్చని, ప్రతి రోజు 30 నిమిషాలు ఆడుకోవాలని, శారీరక దృఢత్వాన్ని పొందాలని తెలిపారు. క్రీడలతోపాటు విద్యా విజ్ఞానం కూడా పెంపొందించుకోవాలని సూచించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సూరా రవిచంద్ర రెడ్డి, విద్యార్థిని విద్యార్థుల స్ఫూర్తిని, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు స్కూల్ క్యాబినెట్ స్టూడెంట్స్ బ్యాండ్ ట్రూప్ పాల్గొన్నారు.

వి.నర్సింగ్ రావు ప్రమాణస్వీకారం



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి (శివాలయం) కమిటీ చైర్మెన్‌గా వి.నర్సింగ్ రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కమిటీ చైర్మన్, సభ్యులు ఆలయ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రస్తుతం పాత శివాలయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల సహకారంతో కమిటీ సభ్యులు ధూప,దీప నైవేద్యాలకు స్వంత నిధులు సమకూర్చి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ మేరకు చైర్మెన్‌తో పాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కె.పుష్పారెడ్డి, టీపీసీసీ సెక్రటరీ ప్రోటోకాల్ కమిటీ సభ్యులు సూరజ్ కుమార్ తివారి, మాజీ కౌన్సిలర్, డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, శివ గౌడ్ తదితరులు, పాల్గొన్నారు.

ప్రజా సేవలోనే సంతృప్తి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నానని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు, పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానికంగా నెలకొన్న సమస్యలను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

ఏఎస్ఓను సత్కరించిన సీపీఐ కార్యదర్శి



నవతెలంగాణ-బాలానగర్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏఎస్ఓను సీపీఐ కార్యదర్శి జి. కృష్ణ శాలువాతో సత్కరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడలోని పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిగా కళ్యాణ్ బాధ్యతలు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా బాలానగర్ సీపీఐ కమిటీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ, మనోచారి తదితరులు ఆయన కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో 23వ కళ్యాణ మహెూత్సవం



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో.. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి 23వ కల్యాణ మహెూత్సవ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక హెూమంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు డి.కృష్ణమూర్తి, నర్రా దేవేందర్ రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మెన్ ఎ.రాజ సాగర్, సగర సంఘం అధ్యక్షులు డి.లోకేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి ఎం.జానకి రాములు సాగర్, కోశాధికారి ఎ.రవి సాగర్, ఇందిరా నగర్ అధ్యక్షులు గిరి సాగర్, ప్రధాన కార్యదర్శి అర్జున్, కోశాధికారి రాజుతో పాటు స్థానిక నాయకులు బంగారయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తాం

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెం 4 లోని ఆర్ఎల్ నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి చైర్మెన్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీలో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్ బుదవారం లక్ష్మి వేణుగోపాల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్‌ను కలిసిన సత్యం శ్రీరంగం



- కూకట్‌పల్లిలో కబ్జాల వివరాలు అందజేత

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో కనుమరుగు అవుతున్న చెరువులు, నాళాలను పరిరక్షించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం కలిశాడు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న చెరువుల, నాళాల పూర్తి వివరాలను అందించి వాటి కబ్జాల వివరాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధి ప్రోద్భలంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో అక్రమ కట్టడాలకు హద్దు అదుపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఆక్రమణల్లో భీముని కుంట, కాముని చెరువు, రంగధాముని కుంట, సున్నం చెరువు, పరికి చెరువు, నల్ల చెరువు, మైసమ్మ చెరువు, ముండ్ల కత్వ తదితర చెరువులు కూడా ఉన్నాయని తెలిపారు. కైతాలాపూర్ కుంట, ఖాజా కుంట, కూకట్‌పల్లిలో నాళాల సంఖ్య, బాలానగర్‌లో 150 ఫీట్లు ఉన్న నాళాని పూడ్చి 40 ఫీట్లు చేశారని, బోయిన్‌పల్లి వద్ద బోయిన్ చెరువులు, నాలాలన్నీ ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. మైసమ్మ చెరువు, రంగనాయకి చెరువు సుందరీకరణ పేరుతో దాన్ని కబ్జా చేశారని, దీని ఫలితంగా సహజ పర్యావరణ వ్యవస్థ, నీటి వనరులకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. కాబట్టి అక్రమ ఆక్రమణల నిజానిజాలను తెలుసుకోవడానికి ప్రభుత్వ భూములను కాపాడడానికి వెంటనే కూకట్‌పల్లి వచ్చి ఆక్రమణల మీద నోటీసులు ఇచ్చి కూల్చివేయాలన్నారు. ఆక్రమణలకు అప్పటి పరిస్థితుల్లో అనుమతులు ఇచ్చిన అధికారుల్ని విచారణ జరిపి, వారిపై తక్షణమే చర్య తీసుకోవాలని ఈ సత్యం శ్రీరంగం హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం అందజేశారు.

హైడ్రా కమిషనర్ సుడిగాలి పర్యటన..

- 15 చెరువుల అక్రమణ పై ఫిర్యాదులు రావడంతో అక్కడికి వెళ్లిన ఏవి.రంగనాథ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసీ పరిధిలో హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గురువారం సాయంత్రం సుడిగాలి పర్యటన చేశారు. నగర శివారులోని 15 చెరువుల అక్రమణ పై ఫిర్యాదులు రావడంతో కమిషనర్ అక్కడికి వెళ్లారు. పాక్స్ సాగర్, దులపల్లి, అశోక్ విల్లాస్ దగ్గర నాలా కబ్జాను పలు చెరువులను ఆయన పరిశీలించారు. చెరువుల కబ్జాలపై స్థానికుల ఫిర్యాదుతో మంచి స్పందన వచ్చినట్లుగా కనిపించింది. ఈక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కొంపల్లి మునిసిపల్ కమిషనర్, ఇరిగేషన్ డిఓ, రెవిన్యూ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కేపీహెచ్ బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని 9వ ఫేస్లో గల శ్రీశ్రీశ్రీ విజయ గణపతి దేవాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, దంపతులు పాల్గొని మండప దేవత హెూమములు, మూలమంత్ర హెూమములు, పూర్ణాహుతి, వసంతోత్సవ కార్యక్రమం లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించి, గురువారం అన్నదాన కార్యక్రమం చేశామని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులు పొందారన్నారు. స్వామి వారి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

గ్యాస్ పైపులతో దాడి.. యువకుడు మృతి

నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

గ్యాస్ పైపులతో యువకుడిని కొట్టడంతో అతను మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌లోని వినాయక నగర్ కాలనీలోని విఘ్నేశ్వర వసతి గృహంలో కళ్యాణ్ (30) గత నాలుగు నెలల క్రితం నుంచి ఉంటున్నాడు. హాస్టల్ ఫీజు రూ.27వేలు కట్టలేక సదరు యువకుడు హాస్టల్ వదిలి వెళ్లిపోయాడు.కాగా తిరిగి బుధవారం రాత్రి 8.30గంటల ప్రాంతంలో హాస్టల్ కు వచ్చి రూ.17వేలు చెల్లించడానికి ప్రయత్నించగా హాస్టల్ నిర్వాహకులు తిరస్కరించారు. దాంతో తిరిగి వెళ్తుండగా దారిలో ముగ్గురు యువకులు వచ్చి గ్యాస్ పైపులు,వైర్లతో తీవ్రంగా దాడి చేయడంతో కళ్యాణ్ మృతి చెందాడు.గొడవ గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108సిబ్బందిని పిలిపించి ప్రాథమికంగా మృతి చెందినట్టు నిర్ధారించినట్టు తెలిపారు.అనంతరం మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.మేడ్చల్ సీఐ సత్యనారాయణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు భాషా దినోత్సవన్ని పురస్కరించుకొని ఖైరతాబాద్ ఆనంద్ నగర్ సెంట్ కాన్వెంట్ స్కూల్ లో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మాతృభాషను మరిచిపోవద్దని.. అమ్మకన్న కమ్మనైన మాతృభాషను ఎల్లవేళ గుర్తుంచుకొని తెలియని వాలికి తెలియజేయాల్సిన అవశ్యకత విద్యార్థులు ఉపాధ్యాయుల పైనే ఉందని తెలిపారు.
నవతెలంగాణ - బంజారాహిల్స్



All that the Plot No.158 (North Part), admeasuring 137 Sq.Yards., or it's equivalent to 114.532 Sq. Mtrs., in Sy.No.97, Near Swathi Residency, situated at Bagh Hayath Nagar Village, Hayath Nagar Revenue Mandal, R.R.District., under ward No.4, Block No.9 of GHMC, Hayath Nagar Circle, and bounded by:

North : Neighbours Land
South : Plot No.158 (South Part)
East : 20' wide road
West : Plot No.159

// By order of the Hon'ble Court//
M.SATHYANARAYANA
M.JHYOTHI
Advocates
#H.No.11-14-312, 2 nd Floor, Opp. Bhagya Nagar Function Hall, Sai Tarun Enclave Road, L.B.Nagar, R.R.District-500 074
Ph.No. 9550200554

ఎమ్మెల్యేను కలిసిన ధోబి ఘాట్ రజక సంఘం సభ్యులు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

జ్యోతి నగర్ దోబిఘాట్ రజక సంఘం సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతి పత్రంను అందజేశారు. దోబిఘాట్‌లో రజకులకు మెరుగైన సౌకర్యాలు, చుట్టూ ప్రహరీ గోడ, రజక కులవత్తి చేసుకునే వారికి దోబిఘాట్‌లో వసతులను కలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాండు, యాదయ్య, లక్ష్మయ్య తదితరులున్నారు.



మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ 6వ వర్ధంతి సందర్భంగా దా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ జమ్మి గడ్డ ఎన్‌టీఆర్ కూడలి వద్ద ఆయన చిత్ర పటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముఖ్య అతిథి గా తెలుగు దేశం ఉప్పల్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కంది కంటి అశోక్ కుమార్ గౌడ్ విచ్చేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డ మీద రాములు యాదవ్, దూడల సాంబమూర్తి గౌడ్, దూడల నిర్మల సాంబమూర్తిగౌడ్, నీరు కొండ సతీష్ బాబు, శ్రీరాములు, సాంభశివ రావు, బింగి భిక్షపతి గౌడ్, తిక్కప్రకాష్, శివనంద్,పరంధామయ్య,రవి, గోబెరు రమేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

పీర్జాదిగూడ మేయర్ గా "ఆమర్ సింగ్"
నేడే ప్రమాణ స్వీకారం

● అభివృద్ధి సంక్షేమ పాలనకై కృషి చేస్తా

● పభుత్వ స్థలాలు, పార్కుల పరిరక్షణకు కృషి ఆమర్ సింగ్





నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లాలో మరో కార్పొరేషన్ హస్తగతమైంది. ఈ నెల 9 న పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఖాళీ అయిన మేయర్ స్థానానికి శుక్రవారం ఎన్నిక జరగనుంది. ఇప్పటికే కాంగ్రెస్ మేయర్ అభ్యర్థిగా పీర్జాదిగూడ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ ఆమర్ సింగ్‌ను ప్రకటించడంతో శుక్రవారం జరిగే కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో మేయర్‌గా ఆమర్ సింగ్ ఎన్నిక లాంఛానం కానుంది.

కార్పొరేటర్‌గా..

2020 జనవరిలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని 12 వ డివిజన్ కార్పొరేటర్‌గా బరిలోకి దిగిన ఆమర్ సింగ్ రాజకీయాలలో సీనియర్లుగా ముద్ర పడిన వారిని ఎదుర్కొని భారీ మెజార్టీతో విజయం సాధించారు.

అవినీతి రహిత పాలనే మా ధ్యేయం...

రాజకీయాల్లోకి వచ్చిందే ప్రజలకు సేవ చేయాలని.. కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో డివిజన్ ప్రజలకు అనేక రకాల సేవా కార్యక్రమాలు చేశాను. నేడు మేయర్‌గా సేవ చేసే అవకాశం వచ్చింది. ఇలా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. ముఖ్యంగా గత పాలకవర్గంలో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపేందుకు ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. అదే విధంగా నగరంలోని ప్రభుత్వ స్థలాలు, పార్కుల కబ్జాలపై చర్యలకు ఆదేశిస్తాం' అని ఆమర్ సింగ్ అన్నారు.

నగరంలోని వీధులను గుర్తించేలా...

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న వీధులకు గుర్తింపు వచ్చేలా ప్రజలందరూ సులభంగా కాలనీలను గుర్తించేలా కాలనీలను ఆధునికరిస్తాము. ఏ ఇంటి నెంబర్ ఏ కాలనీలో వస్తుంది. ఎక్కడి నుండి ఎక్కడి వరకు కాలనీల విస్తీర్ణం ఉంది అనే సూచిక బోర్డులు ఏర్పాటు చేసి కాలనీలను, ఇండ్లను సులభంగా గుర్తించేలా సత్వర చర్యలు తీసుకుంటాం.

పైలట్ ప్రాజెక్టు కింద ఎస్ఎన్డీపీ....

నగరంలోని లోతట్టు ప్రాంతాలలో ఉన్న ముంపు సమస్యకు పరిష్కారం చూపేందుకు గత ప్రభుత్వం అసంపూర్తిగా చేపట్టిన ఎస్ఎన్డీపీ ప్రాజెక్టు పూర్తయ్యేలా మా ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్ళి అవసరమైన నిధులు తీసుకువచ్చి పైలట్ ప్రాజెక్టు కింద వరద నీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాను.

ప్రజల ఆకాంక్షల మేరకు పని చేస్తా : అమర్ సింగ్

పీర్జాదిగూడ నగరంతో మా కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉంది. కార్పొరేటర్‌గా నాకు ప్రజలిచ్చిన ఆవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందకు కృషి చేశాను. ఇప్పుడు నగర మేయర్‌గా ఆవకాశం వచ్చింది ఇప్పుడు ఇంకా బాధ్యత పెరిగింది. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నగరాభివద్ధి కోసం కృషి చేస్తాను...



పీర్జాదిగూడ మేయర్ పూర్తి వివరాలు
పేరు: ఆమర్ సింగ్
భార్య : అలేఖ్య మలిపెద్ది
తల్లిదండ్రులు: అనిల్ సింగ్,కుసుమ సింగ్
పుట్టిన తేదీ: 26/02/1985
విద్యార్హత: ఎంబీఏ
సంతానం: కూతురు,కుమారుడు.
నివాసం: పీర్జాదిగూడ కార్పొరేషన్, రాంచందర్ సింగ్ కాలనీ.

బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తి ని కొనసాగిద్దాం



నవతెలంగాణ-కాప్రా

బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తి ని కొనసాగిద్దామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు అన్నారు. పార్టీ కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ఆయన హాజరై మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు విధానాల అమలు ప్రయోగశాలగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను మార్చే దానికి ప్రయత్నం చేశారని తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్తును సంస్థను ప్రయివేటు పరం చేసి ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు యత్నించినట్టు చెప్పారు. దీనిని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇతర వామపక్ష పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున 2000 సంవత్సరం ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో తమ నిరసనను తెలియజేయడానికి వెళుతున్న సందర్భంలో పోలీసులతో లాఠీచార్జి చేయించి బాష్పవాయువులను ప్రయోగించి, గుర్రాలతో తొక్కించి, బుల్లెట్ల వర్షం కురిపించారన్నారు. దాంతో 245 మంది వరకు గాయపడ్డారని, ముగ్గురు రామకష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి బుల్లెట్ తూటాలకు బలై వీరమరణం పొందారని తెలిపారు. ఈ విద్యుత్ పోరాటం భారతదేశం లోనే కాక ప్రపంచవ్యాప్తం గా ప్రపంచ బ్యాంకు వినాశకర విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసే వారికి స్ఫూర్తి నిచ్చిందని తెలిపారు. దాదాపు 12 సంవత్సరాల పాటు ఎలాంటి కరెంటు చార్జీలు పెంచకుండా ప్రజలపై భారాలు వేసే సాహసం చేయలేకపోయారన్నారు. ఈ పోరాట స్ఫూర్తితోనే ప్రస్తుతం అనేక పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జై.చంద్రశేఖర్ సీనియర్ నాయకులు జి.యాదగిరి రావు, కాప్రా సర్కిల్ కమిటీ కార్యదర్శి జి.శ్రీనివాసులు, కమిటీ సభ్యులు బివి సత్యనారాయణ, పి గణేష్, నాయకులు ఎం.శ్రీనివాస్, పి శ్రీనివాస్, దేవి రెడ్డి, శ్రీమన్నారాయణ, శరత్ బాబు, సోమయ్య చారి, నూర్జహాన్, సరోజ, బాలరాజు, వెంకటేష్, ఆర్.శ్రీనివాసు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో.. ఆధునిక తెలుగు వ్యవహారిక భాష వైతాళికుడు గిడుగు రామ్మూర్తి 141 వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం కమలానగర్ ఆఫీసులో నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్షత వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి స్ఫూర్తి గ్రూపు సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, బొమ్మగాని రుక్కయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ తెలుగు భాషను వ్యవహారిక భాషలో తీర్చిదిద్దడంలో గిడుగు రామ్మూర్తి పాత్ర అమోఘమని అన్నారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో పురాతరణమైనదని.. దాన్ని ప్రజలు తమ జీవన నేపథ్యంలో సంస్కృతి పరంగాను అభివృద్ధి పరిచారని చెప్పారు. అటువంటి భాష అక్షర రూపంలో రావడానికి శాస్త్రీయ పద్ధతుల్లో తీసుకువచ్చారన్నారు. తెలుగు భాషను గ్రాంథిక భాషగా సంస్కృతాన్ని కుప్పించి తెలుగని చెప్పడం జరిగిందన్నారు. కానీ బాగా పండితులైన వారికి ఆ భాష అర్థమయ్యేదని ప్రజలకు అర్థం కాకుండా చేశారని అన్నారు. అయినా ప్రజలు తమ వరవడిలో తెలుగు భాషను అభివృద్ధి పరిచారని చెప్పారు. మొట్టమొదటగా వేమన సుమతి లాంటి కవులు వాడుక భాషలో తీసుకురావడం అది ప్రజలను నోట్లో సుదీర్ఘ కాలం కొనసాగిందని తెలిపారు. కానీ సాంప్రదాయ వాదులు దాన్ని తొక్కి పెట్టారని.. అయినా దాన్ని ముందుకు తీసుకురావడానికి ఆధునిక సాహిత్య ప్రక్రియలో గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక శైలిలో తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. తర్వాత కాలంలో తాపీ ధర్మారావు దాన్ని ముందుకు తీసుకువచ్చారన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు గురజాడ అనేక ప్రక్రియలో ముందుకు వచ్చారని చెప్పారు. రుక్కయ్య, శివరామకష్ణ, జయరాజ్, కోమటిరబీలు ప్రసంగించారు. అనంతరం సభికులందరూ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివరామకష్ణ, జయరాజ్, కోమటి రవి, చంద్రశేఖర్, శ్రీమన్నారాయణ, గౌస్య, బంగారు నర్సింగ్ రావు, ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం





ప్రత్యేక పూజలు చేసిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ శాంతి కోటేశ గౌడ్, కార్పొరేటర్ సతీష్ కుమార్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి జంగయ్య యాదవ్, మేయర్ శాంతి కోటేశ గౌడ్.

నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12 డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మేయర్ శాంతి కోటేష్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం బుధవారం శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రష్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు మునగాల సతీష్ కుమార్, కార్పొరేటర్లు కాప్రా ఎమ్మార్వో సుచరిత, సిఐ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, జవహర్ నగర్ కాలనీ అధ్యక్షులు అధ్యక్షులు స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మొక్కలను పెంచుదాం..కాలుష్యాన్ని తగ్గిద్దాం..



● బాలవికాస సంస్థ సిటీ డైరెక్టర్ బూడిద వెంకటేష్

● బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో.. 150 పండ్ల మొక్కల పంపిణీ

నవతెలంగాణ-జవహర్ నగర్

మొక్కలను పెంచుదాం పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిద్దామని బాలవికాస స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ సిటీ డైరెక్టర్ బూడిద వెంకటేష్ అన్నారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిసా కాలనీలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొబ్బరి, సపోటా, జామ, మామిడి, మొదలగు 150 పండ్ల మొక్కలను బాలవికాస సంస్థ ప్రతినిధులు కో ఆర్డినేటర్ సెల్వీ, లూర్ధు, మేరీ, విక్టోరియా రాణి, మంజులతో కలిసి మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి వాటిని పరిరక్షించుకోవాలని, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో శారద, భాగ్యలక్ష్మి, కళ, సరస్వతి, యశోదమ్మ, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో అక్రమ నిర్మాణాలపై కొరడా..



నవతెలంగాణ-ఉప్పల్

నగరంలో ఒకవైపు హైడ్రా అక్రమ నిర్మాణాలపై హడలెత్తిస్తుంటే, ఉప్పల్ సర్కిల్లో ఉప కమిషనర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో సర్కిల్‌లోని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్నారు. గురువారం ఉప్పల్ భగాయత్‌లో కమర్షియల్ అక్రమ షెడ్‌ను కూల్చివేశారు. దాంతోపాటు హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 లో అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి కూల్చివేసినట్టు ఉప కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. అక్రమ నిర్మాణాలను తమ దష్టికి వస్తే కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కవితకు బెయిల్ రావడంతో సంబరాలు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడం పై హర్షం వ్యక్తం చేస్తూ మౌలాలి డివిజన్ పరిధిలోని శక్తి మహిళా మండలి సభ్యులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యురాలు, శక్తి మహిళా మండలి అధ్యక్షురాలు కే అనురాధ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ చెప్పినట్టే కడిగిన ముత్యంలా ఎమ్మెల్సీ కవిత బయటకు వచ్చిందని, కేసీఆర్ పై కక్ష సాధింపులో భాగంగానే ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని, చివరకు అధర్మం ఓడి న్యాయం గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి మహిళా మండలి సభ్యులు, పార్టీ సభ్యులు టి.కవిత, వి.కవిత, వై.కవిత, పి.శిరీష, బుచ్చమ్మ, రేణుక, అంజమ్మ, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కనీస మౌలిక వసతులకు ప్రాధాన్యత



● మేయర్ శాంతి కోటేష్ గౌడ్, కార్పొరేటర్ శారద మనోదర్ రెడ్డి

నవతెలంగాణ - జవహర్ నగర్

ప్రజల కనీస అవసరాలైన మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తామని, డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్, కార్పొరేటర్ శారద మనోదర్ రెడ్డి అన్నారు. గురువారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 25 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ స్థానిక అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కార్పొరేటర్ నవీన్ కుమార్, బాచుపల్లి దయాకర్ చారి, బుజ్జి, బాబు, శీను, డివిజన్ నాయకులు బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఇంటి నుంచి దుకాణానికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక నగర్ సమీపంలో నివసించే అభిరామ్ దాస్ అనే వ్యక్తి 4 ఏండ్ల నుంచి ప్లంబర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 28వ తేదీ నాడు 9:30 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో గురువారం తన సోదరుడు మధుసూదన్ దాస్ నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బస్తీ దవాఖాన ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-కాప్రా

బస్తీ దవాఖానను నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన శేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు గదులున్న బస్తీ దవఖానాను కార్పొరేటర్ శాంతి సాయి జన శేఖర్ ప్రత్యేక చొరవ తీసుకొని మరొక మూడు గదులు కూడా కలిపారు. అలాగే బాత్రూంలు కూడా ఏర్పాటు చేయించారు. అయితే దాదాపు ఆరు నెలల నుంచి ఈ బస్తీ దవఖానాలో డాక్టర్ లేకపోవడం, కేవలం స్టాఫ్ నర్సు నవనీత ఒక్కరే వస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా ఇప్పటివరకు డాక్టర్‌ను ఏర్పాటు చేయలేకపోవడంపై కార్పొరేటర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు బస్తీ దవఖానాలో బీపీ మిషన్ పనిచేయకపోవడం, అలాగే అనేక సమస్యలు ఉన్నాయని స్థానికులు తెలియజేశారు. ఇప్పటికైనా డీఎంహెచ్ఓ తక్షణమే ఈ బస్తీ దవఖానకు డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయి జన శేఖర్, మేకల ముత్యంరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్ డే



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ కండ్ల కోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో గురువారం ఓరియంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై విద్యార్థులకు ఇంజనీరింగ్ ప్రాముఖ్యత గురించి వివరించారు, ఇంజినీరింగ్ నూతన విద్య సంవత్సరంలో అడుగు పెట్టిన విద్యార్థులకు వారిలోని భయాన్ని పోగొట్టేందుకు ఓరియంటేషన్ డే కార్యక్రమం నిర్వహిస్తమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చామకూర గోపాల్ రెడ్డి, డైరెక్టర్ జంగారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ , కళాశాల ఫ్యాకల్టీ బృందం, ఇంజనీరింగ్ నూతన సంవత్సర విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం



నవతెలంగాణ-కీసర

బీజేపీ దేశవ్యాప్తంగా చేపట్టబోయే సభ్యత నమోదు కార్యక్రమ సన్నాహక సమావేశం పార్టీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షులు బుద్దవరం వేణుగోపాల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధి శ్రీనివాస్ పాల్గొన్ని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్ రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మెన్ కాకుంట్ల చంద్ర రెడ్డి , కౌన్సిలర్ లక్ష్మీ వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ ,మాజీ జెడ్పీటీసీ సురేష్ , మాజీ ఎంపీటీసీ బలరాం, జిల్లా కార్యవర్గ సభ్యులు కిషోర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, రవీందర్ రెడ్డి, నాగరాజు , జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిరామారావు , బాలాజీ , తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మహిళలు పెండ్లి తర్వాత కుటుంబం, పిల్లల బాధ్యతలతో తీరికలేకుండా గడిపేస్తుంటారు. 'ఇక మా కలలు నిజం చేసుకునే అవకాశం ఎక్కడుంది' అనుకుంటూ డీలాపడిపోతారు. కానీ కాస్త సమయం చిక్కినా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ తామేంటో నిరూపించుకునేవారు కొందరుంటారు. ఆ కోవకు చెందిన వారే డాక్టర్ స్నేహలత ప్రసాద్. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. వ్యర్థాలకు జీవం పోస్తూ గొప్ప శిల్పిగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. భర్త, కుటుంబ చేయూతనందిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారనేందుకు నిదర్శనంగా నిలిచిన ఆమె పరిచయం నేటి మానవిలో...



వ్యర్థాలతో అందమైన శిల్పాలు



స్నేహలత సొంతూరు రాజస్థాన్‌లోని జోద్‌పూర్. తల్లి లీలాదేవి ప్రోత్సాహంతో కళారంగంలోకి అడుగుపట్టారు. ఫైన్ ఆర్ట్స్‌సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఆ తర్వాత పీహెచ్‌డీ పట్టా కూడా అందుకున్నారు. పెండ్లి తర్వాత హైదరాబాద్‌కు వచ్చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుటుంబం, పిల్లల బాధ్యతలతో తీరిక లేకుండాపోయింది. దాంతో తన కళకు కొంత కాలం విరామం ఇచ్చారు. కానీ తనలోని సృజనాత్మక సామర్థ్యాలను వెలికి తీయాలనే కోరిక మాత్రం రోజు రోజుకు పెరుగుతూనే వచ్చింది.

ఆత్మవిశ్వాసాన్ని జోడించి

పిల్లలు కాస్త ఎదిగిన తర్వాత భర్త ప్రసాద్ సహకారంతో తన కెరీర్‌లో సెంకడ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు స్నేహ. అరుదైన తన కళకు ఆత్మవిశ్వాసాన్ని జోడించి ఆకాశమే హద్దుగా ఎదిగారు. అతి పెద్ద పెయిటింగ్ వేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. స్నేహ కేవలం ఆర్టిస్టు మాత్రమే కాదు ప్రకృతి పర్యావరణ ప్రేమికురాలు కూడా. ప్రకృతి మీద ఆమెకున్న ప్రేమంతా ఆమె ప్రతీ పెయింటింగ్‌లోనూ మనకు కనిపిస్తుంది. ఢిల్లీ, జైపూర్, హైదరాబాద్‌లో అనేక ఆర్ట్ ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. దాదాపు అన్నింటికీ ప్రజల మండి మంచి ఆధరణ లభించింది. ఈ విజయం నుండి మరింత ప్రోత్సాహం అందుకున్నారు. మనిషి జీవితంతో ముడిపడిన ప్రేమను ఆమె తన చిత్రాలలో ఎంతో అందంగా చూపిస్తారు.

శిల్ప కళలో...


చిత్రకళ ఎంతో ఉత్సాహంగా కొనసాగుతున్న సమయంలోనే అనూహ్యంగా శిల్ప కళతో స్నేహకు పరిచయం ఏర్పడింది. ఆ కళమీద అంతులేని మక్కువ పెంచుకున్నారు. పట్టుదలతో అందులోనూ రాణించారు. ఇక అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. తన ప్రతిభతో భారతదేశంలో అత్యంత నైపుణ్యం కలిగిన మహిళా శిల్పులలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు ఆమె తొలి శిల్పం తెలంగాణా తల్లిది కావడం విశేషం. అలాగే పారిశ్రామిక వ్యర్థాలను అందమైన కళాకృతులుగా, రాయి, ఫైబర్ ఇలా వస్తువు ఏదైనా దాన్ని అద్భుతంగా మలచడంలో ఆమెది అందె వేసిన చేయి.

విద్యార్థులకు శిక్షణ

తనలోని కళను పది మందితో పంచుకోవాలనే ఉద్దేశంతో స్నేహ ఆర్ట్స్ ప్రారంభించారు. దీని ఆధ్వర్యంలో ఆర్ట్ క్యాంపులు, ఆర్ట్ ఫెయిర్, కోర్సులు, ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌లు, ఆర్ట్ టాక్‌లు, లైవ్ డెమోలు, డాక్యుమెంటరీలతో బిజీగా గడుపుతున్నారు. అలాగే 'రంగభూమి' అనే వేదిక ద్వారా ఔత్సాహిక కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇలా అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్దే గొప్ప శిల్పిగానే కాకుండా తర్వాతి తరాన్ని తీర్చిదిద్దే శిక్షకురాలిగా మారారు. 'గురుకులం లాంటి విద్యా సంస్థను ఏర్పాటు చేసి, పట్టుదలగా, పూర్తి నిబద్ధతతో చిత్రకళను, శిల్ప కళను నేర్చుకోవాలనే వారికి శిక్షణ ఇవ్వాలనేది నా లక్ష్యం. విద్యార్థులకు సరియైన రీతిలో శిక్షణ ఇవ్వాలి. దేశ సంస్కృతీ, సంప్రదాయాల మీద అవగాహన కల్పించాలి. ఆసక్తిని కలిగించాలి. అపుడే వారు ఎవరూ ఊహించలేని అద్భుతాలు సృష్టిస్తారు' అంటూ తన భవిష్యత్ కర్తవ్యాన్ని పంచుకున్నారు స్నేహ.

వెసులుబాటును ఉపయోగించుకొని

'చిత్రకళైనా, శిల్ప కళైనా ప్రతీ దానికీ ఓ లెక్క ఉంటుంది. దాని ప్రకారమే పోవాలి. నా జీవితమూ అంతే. ఒక లెక్క ప్రకారం కలలు, కళల మేళవింపుతో ఒక అందమైన చిత్రంగా మల్చుకున్నాను. ఆడపిల్లలకు కూడా ఆశలు, కోరికలు, లక్ష్యాలు ఉంటాయి. సాధించాలనే పట్టుదలా ఉంటుంది. కానీ తొలుత నచ్చింది నేర్చుకోవడంలో అడ్డంకులొస్తాయి. తీరా చదువుకున్నాక కుటుంబం ముందు, కరియర్ తర్వాత అనే కట్టుబాట్లు మరింత అవరోధంగా మారతాయి. ఇలాంటి కారణాల రీత్యా చాలా మంది తమలోని ఆశలను చంపేసుకుంటున్నారు. కానీ ఇది సరైనది కాదు. దొరికిన వెసులుబాటును ఉపయోగించుకుని మహిళలు తమ ప్రతిభకు పదును పెట్టుకోవాలి. సానుకూల ధోరణి, దృక్పథంతో ముందుకు పోవాలి' అంటారు స్నేహలత.



పర్యావరణ శిల్పం

పుణేలోని వాకాడ్‌లో, కస్తూరి చౌక్ వద్ద ఇటీవల ఒక పర్యావరణ శిల్పాన్ని ఆమె ఏర్పాటు చేశారు. ఇందులో కార్మికుల భద్రతకు చిహ్నమైన టోపీతో పాటు సమాజానికి, స్థిరత్వానికి మధ్య కీలకమైన బంధాన్ని తెలిపేలా డీఎన్ఏ గొలుసు, ఇంకా పరిశ్రమలు, శక్తి, ఆవిష్కరణల మేళవింపుతో దీన్ని ఏర్పాటు చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై పౌరులకు అవగాహన కల్పించే లక్ష్యంతో స్నేహ దీన్ని రూపొందించారు. 21 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో రెండు నెలల పాటు శ్రమించి దీన్ని సృష్టించారు.

డ్రీమ్ ప్రాజెక్ట్...

స్నేహ పుట్టింది రాజస్థాన్‌లోనే అయినా తనకిష్టమైన కళలో రాణించింది మాత్రం హైదరాబాద్‌లో. అందుకే ఆమెకు ఈ ప్రాంతమంటే ఎంతో అభిమానం. అందుకే ఈ మహానగరం కోసం ఏదైనా చేయాలని నిరంతరం తపిస్తున్నారు. తనకు అవకాశం లభిస్తే పరిశ్రమల నుంచి వచ్చిన ఇనప వస్తువులు, బోల్ట్‌లు, నట్లు తదితర వస్తువులతో తెలంగాణకు తలమానికమైన చారిత్రక కట్టడం 'చార్మినార్'ను యథాతథంగా నిర్మించాలనుకుంటున్నారామే. అది కూడా సందర్శకులు తను నిర్మించే చార్మినార్ పైకి ఎక్కి, నగర అందాలను దర్శించే అవకాశాన్ని కల్పించాలని భావిస్తున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అమె అంటున్నారు. ప్రభుత్వం, పారిశ్రామిక వేత్తల నుంచి సహకారం లభిస్తే దీన్ని సాధించి తీరుతానని నమ్మకంగా చెబుతున్నారు.

గొప్ప అనుభూతి

పనికిరాకుండా పారవేసే చెత్త, ఇతర వ్యర్థాల నుంచి కళాఖండాలను తీర్చిదిద్దడం ద్వారా ప్రకృతికి, పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని, ముప్పును తగ్గించడం తన బాధ్యతగా ఆమె భావించారు. కాలుష్య నివారణలో అందరూ భాగం పంచుకోవాలని ఆమె కోరుకుంటున్నారు. 'చిన్నప్పటి నుండి గొప్ప విజయాలు సాధించాలనేదే నా తాపత్రయం. అందుకే మహిళలకు ప్రవేశం అరుదుగా లభించే శిల్ప కళను ఎంచుకున్నాను. శిల్పాన్ని చెక్కేటపుడు వచ్చే దుమ్ము, ధూళి నాకు కనిపించదు. 200 ఏండ్లకు పైగా చరిత్రను చూసిన ఒక పవిత్రమైన వస్తువును స్పృశిస్తున్న పారవశ్యం. అదొక గొప్ప అనుభూతి. తొమ్మిది నెలలు గర్భంలో బిడ్డకు ప్రాణం పోసినంత సహజంగా శిల్పం ఆవిష్కృతమవుతుంది' అంటారామె. అందుకే అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు.



అపోహలతో విచారణను బదిలీ చేయలేం

(మొదటిపేజీ తరువాయి)

కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది.

తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ్ లూత్రా, మేనకా గురుస్వామీలు, పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావు హాజరయ్యారు. గురువారం ఉదయం ఈ కేసు విచారణకు రాగా కేసు తెలంగాణ సీఎంకు వ్యతిరేకంగా దాఖలైందని పిటిషనర్ తరపు న్యాయవాది సుందరం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేసులో నిందితుడు సీఎంగా ఉన్నారని, హెూంశాఖ, అవినీతి నిరోధక శాఖలు స్వయంగా ఆయన చేతిలోనే ఉన్నాయని తెలిపారు. అంతేకాక ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యులను, దర్యాప్తు సంస్థల అధికారులను ఇంకా విచారించలేదన్నారు. మరోవైపు రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్న నేపథ్యంలో సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రాసిక్యూషన్ తీరు, పోలీసు అధికారులతో పాటు, సుప్రీంకోర్టుకు సంబంధించిన గతంలో రేవంత్ రెడ్డి చేసిన పలు వ్యాఖ్యలతో పిటిషనర్లు ఆందోళన చెందుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలపై ప్రభుత్వ తరపు న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ లూత్రా, మేనకా గురుస్వామీలు అభ్యంతరం తెలిపారు. మొదటి నుంచి కేసు దర్యాప్తు అధికారుల్లో ఎలాంటి మార్పు లేదని కోర్టుకు నివేదించారు. ఆగస్టు 2021లో జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారణను నిలిపివేసిందని నివేదించారు. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అవుతుందని వ్యాఖ్యానించారు. 2021 నుంచి స్టే అమలులో ఉందని, 2024 ఎన్నికల తరువాత పిటిషనర్లు కోర్టును ఆశ్రయించినట్టు పేర్కొంది. విచారణ బదిలీని నిరాకరిస్తూనే, ఇరు పక్షాల్లో విశ్వాసాన్ని నింపేలా స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)ను ఏర్పాటు చేస్తూ... పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే తెలంగాణ హైకోర్టును సంప్రదించి మధ్యాహ్నం 2 గంటలకు ఆర్డర్ ఇస్తామని స్పష్టం చేసింది. అంతలోపు పీపీల కోసం ఇద్దరి పేర్లను సూచించాలని ఆదేశించింది.

అనూహ్యంగా కవిత బెయిల్ విషయంలో సీఎం వ్యాఖ్యలపై వాదనలు

మధ్యాహ్నం తరువాత వాదనలు అనుహ్యంగా కవిత బెయిల్ అంశంపైకి మళ్లాయి. ఈ సందర్భంగా కవిత బెయిల్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పిటిషనర్ తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం బీఆర్ఎస్ పని చేసింది. బీఆర్ఎస్, బీజేపీ మధ్య కుదిరిన ఒప్పందం వల్లే కవితకు బెయిల్ వచ్చిందని సీఎం వ్యాఖ్యలు చేశారు' అని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కవిత బెయిల్ ఉత్తర్వులపై వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డిని మందలించింది. జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ... సీఎం స్థాయి హెూదాలోని వ్యక్తి వ్యాఖ్యలతో కొందరి ఆలోచనల్లో భయాందోళనలు కలిగించవచ్చు. రాజకీయ పార్టీలను సంప్రదించి మేము బెయిల్, తీర్పులు ఇస్తున్నామా? మేము మా విధిని మనస్సాక్షిగా, ప్రమాణ పూర్వకంగా చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో జస్టిస్ కెవి విశ్వనాథన్ జోక్యం చేసుకొని 'ఇది ఒక సీఎం హెూదాలో ఉన్న బాధ్యత గల వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యేనా?. సంస్థల పట్ల పరస్పర గౌరవం ఉండాలి. ప్రాథమిక కర్తవ్యం. గౌరవం కలిగి ఉండాలి' అని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై వ్యాఖ్యానించిన మహారాష్ట్ర సర్కార్‌లో అడిషనల్ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తోన్న ఐఏఎస్ అధికారికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసినట్టు గుర్తు చేశారు. తెలంగాణ సీఎం సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం పట్ల గౌరవం లేకుండా, ఇలాంటి ప్రవర్తనే కలిగి ఉంటే, ఆయన తెలంగాణకు వెలుపల కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని మందలించారు. కాగా... ప్రభుత్వం తరపు న్యాయవాదులు ముకులు రోహిత్గి జోక్యం చేసుకొని సీఎం పక్షాన క్షమాపణ చెప్పగా, మరో న్యాయవాది సిద్ధార్థ లూత్రా సీఎంకు కౌన్సిలింగ్ చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. మరోవైపు పిటిషనర్ తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ సుప్రీం గురించి సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు, హైకోర్టు, దిగువ కోర్టుల్లో న్యాయమూర్తుల పరువు గురించి ఎలాంటి ఆందోళనలు ఉంటాయెూ ఆలోచించాలన్నారు. కాగా, పీపీ నియామకం విషయంలో వి. సురేందర్ రావు(ప్రస్తుతం సీఎం కేసులో ప్రాసిక్యూటర్), ఉమా మహేశ్వర్ రావు పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోని ధర్మాసనం, తదుపరి విచారణను సెప్టెంబర్ 2కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది. పిటిషన్ కోరినట్లు విచారణ బదిలీ అంశాన్ని ప్రస్తుత స్థితిలో రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచండి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడాన్ని ఆహ్వానించామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఆర్టీసీ బస్సుల సంఖ్యను, మెట్రోరైల్ బోగీలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు నాలుగు కోట్ల మంది ప్రజలున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలోనే 1.10 కోట్ల మంది నివసిస్తు న్నారని వివరించారు. గతంలో వివిధ రకాల వాహనాల్లో ప్రయాణించే ప్రజలు, ప్రత్యేకించి మహిళలు ప్రస్తుతం అత్యధిక భాగం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వంద శాతానికిపైగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని ప్రభుత్వమే ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రయాణికుల సంఖ్య రోజుకి 30 నుంచి 60 లక్షలకు పెరిగిందని తెలిపారు. అయినప్పటికీ ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరగలేదని వివరించారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే సమయంలో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉచిత ప్రయాణ పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఇటీవల కాలంలో ప్రభుత్వం దాదాపు 100 బస్సులు మాత్రమే పెంచిందని పేర్కొన్నారు. అదికూడా ఉచిత ప్రయాణానికి ఉపయోగపడని డీలక్స్, మెట్రో డీలక్స్ బస్సులను పెంచారని వివరించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని గ్రామాలకూ ప్రజారవాణాను మెరుగు పరిచేందుకు బస్సుల సంఖ్య పెంచాలనీ, రద్దీ రూట్లలో తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తేవాలి

హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజారవాణాను పెంచి మెరుగుపర్చాల్సిన అవసరముందని తమ్మినేని తెలిపారు. ట్రాఫిక్ రద్దీతో ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. మెట్రో రైళ్లు కిక్కిరిసి నడుస్తున్నాయని వివరించారు. ఉదయం, సాయంత్రం సమయంలో రద్దీ ఎక్కువ గా ఉండటంతో రైలు ఎక్కడం, దిగడం కూడా కష్టంగా ఉందని తెలిపారు. మూడు బోగీలతో నడుస్తున్న మెట్రో రైలును ఆరు బోగీలకు పెంచాలంటూ ప్రయాణికులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా ఎల్అండ్‌టీ సంస్థ పెడచెవిన పెడుతున్నదని పేర్కొన్నారు. లాభనష్టాలను బేరీజు వేస్తున్నదని విమర్శించారు. ప్రతి రూట్లలో లాభనష్టాలను చూసే ధోరణి సరైంది కాదని తెలిపారు. నగరంలోని పేద, సామాన్య ప్రజలకు ఎంఎంటీఎస్ రైళ్లు అతి చౌకగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న రైళ్లను చివరి నిమిషంలో బాధ్యతారహితంగా రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రెండో దశలో నిర్మించిన రూట్లలో ఇంతవరకూ కొత్త రైళ్లు వేయలేదని తెలిపారు. మరమ్మతుల పేరుతో గంటలకొద్దీ నిలిపేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రాష్ట్రంలో ప్రజారవాణాను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెట్రో రైల్ బోగీల సంఖ్య పెంచాలనీ, ఎంఎంటీఎస్ రైళ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

గచ్చిబౌలిలో ప్రేమోన్మాది ఘాతుకం

యువతిపై కత్తితో దాడి
యువతిమృతి, మరో ముగ్గురికి గాయాలు
పారిపోయే క్రమంలో నిందితుని ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో ప్రేమోన్మాది ఘాతుకానికి ఒడిగట్టాడు. ప్రియురాలిపై విచక్షణా రహితంగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో యువతి మృతి చెందగా.. మరో ముగ్గురు గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దీపన తమాంగ్ (25) గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తండాలో తన స్నేహితులతో కలిసి ఉంటోంది.

నల్లగండ్ల అపర్ణలో బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. ఆమెకు కొంతకాలం క్రితం కర్నాటకలోని బీదర్‌కు చెందిన రాకేష్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. అయితే రాకేష్.. తనను పెండ్లి చేసుకోవాలంటూ దీపన తమాంగ్‌ను విసిగించేవాడు. కాగా ఆమె పెండ్లికి నిరాకరిస్తూ కొంత కాలంగా అతన్ని దూరం పెట్టింది. వేరే వారితో సన్నిహితంగా ఉంటూ తనని

దూరం పెడుతుందనే అనుమానం రాకేష్‌లో మొదలైంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి దీపన ఇంటికి వెళ్లిన రాకేష్.. ఆమెతో మరోసారి పెండ్లి ప్రస్తావన తీసుకువచ్చాడు. దాంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాకేష్



క్షణికావేశంలో అక్కడే ఉన్న కూరగాయల కత్తితో యువతిపై దాడి చేశాడు.

దాడిని అడ్డుకోవడానికి దీపన తమాంగ్ ముగ్గురు స్నేహితులు ప్రయత్నించగా రాకేష్ వారిపై కూడా దాడికి యత్నించాడు. ఈ దాడిలో దీపన తమాంగ్ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతిచెందింది. ఆమె స్నేహితులకు సైతం గాయాలు కావడంతో వారికి ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

పారిపోయే ప్రయత్నంలో ఆత్మహత్యాయత్నం

కాగా యువతిని కత్తితో పొడిచి అనంతరం అక్కడి నుంచి పారిపోయిన రాకేష్..మెయినాబాద్ సమీపంలో కనకమామిడి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరెంట్ పోల్ ఎక్కడానికి ప్రయత్నించగా.. విద్యుద్ఘాతానికి గురై గాయలపాలయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాకేష్‌ను కనకమామిడి సమీపంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ పాస్‌పోర్ట్ పోర్టల్ ఐదు రోజుల బంద్

రీషెడ్యూల్ కానున్న అపాయింట్‌మెంట్‌లు

న్యూఢిల్లీ : పాస్‌పోర్ట్ అప్లికేషన్ల ఆన్‌లైన్ పోర్టల్ ఐదు రోజులు బంద్ కానున్నది. దీంతో ఆగస్ట్ 29 రాత్రి 8 గంటల నుంచి ఈ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటించింది. సెప్టెంబర్ 2న ఉదయం 6 గంటలకు సేవలు పునరుద్ధరించనున్నట్టు వివరించింది. సేవల నిర్వహణలో భాగంగా పాస్‌పోర్ట్ సేవలను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. సేవలు నిలిచిపోతుండటంతో ఈ ఐదు రోజుల అపాయింట్‌మెంట్ ఉన్నవారికి మరో తేదీతో పాటు సమయాన్ని ఖరారు చేస్తూ రీషెడ్యూల్ చేయనున్నట్టు వివరించింది. ఇందుకు సంబంధించి వారి ఫోన్లకు సందేశాలు పంపుతామని కేంద్రం విదేశాంగ శాఖ తెలిపింది.పాస్‌పోర్ట్ సేవలు తాత్కాలిక నిలిపివేత విషయాన్ని గమనించాలని పలు ప్రభుత్వ శాఖలకు సూచించింది. ఇదంతా సాధారణ ప్రక్రియలో భాగమని వివరించింది.

నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతి

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా దండకారణ్యంలో గురువారం పోలీసులు, మావోయిస్టుల కు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో మావోయిస్టుల మెటీరియల్‌తో సహా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. నారాయణపూర్ జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్, కంకేర్ జిల్లాల సరిహద్దులోని మాడ్ దండకారణ్య ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం అందుకున్న జాయింట్ పోలీసు పార్టీ కూంబింగ్ చేపట్టింది. ఈ సమయంలో మావోయిస్టులు తారసపడటంతో కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం ఘటనా స్థలంలో పోలీసులకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. గురువారం సాయంత్రం వరకు పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు భీకరంగా జరగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. డీఆర్‌జీ ఎస్‌టీఎఫ్, బీఎస్ఎఫ్ జాయింట్ టీమ్ మావోయిస్టుల కోసం పెట్రోలింగ్ సెర్చ్‌లో ఉంది.



కవితను చూసి కేసీఆర్ భావోద్వేగం

(మొదటిపేజీ తరువాయి)

తన భర్త అనిల్, కుమారునితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఎర్రవల్లి మాజీ సర్పంచ్ కమ్మరి బాలరాజు దంపతులు, సిబ్బంది ఎమ్మెల్సీ కవితకు దిష్టి తీసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కన్న బిడ్డను చూడగానే భావోద్వేగానికి గురయ్యారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను చూసి కేసీఆర్ ఆత్మీయ ఆనందం వెలిబుచ్చారు. తండ్రి పాదాలకు నమస్కరించిన కూతురిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ఆశీర్వదించారు. ఆమె వెంట ఎంపీ జోగినిపల్లి సంతోష్ రావు, వేముల ప్రశాంత్, పాడి కౌశిక్ రెడ్డి, జీవన్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్,, అంజిరెడ్డి, జహంగీర్ తదితరులున్నారు.

అంబానీని దాటేసిన అదానీ

హురున్ ఇండియా కుబేరుల జాబితా వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లో అత్యంత కుబేరుడిగా గౌతం అదానీ నిలిచారు. ఇంతక్రితం ఈ స్థానంలో ఉన్న ముకేశ్ అంబానీ రెండో స్థానంలో ఉన్నారు. దేశంలో అత్యంత సంపన్నుల జాబితాను హురున్ ఇండియా గురువారం విడుదల చేసింది. అందులో 62 ఏండ్ల గౌతమ్ అదానీ రూ.11.6 లక్షల కోట్ల సంపదతో మొదటి స్థానంలో నిలిచారు. ముకేశ్ అంబానీ రూ.10.1 లక్షల కోట్ల సంపద కలిగి ఉన్నారు. ఈ జాబితాలో తొలిసారి బాలీవుడ్ స్టార్ షారుఖ్‌ఖాన్‌కు చోటు దక్కింది. రూ.7,300 కోట్ల ఆదాయాన్ని కలిగి ఉన్నారు. శివ్ నాడార్, కుటుంబం రూ.3.1 లక్షల కోట్లతో 3వ స్థానంలో, సైరస్ పునావాలా కుటుంబం రూ.2.89 లక్షల కోట్లు (4), దిలిప్ సింఘ్వీ రూ.2.49 లక్షల కోట్లు (5), కుమార్ మంగళం బిర్లా రూ.2.35 లక్షల కోట్లు (6), గోపిచంద్ హిందుజా కుటుంబం రూ.1.92 లక్షల కోట్లు (7), రాధాకిష్ణ దమాని రూ.1.90,900 కోట్లు (8), అజీమ్ ప్రేమ్‌జీ, కుటుంబం రూ.1.90,700 కోట్లు (9), నిరజ్ బజాజ్, కుటుంబం రూ.1.62 లక్షల కోట్లు (10) వరుస స్థానాల్లో నిలిచారు.

నవచిత్రం

యూనిక్ పాయింట్



శ్రీవిష్ణు, టీజీ విశ్వప్రసాద్, హసిత్ గోలీ

హీరో శ్రీవిష్ణు 'రాజ రాజ చోరా' తర్వాత డైరెక్టర్ హసిత్ గోలీతో చేస్తున్న రెండవ సినిమా 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్ గురువారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ, 'టీజర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి కథ నాకు ఇచ్చిన హసిత్‌కి చాలా థ్యాంక్స్. చాలా గొప్ప కథ. ఇండియన్ స్క్రీన్‌లో ఇప్పటివరకూ రాలేదు. ఇది మన అందరి ఇళ్ళలో ఉన్న పాయింటే అయినా స్క్రీన్ పైకి ఇప్పటివరకూ రాలేదు. ఇలాంటి కంటెంట్‌ని సినిమా చేయడానికి ముందుకువచ్చిన నిర్మాత విశ్వప్రసాద్ ధన్యవాదాలు' అని తెలిపారు.

'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి 'రాజ రాజ చోర' సినిమా చేశాం. వీరి కాంబోలో ఇది మా సెకండ్ మూవీ. ఇది కంటెంట్ డ్రివెన్ వెరైటీ మూవీ. కమల్ హసన్ 'ఇంద్రుడు చంద్రుడు' లాంటి సినిమాలు చూసిన ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుంది' అని నిర్మాత టి.జి. విశ్వ ప్రసాద్ చెప్పారు. డైరెక్టర్ హసిత్ గోలి మాట్లాడుతూ,'తాతలు ముత్తాతలతో పాటు చూడగలిగే సినిమా. విష్ణు తన క్యారెక్టర్‌ని అద్భుతంగా చేశారు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని అన్నారు.

అరుదైన వేడుకకు ఆహ్వానం



నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెప్టెంబర్ 1న హైదరాబాద్ హైటెక్స్ నోవటెల్ హోటల్లో తెలుగు సినీ పరిశ్రమ ఆధ్వర్యంలో గ్రాండ్‌గా సెలబ్రేషన్స్‌ని ప్లాన్ చేశారు. ఇలాంటి అరుదైన వేడుకకు జాతీయ అవార్డు గ్రహీత, హీరో అల్లు అర్జున్‌ని తెలుగు సినీ ఇండస్ట్రీ తరఫున ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్, ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్, నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్, తెలంగాణ స్టేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రెటరీ అనుపమ రెడ్డి, 'మా' అసోసియేషన్ నుండి మాదాల రవి, శివ బాలాజీ, నిర్మాత ముత్యాల రామదాసు తదితరులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలకృష్ణతో తనకి ఉన్న అనుబంధం గురించి వీరితో అల్లుఅర్జున్ షేర్ చేసుకున్నారు.

అలాగే ఈ వేడుకకు తమిళం, మలయాళం, కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు సైతం హాజరు కాబోతున్నారు. హీరోలు శివరాజ్ కుమార్, విజయసేతుపతి, శివ కార్తికేయన్, కిచ్చ సుదీప్, దునియా విజయ్, దర్శకులు పి.వాసు, నటుడు నాజర్, నిర్మాత రాక్ లైన్ వెంకటేష్, అలనాటి కథానాయికలు సుహాసిని, మీనా, మాలా శ్రీ, సుమలత తదితరులకు దామోదరప్రసాద్, సి.కళ్యాణ్ ఆహ్వాన పత్రికను అందజేశారు.

కుబేరలో కీలక పాత్ర



ధనుష్, నాగార్జున, డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు హై బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతోంది.

కూలీలో సైమన్‌గా నాగ్

రజనీకాంత్ తాజాగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమా చేస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో సైమన్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నాగార్జున నటిస్తున్నారు. నాగార్జున్ బర్త్‌డే సందర్భంగా రిలీజ్ చేసిన సైమన్‌గా నాగార్జున లుక్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఉద్వేగభరిత కోర్ట్ రూమ్ డ్రామా



కళా సృష్టి ఇంటర్నేషనల్, మణి దీప్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై మహి పాల్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉద్వేగం'.

ఫస్ట్ కేసు అనేది ట్యాగ్‌లైన్. శంకర్ ఉకలపుమధు నిర్మాత. త్రిగుణ్ ప్రాధాన పాత్రలో, శ్రీకాంత్ అయ్యంగార్ విభిన్న పాత్రలో నటిస్తున్న ఈ చిత్ర టీజర్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ చేతుల మీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ,'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులోచాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ట్రైలర్ చూసిన తరువాత చాలా సిన్సియర్ అటెంప్ట్ అనిపించింది. చాలా సహజంగా యాక్ట్ చేశారు.ఈ చిత్రం కచ్చితంగా తెలుగు పరిశ్రమలో వండర్ క్రియేట్ చేస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

'కోర్టు రూమ్ డ్రామాల్లో మంచి సస్పెన్స్ ఉంటుంది. తెలుగులో వచ్చిన 'వకీల్ సాబ్' చిత్రం తరువాత అంత డ్రామా, సస్పెన్స్ ఉన్న చిత్రమే కాదు, చట్టాన్ని బేస్ చేసుకుని తెరకెక్కుతున్న చిత్రం కావడంతో ప్రేక్షకులకు ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు నాలెడ్జ్ కూడా అందిస్తుందని టీజర్ చెప్పకనే చెప్పింది' అని చిత్రయూనిట్ తెలిపింది.

1980 నేపథ్యంలో..



ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావు సినీ రంగంలోకి అడుగిడు తున్నారు. ఈ చిత్రంలో తెలుగమ్మాయి వీణరావ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

డైరెక్టర్ వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని న్యూ టాలెంట్ రోర్స్ ఏ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. నాగార్జున బర్త్‌డే, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ,'1980లో జరగబోయే ఈ కథలో బలీయమైన తెలుగు భాష, సంస్కృతి, తెలుగు జాతి నేపథ్యం ఉంది. తెలుగు భాషా, సంస్కృతి, విలువలు గురించి చెప్పాలని ఎప్పటినుంచో భావిస్తున్నాను. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలతో అన్నీ కుదిరిన కథ ఇది. ఇందులో కొన్ని సన్నివేశాల్లో భావోద్వేగాలని పద్యరూపంలో కూడా నటీనటులు వ్యక్తం చేస్తారు. ఇది తెలుగు భాషకు ఇస్తున్న ఒక జ్ఞాపిక లాంటి ప్రక్రియ' అని అన్నారు. గీత రచయిత చంద్రబోస్, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా, నిర్మాత గీతా యలమంచిలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేష్ అత్తిలి తదితరులు మరిన్ని చిత్ర విశేషాలను తెలిపారు.

ఓహ్.. టీజర్ రిలీజ్



జీవిత బడుగు సమర్పణలో ఏకారి ఫిలిమ్స్ పతాకంపై రఘు రామ్ హీరోగా, శృతి శెట్టి, నైనా పాఠక్ హీరోయిన్స్‌గా సత్యనారాయణ ఏకారి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఓహ్!'.

కులుమనాలి, ఆగ్రా, గోవా, హైదరాబాద్, వరంగల్‌లోని అందమైన ప్రదేశాలలో షూటింగ్ పూర్తి చేసుకుని, విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా చిత్ర టీజర్ ఆవిష్కరణ వేడుక ఇటీవల ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన గేయ రచయిత భాష్య శ్రీ టీజర్‌ను లాంచ్ చేశారు. చిత్ర సమర్పకురాలు బిఆర్ఆర్ గ్రూప్స్ అధినేత్రి జీవిత బడుగు మాట్లాడుతూ, 'మంచి క్వాలిటీతో ఈ సినిమాని ప్రేక్షకులకు అందిస్తున్నాం' అని అన్నారు.

'ఐదు చిత్రాలను నిర్మించిన అనుభవంతో ఒక కొత్త జోనర్‌లో, క్రోమో ఫోబియాని పాయింట్‌గా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని దర్శక, నిర్మాత సత్యనారాయణ ఏకారి చెప్పారు.

5 భాషల్లో కుంభ

దర్శకుడు వి.సముద్ర నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కుంభ'. వి.సముద్ర ఫిలిం బ్యానర్‌పై రూపొందబోయే ఈ చిత్ర ప్రారంభోత్సవం ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ఘనంగా జరిగింది.

హీరో విజయ్ రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు డీఎస్ రావు క్లాప్ కొట్టగా, సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి సన్నివేశానికి చంద్రమహేష్, దేవి ప్రసాద్ గౌరవ దర్శత్వం వహించారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత వి.సముద్ర మాట్లాడుతూ, 'బలమైన కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో 5 సినిమాలు చేస్తున్నాను. అందులో 'కుంభ' చిత్రం ఒకటి. ఆరు భారతీయ భాషల్లో ఈ పాన్ ఇండియా సినిమాని తీస్తున్నాం. ఈ సినిమాతో పాటు 'వరద రాజు గోవిందం', 'రామ జన్మభూమి', 'ఇండియా సీఈఓ', 'ప్రొడక్షన్ నెం 5' వంటి సినిమాలను కూడా ఆరు భారతీయ భాషల్లో పాన్ ఇండియా సినిమాలుగా చేయబోతున్నాను. ఈసినిమాకి సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తాను' అని అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ వరంగల్ శ్రీను మాట్లాడుతూ, 'వి.సముద్ర చేసినవన్నీ హిట్ టైటిల్సే. ఆయన సినిమాలోని పాటలు సందర్భోచితంగా ఉంటాయి. ఈ సినిమాకు పని చేయడం నా అదృష్టం' అని అన్నారు.



విజయ్ రామ్, డి.ఎస్.రావు

'గతంలో థియేటర్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్న నాకు ఈ సినిమాలో కథానాయకుడిగా అవకాశం ఇచ్చిన డైరెక్టర్ సముద్రకి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఇందులో నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. సముద్ర సినిమాల్లో ప్రతి పాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. అటువంటి ప్రాముఖ్యత ఉన్న పాత్రను చేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని హీరో విజయరామ్ చెప్పారు.

ఈ సినిమాతో సముద్ర వంటి గొప్ప వ్యక్తి పరిచయం అవ్వడం నా పూర్వజన్మ సుకృతం. ఈ చిత్రంలో ఒక ప్రత్యేకమైన పాత్రతో పరిచయం కాబోతున్నాను అని సూరజ్ ఆదిత్య సింగ్ చెప్పారు.

ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, సంగీతం: వరంగల్ శ్రీను, డీవోపి : శ్రీ వెంకట్, ఎడిటర్ :నందమూరి హరి, రచయిత, సహ దర్శకుడు : వెంకటేష్ చిక్కాల, ఆర్ట్ డైరెక్టర్ : విజయ్ కృష్ణ, కొరియోగ్రఫీ : అజయ్, స్నేహ, ఫైట్స్ : మల్లి.

ఆటలు

క్రీడారంగంలో గుణాత్మక మార్పు!





ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు
ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్

క్రీడాభివద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, క్రీడా రంగంలో గుణాత్మక మార్పు తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలగా ఉన్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి ఆవిష్కరించిన అనంతరం స్మారక హాకీ మ్యాచ్‌ను ఆరంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ' అన్ని రంగాల్లోనూ మార్పు సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే క్రీడా రంగంలో గుణాత్మక మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పని చేస్తున్నాం. రాష్ట్ర బడ్జెట్‌లోనూ కనీవినీ ఎరుగని రీతిలో క్రీడలకు అగ్ర తాంబూలం అందించాం. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుతో తెలంగాణలో క్రీడలను అంచెలంచెలుగా అభివద్ధి చేయాలని అనుకుంటున్నాం. దేశంలో ఏ రాష్ట్రం చేయని స్థాయిలో జాతీయ క్రీడా దినోత్సవం జరుపుతున్నాం. రాబోయే రోజుల్లో తెలంగాణ వేదికగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించనున్నాం. తెలంగాణ క్రీడా శాఖ పనితీరును సైతం ద్విగుణీకతం చేస్తామని ' తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, శాట్జ్ చైర్మన్ శివసేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు మంత్రులు బహుమతులు ప్రదానం చేశారు.

ఒలింపియన్లకు సత్కారం : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి పారిస్ 2024 ఒలింపిక్స్‌లో పోటీపడిన అథ్లెట్లను రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకంతో సత్కరించింది. పసిడి ఫేవరేట్‌గా పారిస్‌కు వెళ్లిన స్టార్ బాక్సర్, రెండు సార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ అనూహ్య రీతిలో మెడల్ లేకుండా నిష్క్రమించగా... యువ షుటర్ ఇషా సింగ్ సైతం మెడల్ ఆశలు రేపినా ఒత్తిడిలో అంచనాలను అందుకోలేదు. ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్, ఇషా సింగ్‌లకు రూ. 5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు.

ఆరంభం అదిరింది

- అట్టహాసంగా పారాలింపిక్స్ ఆరంభ వేడుకలు
- పారిస్‌లో మొదలైన పారా విశ్వ సంబురం

నవతెలంగాణ-పారిస్ : 167 దేశాల నుంచి 4000 మందికి పైగా వైకల్యానికి ఎదురించి నిలిచిన పారా అథ్లెట్లు పోటీపడేందుకు వేదిక సిద్ధమైంది. 2024 పారిస్ పారాలింపిక్స్ క్రీడల ఆరంభ వేడుకలు బుధవారం అట్టహాసంగా (భారత కాలమానం ప్రకారం అర్థరాత్రి అనంతరం) జరిగాయి. పారా క్రీడాకారులు పోటీపడే విశ్వ క్రీడల ఆరంభ వేడుకల్లోనూ దివ్యాంగ కళాకారులే నత్య రూపాలు ప్రదర్శించటం హైలైట్‌గా నిలిచింది. అథ్లెట్ పరేడ్‌లో ఫ్రెంచ్ అక్షరమాల ప్రకారం అన్ని దేశాల అథ్లెట్ల బందాలు వచ్చాయి. భారత బందానికి అమిత్ (జావెలియన్ త్రో), భాగ్య శ్రీ (షాట్ పుట్) సారథ్యం వహించారు. అమిత్, భాగ్య శ్రీ భారత పతాకధారులుగా వ్యవహరించి అథ్లెట్ పరేడ్‌లో మువ్వెన్నల జెండాను రెపరెపలాడించారు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ జంబో జట్టును బరిలోకి దింపింది. 84 మంది క్రీడాకారులు 12 క్రీడాంశాల్లో పతక వేటకు సిద్ధమయ్యారు. పారిస్ పారాలింపిక్స్‌లో 24 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. పారా సైక్లింగ్, పారా జూడోలను తొలిసారి పారిస్ పారాలింపిక్స్‌లో చేర్చారు. 2024 సమ్మర్ ఒలింపిక్స్ తరహాలోనే పారాలింపిక్స్ ఆరంభ వేడుకలు సంప్రదాయానికి భిన్నంగా స్టేడియం ఆవల అట్టహాసంగా సాగింది.



శీతల్‌కు రెండో స్థానం : పారాలింపిక్స్‌లో భారత పతక వేట మొదలైంది. పారా ఆర్చర్, పసిడి పతక ఫేవరేట్ శీతల్ దేవి తొలి రోజు ర్యాంకింగ్ ఈవెంట్‌లో అదరగొట్టింది. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో శీతల్ దేవి 703 పాయింట్లు సాధించగా.. టర్కీ పారా ఆర్చర్ 704 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడిన మరో భారత పారా ఆర్చర్ సరిత తొమ్మిదో ర్యాంక్ సాధించింది. ర్యాంకింగ్ రౌండ్‌లో ప్రదర్శన ఆధారంగా ప్రధాన డ్రా ప్రత్యర్థులను నిర్ణయిస్తారు.

పెసర కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

- మార్క్‌ఫెడ్‌కు మంత్రి తుమ్మల ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పెసర కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత వానాకాలంలో 64,175 ఎకరాల్లో పెసర పంట సాగయిందనీ, 17,841 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రస్తుతానికి 12 ప్రాంతాల్లో పంట కోతకు వచ్చిందని పేర్కొన్నారు. పెసర పంట అమ్మకానికి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఖమ్మం, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, నారాయణపేట, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాలలో కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా కొనుగోలు సెంటర్లలో రైతులకు మార్క్‌ఫెడ్ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించి, పెసర పంటకు ప్రభుత్వ మద్దతు ధర రూ.8,682 పొందాలని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గ్రామాల్లో కొనసాగుతున్న కుల వివక్ష

- కుటుంబాలను బహిష్కరిస్తున్న కుల పెద్దలు
- ఒంటరి వాళ్లమయ్యామని కుటుంబాల మానసిక ఆందోళన

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో అజ్ఞానం, వివక్ష రాజ్యమేలుతూనే ఉన్నాయి. రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామంలో ఇటీవల ఒక బీసీకులం వారు కుటుంబ గొడవలను కులానికి రుద్ది కొంతమంది కులపెద్దలు కలిసి.. మాట వినని ఆ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఆ కుటుంబం వారు ఇటీవల కాటమయ్య స్వామికి, ఎల్లమ్మ తల్లికి బోనంతో వచ్చి నైవేద్యం పెడుతుండగా కొంతమంది కులపెద్దలు అడ్డు చెప్పారు. "మీరు దేవుడికి బోనం పెట్టడానికి వీల్లేదు" అని పంచాయితీ పెట్టి బోనం పెట్టకుండా వెళ్లగొట్టారని సమాచారం. కులంలోనే వివక్షకు గురి చేయడంతో ఆ కుటుంబం మానసిక ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. అదే గ్రామ పరిధిలోని మధిర గ్రామంలోని ఒక సామాజికి తరగతికి చెందిన కుటుంబంలో పంచాయితీ ఏర్పడగా పుల్ల కట్టారు (వేశారు). కుటుంబ సభ్యులలో ఒకరు వినడం లేదని, ఆ కుటుంబంతో కులస్తులు ఎవ్వరూ మాట్లాడరాదని, కులపెద్దల నిర్ణయానికి కట్టుబడి ఉండకుంటే 5వేల రూపాయల జరిమానా విధించబడుతుందని హుకూం జారీ చేసినట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా ఆ గ్రామాల వైపు అధికారులెవరూ వెళ్లలేదని తెలుస్తోంది.

లోన్ యాప్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం



వ్యాపారం సరిగా నడవక తీసుకున్న లోన్ డబ్బులు చెల్లించలేక.. లోన్ యాప్‌ల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా జ్యోతినగర్‌లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోతినగర్‌కు చెందిన గూడ సతీష్‌రెడ్డి(43) స్థానికంగా ఓ షటర్ అద్దెకు తీసుకుని ఫైనాన్షియల్ కన్సల్టెన్సీని నడుపుతూ కార్లు కొనుగోలు చేసే కస్టమర్లకు వివిధ బ్యాంకుల నుంచి లోన్లు ఇప్పించేవాడు. ఈ క్రమంలో తాను లోన్‌లు ఇప్పించినవారు వాయిదాలు చెల్లించకపోవడంతో వాటిని సర్దుబాటు చేసేందుకు లోన్ యాప్‌ల నుంచి డబ్బులు రుణంగా తీసుకున్నాడు. వాటిని చెల్లించే స్థితిలో తాను లేకపోగా.. లోన్ యాప్‌ల నుంచి వేధింపులు పెరిగాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సతీష్‌రెడ్డి గురువారం తన ఆఫీసు రూమ్‌లోనే ఉరేసుకున్నాడు. అక్కడి పనిచేసే ప్రసాద్, సాయికృష్ణ గమనించి వెంటనే ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై నిర్లక్ష్యం తగదు

- సర్కారు నిర్లిప్తతతో విద్యార్థులు, విద్యాసంస్థల యజమానులకు ఇబ్బందులు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్ షిప్‌ల విషయంలో రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల జాడే లేదని విమర్శించారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోధనా ఫీజుల బకాయిలు రూ. 5900 కోట్లకు చేరుకున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది స్కాలర్ షిప్‌ల దరఖాస్తులకు కూడా దిక్కులేని పరిస్థితి తెచ్చారని విమర్శించారు. ప్రభుత్వ వైఖరి కారణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులు చదవులకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులంటే ఈ ప్రభుత్వానికి ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాల్లో మెయింటెనెన్స్ ఛార్జీలు కూడా రాకపోవటంతో విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తున్నదని వాపోయారు. కాలేజీ ఫీజులు అందక యాజమాన్యాలు కూడా విద్యార్థులకు చదువు చెప్పలేని పరిస్థితి వచ్చిందని తెలిపారు. పరిస్థితి ఇలాగే ఉంటే పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి తలెత్తుతుందనీ, దానికి కాంగ్రెస్ సర్కారే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బీవైడీని అప్పుడు వద్దని..ఇప్పుడు ఆహ్వానం ఎందుకు? : కేటీఆర్

తెలంగాణలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన చైనా ఆటోమేకర్ సంస్థ బీవైడీ సంస్థను మోడీ సర్కారు గతంలో ఎందుకు అడ్డుకున్నది? ఇప్పుడు అదే కంపెనీని ఎందుకు ఆహ్వానిస్తుంది? ఎందుకు రెడ్ కార్పెట్ పరుస్తున్నది? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆ సంస్థ పెట్టుబడులు పెట్టి ఉంటే తెలంగాణలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరికేవని పేర్కొన్నారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈవీ సెక్టార్‌ను ప్రోత్సహించాలన్న లక్ష్యం కూడా నేరవేరేదని తెలిపారు.

వరంగల్‌లో చెరువుల కబ్జా

కబ్జాదారుల కబంధ హస్తాల్లో వందల ఎకరాలు

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల ఖాతర్
- చేతివాటం ప్రదర్శించి సహకరించిన అధికారులు
- తెరవెనుక పెద్దపెద్ద రాజకీయ నేతలు..?
- హైకోర్టు ఆదేశాలతో డిజిటల్ సర్వే చేపట్టిన 'కుడా'





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెరువులు, కుంటల్లో యధేచ్చగా అక్రమ నిర్మాణాలు వెలసి వందల ఎకరాల భూమి కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయింది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి భారీ అవినీతికి పాల్పడటం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్న ఆరోపణలున్నాయి. ఈ భూ మాఫియా వెనుక పెద్ద పెద్ద రాజకీయ నేతలున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను పట్టించుకోలేదు. మున్సిపల్, కుడా అధికారులు యధేచ్చగా అనుమతులిస్తూ పోయారు. దాంతో చెరువులు కుదించుకుపోయాయి. గొలుసుకట్టు చెరువులు సైతం అంతర్ధానమయ్యే పరిస్థితి దాపురించింది. భద్రకాళి, చిన్నవడ్డేపల్లి, బంధం చెరువు, కోట చెరువులు కబ్జాకు గురయ్యాయి. తాజాగా హైకోర్టు ఆదేశాలతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్స్, షెడ్‌లు వేసుకున్న వారికి నోటీసులు ఇచ్చి ఎట్టకేలకు అందులో కొన్నింటిని కూల్చివేశారు. ఇందులో చాలా వరకు అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చలేకపోయారన్న విమర్శలు సైతం ఉన్నాయి. ఇదిలావుంటే తాజాగా 82 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల గుర్తింపునకు నీటిపారుదల శాఖ అధికారులు డ్రోన్‌లతో డిజిటల్ సర్వే చేపట్టారు. ఈ సర్వే పూర్తయితే కాని గ్రేటర్ వరంగల్ పరిధిలో చెరువుల కింద ఉన్న అసలు భూమి, ఎంత కబ్జాకు గురైందనే లెక్కలు తేలే అవకాశం ఉంది.

కబ్జా కోరల్లో వందల ఎకరాలు

హన్మకొండ నగరంలోని భద్రకాళి చెరువు కింద 336.37 ఎకరాలుండాలి. సుమారు 70-100 ఎకరాల మేరకు కబ్జా అయినట్టు తెలుస్తుంది. చెరువుల పరిరక్షణ కమిటీ పేరిట పెరుమాళ్ల లక్ష్మణ్.. కొన్నేండ్లుగా చెరువుల కబ్జాలపై ఎప్పటికప్పుడు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ కమిటీ గతంలో తేల్చిన మేరకు భద్రకాళి చెరువు కింద 70 ఎకరాల మేరకు ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేశారని పేర్కొన్నారు. ఈ కమిటీ వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లతోపాటు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌కు సైతం ప్రతిసారి ఫిర్యాదులు చేస్తూనే ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వడ్డేపల్లి చెరువు కింద 324.03 ఎకరాలుండగా, ఇందులో 50 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. అక్రమంగా ఫంక్షన్ హాళ్ల నిర్మాణం జరిగింది. ఈ విషయంలో 'కుడా' ప్రేక్షక పాత్ర పోషించింది. నేరుగా బడా నేతలు రాజధాని నుండే అనుమతులు తీసుకొని నిర్మించారని 'కుడా' అధికారులే వెల్లడించడం గమనార్హం. వరంగల్ నగరం దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు కింద 100 ఎకరాలుండాల్సి ఉండగా, ఇందులో 30 ఎకరాల మేరకు కబ్జా అయ్యింది. వీవర్స్ కాలనీ, పద్మానగర్, 80 అడుగుల రోడ్డు నిర్మాణంలో ఈ చెరువు భూములు పోయాయి. కాజీపేట బంధం చెరువులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో పలువురు రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టాలు పొంది ఇండ్లను నిర్మించుకున్నారు. వీరందరికీ మున్సిపల్ అధికారులు ఇంటినెంబర్లు ఇవ్వడంతో ఆ ఇంటి నెంబర్ల పేరిట దర్జాగా రిజిస్ట్రేషన్లు చేసుకొని అనుభవిస్తున్నారు. వరంగల్ డీఆర్‌డీఓ కార్యాలయంతోపాటు, ప్రావిడెంట్ ఆఫీసు, పోలీసు ఫోరెన్సిక్ ల్యాబ్ భవనాలను సైతం ఇందులోనే నిర్మించడం గమనార్హం.

అప్పటి బీఆర్ఎస్ నేతల అనుచరులే..

వరంగల్ మట్టెవాడలోని కోట చెరువు కింద 159 ఎకరాలుండాల్సి ఉండగా, 50 ఎకరాలు కబ్జాకు గురైంది. బీఆర్ఎస్ కీలక నేత అనుచరులే ఇక్కడ కబ్జాదారులుగా అవతారమెత్తి అందినంత మేరకు ఆక్రమించినట్టు ఆరోపణలున్నాయి. ఎనుమాముల సాయి చెరువు కింద 11.37 ఎకరాలుండగా, ఈ చెరువు మొత్తం వరంగల్ నగరంలోని దేశాయిపేట, ఎనుమాములలోని తోళ్ల పరిశ్రమల వ్యర్థాలతో నిండిపోయి కాలుష్యంతో నిండిపోయింది. ఖిలా వరంగల్ మండలంలోని రంగశాయిపేట దామెర చెరువు కింద 134.03 ఎకరాలుండగా, ఇందులో 35 ఎకరాలు కబ్జాకు గురైంది. తిమ్మాపురం బెస్తం చెరువు కింద ఉన్న 105.30 ఎకరాల్లో 40 ఎకరాలు కబ్జా అయ్యింది. మత్తడిని సైతం ఆక్రమించి మరీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు కింద 21.24 ఎకరాలుండగా, ఇందులో 10 ఎకరాలు కబ్జాకు గురైంది. ప్రయివేటు వ్యక్తులు వాణిజ్య సముదాయాలను నిర్మించడం గమనార్హం.

కొనసాగుతున్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల సర్వే : హర్షవర్ధన్, డీఈ, ఇరిగేషన్, హన్మకొండ

గ్రేటర్ వరంగల్ నగరం పరిధిలోని 82 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల నిర్ధారణకు డ్రోన్‌లతో సర్వే చేయడం ప్రారంభించాం. రెండు వారాల్లో ఈ సర్వే పూర్తి చేశాక, చెరువులు, కుంటల వాస్తవ పరిస్థితి తేలుతుంది. ఈ సర్వే ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదికను అందచేస్తాం.

'వాడ్రా' అమలు చేయాలి



హైదరాబాద్ నగరంలో 'హైడ్రా'ను అమలు చేస్తున్న విధంగా గ్రేటర్ వరంగల్ నగరంలో 'వాడ్రా' అమలు చేయాలి. నగరంలోని చెరువులు రియల్ మాఫియా చేతుల్లో అంతర్ధానమవుతున్నాయి. జిల్లాలకు వచ్చిన ప్రతి కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. హైకోర్టు ఆదేశాలతోనైనా 'వాడ్రా'ను అమలు చేసి అక్రమ నిర్మాణాలను తొలగించి వరంగల్ నగరంలోని చెరువులను పరిరక్షించాలి. మొక్కుబడిగా కాంపౌండ్ వాల్స్, షెడ్డులను తొలగించడం కాదని, బడా నేతలు, వారి అనుచరులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను సైతం తొలగించి చెరువులను కాపాడాలి.

- పెరుమాళ్ల లక్ష్మణ్, అధ్యక్షులు, చెరువుల పరిరక్షణ సొసైటీ, వరంగల్

అక్రమ కట్టడాల కూల్చివేత ప్రారంభం

- సర్వే నెం.523లో 70 నిర్మాణాలు నేలమట్టం
- ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు
- ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పూర్తి స్థాయిలో విచారణ
- అర్బన్ తహసీల్దార్ మున్సీరాం నాయక్
- దళారులను నమ్మి మోస పోవద్దని ప్రజలకు విజ్ఞప్తి
- ఇక పెద్దచెరువుపై దృష్టి సారించే అవకాశం



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ / మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని 523 సర్వేనెంబర్‌లోని నిర్మాణాలు మొదటి నుంచీ వివాదాస్పదమే. మాజీ మంత్రిపై వచ్చిన ఆరోపణలన్నీ ఈ సర్వే నెంబర్‌తోనే మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రాజధానిలో హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు.. పాలమూరులో కబ్జాదారులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. గురువారం 523 సర్వే నెంబరులోని అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చేశారు. ఇక్కడ కొంత మందికి బీపీఎల్ కింద పట్టాలు ఇచ్చారు. పట్టాలు పొందిన వారికంటే ఆక్రమణలే ఎక్కువగా ఉన్నాయనే విమర్శలున్నాయి. ప్రభుత్వం 523 సర్వే నెంబర్‌పై దృష్టి సారించడంతో ఆక్రమణ దారుల గుండెల్లో రైళు పరుగెడుతున్నాయి. అయితే, ఇక్కడ కొందరు పేదలు సైతం నిర్మాణాలు చేసుకున్నారు. ఇందులో పేదల ఇండ్లను కూడా కూల్చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే నెంబరు 523లో నిర్మాణాల కూల్చివేతల అనంతరం అధికారులు పెద్ద చెరువుపై దృష్టి సారించే అవకాశం ఉంది. పెద్ద చెరువులో మొత్తం 70 అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇందులో నిర్మాణాలు చేసిన వారంతా బడాబాబులే. వీరంతా ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీల దగ్గరకు వెళ్లి కూల్చి వేతలు ఆపాలని మొరపెట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. వీరన్నపేట, ఎస్‌వీఎస్, కొత్తచెరువు, లక్ష్మినగర్ కాలనీలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేసే అవకాశాలున్నాయి.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు : మున్సీరాం నాయక్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ మున్సీరాం నాయక్ అన్నారు. కొంతమంది దళారులు పట్టణ కేంద్రం క్రిస్టియన్‌పల్లి సమీపంలోని 523 సర్వే నెంబర్‌లో ఉన్న మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని తెలిపారు. వారు నిర్మించిన అక్రమ కట్టడాలను గురువారం ఉదయం కూల్చేశామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొంతమంది నిర్మాణాలు చేపట్టారన్నారు. తాము కూల్చేసిన నిర్మాణాల్లో ప్రజలెవ్వరూ నివాసం ఉండటం లేదన్నారు. 523 సర్వే నెంబర్‌లో మొత్తం 83.28గుంటల భూమి ఉందని, దానిలో వివిధ ప్రభుత్వ నిర్మాణాలు, పేదల ఇండ్ల నిర్మాణం కోసం పోను ఇంకా 3.30 గుంటలు మిగిలి ఉందని తెలిపారు. ఆ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేశారన్నారు. అమాయక ప్రజలకు మాయ మాటలు చెప్పి వారి దగ్గర డబ్బులు తీసుకొని స్థలం అమ్మిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు దళారులను నమ్మొద్దని, ఇంటి నిర్మాణ స్థలం కోసం తమను సంప్రదిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిజమైన లబ్దిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. పట్టణంలో ప్రభుత్వ స్థలం ఎక్కడ ఆక్రమణకు గురైనా కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏనుగొండ సమీపంలో ఉన్న 25 సర్వే నెంబర్‌లో కూడా ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, ఆర్ఐలు సుదర్శన్ రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపును ఎందుకు నిరాకరిస్తున్నారు?

- ప్రభుత్వాన్ని వివరణ కోరిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో కొత్త కోర్సులకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులిచ్చింది. ఏఐసీటీఈ, యూనివర్సిటీలు పర్మిషన్లు ఇచ్చాక సీట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని కోరింది. పలు ఇంజినీరింగ్ కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించింది. కొన్ని కాలేజీలకు అనుమతిస్తున్న ప్రభుత్వం తమ కాలేజీలకు ఇవ్వడం లేదని ఎంజీఆర్, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి కాలేజీ, మర్రి ఇంజినీరింగ్, అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీ ఇతరుల వాదన. విచారణ సెప్టెంబరు 4కు వాయిదా పడింది.

గ్రూపు-1 పోస్టుల్లో రిజర్వేషన్ల కేసులో నోటీసులు

గ్రూప్-1 పోస్టుల భర్తీ చేసేటప్పుడు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలులో అన్యాయం జరిగిందంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కౌంటర్ దాఖలు చేయాలని టీజీపీఎస్సీకి, రాష్ట్రానికి హైకోర్టు నోటీసులిచ్చింది. హనుమాన్ ఇతరులు వేసిన పిటిషన్లను జస్టిస్ కె.శరత్ విచారించారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపికలో ఆయా పోస్టుల వారీగా అమలు చేయడంలో రిజర్వేషన్ కేటగిరీల వారికి అన్యాయం జరుగుతోందని పిటిషనర్ల వాదన.

మెడికల్ లోకల్ వివాదంపై వచ్చే వారం తీర్పు

మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్‌లకు సంబంధించి స్థానికత వివాదంపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. రెండు వైపులా వాదనలు ముగిశాయి. వచ్చే వారం తీర్పు చెబుతామని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఇంటర్మీడియట్ వరకు వరసగా నాలుగేళ్లు చదివిన వారికి స్థానికత అమలు జరిగేలా రూల్ 3ఎను చేర్చుతూ ప్రభుత్వం గత నెల 19న జీవో 33 ఇవ్వడాన్ని పలువురు హైకోర్టులో సవాలు చేశారు. తెలంగాణ వారికి న్యాయం జరిగేలా జీవో ఇచ్చామని ప్రభుత్వం చెప్పింది.

సెప్టెంబర్ 2,3 తేదీల్లో తెలంగాణ ఉద్యమం, చరిత్రపై ఉచిత అవగాహన తరగతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉద్యమం, చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో ఉచిత అవగాహన తరగతులను నిర్వహించనున్నట్టు క్రిష్ణప్రదీప్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి ప్రకటించింది. ఈ మేరకు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మెన్ పి క్రిష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.


వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ తరగతులకు ప్రధాన వక్తగా ఎమ్మెల్సీ కోదండరామ్, ముఖ్యవక్తలుగా హరగోపాల్, ఘంటా చక్రపాణి, కె శ్రీనివాస్, అడపా సత్యనారాయణ, సి గణేష్, ద్యావనపల్లి సత్యనారాయణ, మామిడి హరికృష్ణ పాల్గొంటారని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 9133517733 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వాల్మీకి స్కామ్‌పై నోరుమెదపరేం?

కాంగ్రెస్,బీజేపీలకు మాజీమంత్రి హరీశ్‌రావుసూటి ప్రశ్న

- ఈడీ విచారణకు సిద్ధమా అంటూ సీఎంకు సవాల్
- ప్రభుత్వ భూములు కొల్లగొట్టేందుకే ఫోర్త్ సిటీ అంటూ వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కర్నాటకలో ఇటీవల బయటపడ్డ వాల్మీకి స్కామ్‌పై తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎందుకు నోరు మెదపటం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ స్కామ్ ద్వారా ఎవరెవరికి డబ్బులు వచ్చాయంటూ నిలదీశారు. ఈ కుంభకోణంపై ఈడీ విచారణకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. ఆ స్కామ్‌పై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా స్పందించటం లేదని గుర్తు చేశారు. దీన్నిబట్టే కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయనే విషయం తేటతెల్లమవుతోందని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు... మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వాల్మీకి స్కామ్‌కు సంబంధించి కర్నాటక కాంగ్రెస్‌పై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నా... ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కుంభకోణం ద్వారా అక్కడి నేతలు పట్టపగలే నిలువుదోపిడీ చేశారంటూ ఆరోపించారు. ఆ రాష్ట్రం నుంచి తెలంగాణకు చెందిన తొమ్మిది కంపెనీలకు డబ్బులు బదిలీ అయ్యాయని అన్నారు. ఈ తతంగంపై బీఆర్ఎస్ తరపున త్వరలోనే ఈడీని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కూల్చివేతల సర్కారని హరీశ్ ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. హైదరాబాద్ బ్రాండ్‌తోపాటు కేసీఆర్ కిట్, రైతు బంధును కూడా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరిట ప్రభుత్వం హడావుడి చేస్తోందనీ, వాస్తవానికి ఆ సంస్థ ఆఫీసైన బుద్ధభవన్ కూడా నాలా కిందే ఉందని తెలిపారు. దాన్ని కూడా కూలగొడతారా? అని ప్రశ్నించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముందు తన ఆఫీసును కూలగొట్టుకుని, ఆ తర్వాతే మిగతా భవనాల జోలికెళ్లాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌కు ధైర్యముంటే తమ ప్రభుత్వంలో చేపట్టిన మిషన్ కాకతీయపై విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తెలంగాణ తల్లి విగ్రహం అంటూ హంగామా చేస్తున్న ముఖ్యమంత్రి, ఆ విగ్రహ శంకుస్థాపనకు మంత్రులెవ్వరూ రాలేదనే విషయాన్ని గుర్తించాలని ఎద్దేవా చేశారు. అసలు సిసలు తెలంగాణ తల్లికి రూపమిచ్చింది కేసీఆరేనని వ్యాఖ్యానించారు. ఫోర్త్ సిటీ పేరుతో రాష్ట్రంలో ప్రభుత్వ భూములు కొల్లగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలూ బయటపెడతానంటూ హరీశ్ ఈ సందర్భంగా హెచ్చరించారు. రైతు రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్... రాహుల్ గాంధీని సైతం తప్పుదోవపట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు.

మరింత బలోపేతంగా 'హైడ్రా'

- మరో 15రోజుల్లో పూర్తిస్థాయి సిబ్బంది
- ప్రత్యేక పోలీస్‌స్టేషన్.. రూ.200 కోట్ల నిధులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా గురించే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా జంట జలాశయాల పరిరక్షణ లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపడుతున్న ఆపరేషన్ అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఎవరేమనుకున్నా.. ఎవరు ఏ ఒత్తిడి చేసినా పట్టించుకోకుండా.. చర్యలు తీసుకోవడంతో హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. ముఖ్యంగా 'ఎన్‌కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించనుంది. దాంతోపాటు నిధులు కేటాయించనుంది.

ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

హైదరాబాద్‌లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని కేటాయించనున్నారు. ఓ.ఆర్.ఆర్ పరిధిలోని అన్ని చెరువులు, పార్కులు, నాలాలతోపాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు ప్రభుత్వం విధి విధానాలు రూపొందిస్తోంది. ఇప్పటి వరకు చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై ప్రస్తుతం నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, పంచాయతీరాజ్, వాల్టా తదితర విభాగాలు వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నాయి. ఈ క్రమంలో పలు శాఖల మధ్య సమన్వయం లోపిస్తోంది. ఈ లోపాలను నివారించేందుకు.. ఓఆర్ఆర్ పరిధిలో అన్ని రకాల ఆక్రమణల తొలగింపులు, నోటీసుల జారీ హైడ్రా ద్వారానే చేపట్టేందుకు విధి విధానాలు ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైడ్రాకు కావాల్సిన అదనపు అధికారులు, సిబ్బందిని మరో 15రోజుల్లో ప్రభుత్వం నియమించనున్నట్టు తెలిసింది. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటు చేశారు. అయితే, దాదాపు 3800 మంది సిబ్బంది అవసరమని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతోపాటు, ఏసీపీ స్థాయి అధికారి, ప్రతి ఏటా హైడ్రాకు రూ.200కోట్ల మేర నిధులు కేటాయించనుంది.

పొలిటికల్ నుంచి సామాన్యుల వరకు

పొలిటికల్‌గా, సామాన్యుల నుంచి హైడ్రాకు పెద్దఎత్తున మద్దతు వస్తోంది. నాలాలు, చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు నాయకులు మాత్రం హైడ్రాను కట్టడి చేయాలని, కూల్చివేతలపై అభ్యంతరాలు తెలుపుతున్నారు. మరికొందరు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా వ్యతిరేకిస్తున్నారు. ఆగస్టు 13న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఎంఐఎం కార్పొరేటర్లు హైడ్రా తీరుపై మేయర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైడ్రాను రద్దు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని మజ్లిస్ కార్పొరేటర్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి కాటను కలిసి వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ మాత్రం ఎక్కడా 'ఒత్తిళ్లకు తలొగ్గకుండా' ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుండటం ప్రస్తుతం సంచలనంగా మారింది.

హైడ్రా ఆపరేషన్లలో వెలుగులోకి అక్రమాలు

హైడ్రా ఆపరేషన్‌తో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. కొన్ని చోట్ల భవన నిర్మాణం పూర్తి కాకముందే ఓసీ సర్టిఫికెట్లను జారీ చేయడం, బఫర్ జోన్‌లో ఇరిగేషన్ ఎన్‌ఓసీ లేకుండానే అనుమతులు ఇవ్వడం లాంటివి వెలుగు చూస్తున్నాయి. ఆక్రమణలకు పాల్పడిన వారితోపాటు అధికారులకు సైతం హైడ్రా నోటీసులు జారీ చేయడం, సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫారసు చేసింది.

అక్కడ స్థలాలు కొనుగోలు చేయవద్దు

కబ్జాలు లేని హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తోందని, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయొద్దని హైడ్రా కమిషనర్, ఐజీ రంగనాథ్ తెలిపారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు అన్నీ కలిపి 400కుపైగా ఉండేవన్నరు. వాటిని కబ్జాదారులు ఆక్రమణకు గురిచేశారన్నారు. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు అన్ని రకాల అనుమతులను పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు.

బిజినెస్

రిలయన్స్ వాటాదారులకు 1:1 బోనస్ షేర్లు



ముంబయి : రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తన వాటాదారులకు బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. షేర్‌హోల్డర్లకు 1:1 నిష్పత్తిలో బోనస్ వాటాలు ఇవ్వాలని యోచించామని రిల్ వార్షిక సాధారణ సమావేశంలో ఛైర్మన్ ముకేష్ అంబానీ వెల్లడించారు. దీనికి సెప్టెంబర్ 5న జరిగే బోర్డు సమావేశంలో ఆమోదం లభించాల్సి ఉందన్నారు. కంపెనీలో జారీ చేసే అదనపు వాటాలను ఇప్పటికే ఉన్న షేర్ హోల్డర్లకు ఉచితంగా ఇవ్వడాన్ని బోనస్ షేర్లు అంటారు. ఇప్పటికే వాటాదారుల వద్ద ఉన్న షేర్ల ఆధారంగా దీనిని కేటాయిస్తారు.

ఎఐ క్లౌడ్ వెల్కమ్ ఆఫర్

రిల్ ఎజిఎంలో జియో ఏఐ క్లౌడ్ వెల్కమ్ ఆఫర్‌ను ముఖేష్ అంబానీ ప్రకటించారు. ఈ ఆఫర్ ద్వారా జియో యూజర్లకు 100జిబి ఫ్రీ క్లౌడ్ స్టోరేజ్ ఇవ్వనున్నారు. 47వ వార్షిక జనరల్ మీటింగ్‌లో అంబానీ మాట్లాడుతూ ఈ ఏడాది దీపావళి నుంచి ఈ ఆఫర్ అమలులోకి రానుందన్నారు. క్లౌడ్ డేటా స్టోరేజ్‌తో పాటు ఏఐ సర్వీసులు ప్రతి ఒక్కరికి ఇండియాలో అందుబాటులో ఉంటాయి. క్లౌడ్ స్టోరేజ్ ద్వారా యూజర్ల తమ ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, డిజిటల్ కాంటెంట్, డేటాను సురక్షితంగా భద్రపరుచుకునే అవకాశం ఉంటుందన్నారు.

రియాల్టీ రంగంలోకి ఎంఎస్ఎన్ గ్రూపు

- ఐదేళ్లలో 2 కోట్ల చదరపు అడుగుల్లో నిర్మాణాలు
- నియోపోలీస్ సమీపంలో తొలి ప్రాజెక్టు : సిఎండి ఎంఎస్ఎన్ రెడ్డి వెల్లడి



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ ఫార్మా ఉత్పత్తుల ఎంఎస్ఎన్ గ్రూపు కొత్తగా రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రవేశించింది. గురువారం హైదరాబాద్‌లో ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ఎంఎస్ఎన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ రంగంలో ఉన్న విస్తృతావకాశాలను అందిపుచ్చుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. ఎంఎస్ఎన్ రియాల్టీ బ్రాండ్‌పై ఎంఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ దీన్ని నిర్వహించనుందన్నారు. వచ్చే ఐదేళ్లలో హైదరాబాద్‌లోని ప్రధాన ప్రదేశాల్లో 2 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాణిజ్య, నివాస నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తొలి దశలో భాగంగా నియోపోలీస్ సమీపంలో 15 ఎకరాల్లో నిర్మాణాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇక్కడ 2500-7500 వరకు చ.అ విస్తీర్ణంలో ఫ్లాట్లను అందుబాటులోకి తేనున్నామన్నారు. వచ్చే నాలుగేళ్లలో తొలి ప్రాజెక్టు పూర్తి కానుందన్నారు. ప్రస్తుతం తమ వద్ద నియోపోలిస్, మంచిరేవుల, తెల్లాపూర్, పటాన్‌చెరు, ఇస్నాపూర్ ప్రాంతాల్లో 40 ఎకరాలు అభివృద్ధికి అందుబాటులో ఉందన్నారు. రాబోయే ప్రాజెక్టులలో ప్రీమియం అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య స్థలాలు ఉన్నాయన్నారు. ఇవి ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా, ఆధునిక పట్టణ జీవన అవసరాలను తీర్చడానికి రూపొందించబడ్డాయన్నారు. 2024 మార్చి ముగింపు నాటికి ఎంఎస్ఎన్ గ్రూపు బిలియన్ డాలర్ల కంపెనీగా మారిందన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విడిఎల్ఎన్ శర్మ పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా సాంకేతికతపై దృష్టి పెట్టాలి

- ఎలక్ట్రిక్ ఎక్స్‌పోలో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ : విద్యుత్ వినియోగాన్ని తగ్గించగల సాంకేతికతపై కంపెనీలు దృష్టి పెట్టాలని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైటెక్స్‌లో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ఎక్స్‌పోను గురువారం మంత్రి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విద్యుత్ ఆదాతో సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. భారత్‌లో వైర్, కేబుల్ పరిశ్రమ 1093 బిలియన్ డాలర్లుగా ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ పరిశ్రమ ప్రతీ ఏడాది 14.5 శాతం వృద్ధిని నమోదు చేస్తోందన్నారు. వైరింగ్, కేబుల్ లేకుండా నిర్మాణాలు చేపట్టలేమన్నారు. విద్యుత్తును తగ్గించడానికి కేబుల్స్ ఉంటే ప్రభుత్వం అటువంటి పరిశ్రమను ప్రోత్సహిస్తుందన్నారు.

కవితపై అనుచిత వ్యాఖ్యలు

- వారిపై చర్యలు తీసుకోండి : మహిళా కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జైలు నుంచి విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరేళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. కవితపై సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారం, మార్ఫింగ్‌లపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ కవితపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారనీ, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు ఛైర్‌పర్సన్‌కు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నాయకులు ట్విట్టర్‌లో ఆమె ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా పోస్టులు పెడుతున్నారని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు : టీజేఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) డిమాండ్ చేసింది. ఈ నెల 24, 25 తేదీల్లో టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాలు, శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలను ఆమోదించినట్టు టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, బైరి రమేష్ మీడియాకు వెల్లడించారు. బీసీ రిజర్వేషన్లపై ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. సీతారామా ప్రాజెక్టు నిర్మాణంపై తలెత్తిన అంశాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సమావేశం, వక్ఫ్ బోర్డు భూములపై కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ధరణి చట్టంపై కరీంనగర్‌లో చర్చా వేదికతో పాటు సెప్టెంబర్‌న హైదరాబాద్ పార్టీ 4వ రాష్ట్ర ప్లీనరీ నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లాల ఇన్ ఛార్జీలను నియమించారు.

ప్రాణాలతో చెలగాటం

- మానసిక వ్యాధులకు అనుమతి లేని ఔషధాల విక్రయం
- రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులు కలిపి ఉత్పత్తి
- ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం



ఔషధ తయారీ కంపెనీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. మానసిక రుగ్మతల చికిత్స కోసం ఎలాంటి అనుమతులు పొందకుండా రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను కలిపి ఒకే మోతాదులో ఉత్పత్తి చేస్తున్నాయి. కేంద్ర నియంత్రణ సంస్థ ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ మార్కెట్‌లో వాటి ప్రవాహాన్ని అడ్డుకోలేకపోతోంది. ఈ మందుల వాడకంతో మనోవ్యాధి తగ్గడం మాట అటుంచి శరీరంలోని పలు అవయవాలపై ప్రభావం పడుతోంది. ఇతర వ్యాధులు ప్రబలి రోగుల ప్రాణాలకు ముప్పు కలుగుతోంది.

న్యూఢిల్లీ : మన దేశంలో మానసిక ఆరోగ్య సమస్యల చికిత్స కోసం రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను స్థిర నిష్పత్తిలో కలిపి ఒకే మోతాదు రూపంలో (ఎఫ్‌డీసీలు) వినియోగించడం పెరిగిపోతోంది. అయితే వీటిలో 60 శాతం ఎఫ్‌డీసీల వాడకానికి కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) అనుమతి లేదు. అంతేకాదు... వీటితో చికిత్సకు సంబంధించి పెద్దగా ప్రయోజనాలు చేకూరవు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఎఫ్‌డీసీల వాడకంపై సీడీఎస్‌సీఓ ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో బ్రిటన్, ఖతార్, భారత్, దేశాలకు చెందిన పరిశోధకులు విశ్లేషణ జరిపారు. ఆ అధ్యయనాన్ని ఈ నెలలో 'జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ పాలసీ అండ్ ప్రాక్టీస్'లో ప్రచురించారు.

దుష్పరిణామాలు ఎక్కువే

'ఎలాంటి మార్గదర్శకాలు పాటించకపోయినా భారత్‌లో మనోవ్యాధుల చికిత్సకు వాడే ఎఫ్‌డీసీ ఔషధాలను పెద్ద ఎత్తున మార్కెట్ చేస్తున్నారు. వీటివల్ల పెద్దగా ప్రయోజనం కూడా ఉండదు. పైగా అవి హాని కలిగించే ప్రమాదం కూడా ఉంది. ఇతర మార్కెట్లలో వీటి వినియోగం పరిమితంగానే ఉంటుంది' అని అధ్యయనం తెలిపింది. మనోవ్యాధుల చికిత్సకు అనుమతి లేని ఎఫ్‌డీసీ మందుల వాడకం ఎక్కువగా ఉంటోందని, వీటి విక్రయం ద్వారా ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని, ఆ మందులు సమర్థవంతంగా పనిచేస్తాయా లేదా అవి సురక్షితమైనవేనా అనేది ఎవరూ చూడడం లేదని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఎఫ్‌డీసీల సమస్య అందరికీ తెలిసిందేనని, వాటిని అడ్డుకునేందుకు నియంత్రణ సంస్థ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అవి మార్కెట్‌లో పెద్ద ఎత్తున కన్పిస్తూనే ఉన్నాయని ఆరోగ్య ఆర్థికవేత్త, అధ్యయన సహ-రచయిత అష్నా మెహతా చెప్పారు. ఈ నేపథ్యంలో నియంత్రణ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

మానసిక వ్యాధుల చికిత్స కోసం వాడే ఎఫ్‌డీసీల కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొందరికి కాలేయం దెబ్బతింటోందని పరిశోధకులు హెచ్చరించారు. మత్తుమందులకు అలవాటు పడిన వారు వాటిని మితిమీరి వాడుతున్నారు. కొన్ని నిషేధిత మందుల వినియోగం కారణంగా గుండెకు సంబంధించిన రుగ్మతలు తలెత్తుతున్నాయి.

రెండు నుండి నాలుగు మందులు కలిపి...

అధ్యయనంలో భాగంగా ఎఫ్‌డీసీ అమ్మకాల సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. మానసిక వ్యాధుల చికిత్స కోసం దేశంలో విక్రయించే ఔషధాల సమాచారాన్ని ఫార్మాట్రాక్ అనే డాటాబేస్ అందజేసింది. ఫార్మాట్రాక్ జాబితాలో 35 ఎఫ్‌డీసీలు ఉన్నాయి. వీటిలో ఓ ఎఫ్‌డీసీలో అయితే నాలుగు మందులు కలిసి ఉన్నాయి. మూడు ఎఫ్‌డీసీలలో మూడేసి మందులు, 26 ఎఫ్‌డీసీలలో రెండేసి మందులు స్థిర మోతాదులో కలిసి ఉన్నాయి. 30 ఎఫ్‌డీసీలపై మాత్రం ఔషధం పేరు, దాని సమాచారం ఉంది. వీటిలో ఆరింటికి మాత్రమే దేశంలో వినియోగానికి అనుమతి ఉంది. అమెరికాలో రెండింటికి, యూరోపియన్ యూనియన్‌లో ఒక దానికి అనుమతి ఉండగా బ్రిటన్‌లో ఒక్క దానికీ అనుమతి లేదు. దేశంలో మానసిక వ్యాధుల చికిత్స కోసం ఉపయోగించే మందుల్లో ఎఫ్‌డీసీల వినియోగం 2008-2020 మధ్యకాలంలో బాగా పెరిగింది. ఇదే కాలంలో ఎఫ్‌డీసీల విక్రయం 18.4 శాతం నుండి 20.1 శాతానికి చేరింది. చికిత్సలో భాగంగా ఒత్తిడిని నివారించే మందులు, బెంజోడియాజిపైన్ మందులు, మత్తుమందుల ఎఫ్‌డీసీల వాడకం పెరిగింది.

ఫలితమివ్వని ప్రభుత్వ చర్యలు

ఎఫ్‌డీసీల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం గతంలోనే చర్యలు చేపట్టింది. 294 ఎఫ్‌డీసీల ఉత్పత్తి లైసెన్సులు రద్దు చేయాలని 2007లో రాష్ట్ర నియంత్రణ సంస్థలకు సూచించింది. ఎఫ్‌డీసీలను తయారు చేసే కంపెనీలు వాటి సమర్థత, భద్రతకు సంబంధించి రుజువులు చూపేలా చర్యలు తీసుకోవాలని 2013లో కోరింది. అయినప్పటికీ మార్కెట్‌లో అనుమతి లేని ఎఫ్‌డీసీల ప్రవాహం ఆగడం లేదు.

యాంటీబయటిక్స్ కూడా...

గత సంవత్సరం కూడా పరిశోధకుల బృందం యాంటీబయటిక్స్ వినియోగంపై విశ్లేషణ జరిపింది. దేశంలో వినియోగిస్తున్న సుమారు 70 శాతం యాంటీబయటిక్ ఎఫ్‌డీసీ మందులను అనుమతి లేకుండానే విక్రయించడమో లేదా నిషేధిత మందులను అమ్మడమో జరుగుతోందని వారు తేల్చారు.

ఒకే క్యాప్సుల్‌లో అనేక మందులు

మానసిక ఆరోగ్య రుగ్మతల చికిత్స కోసం వాడే మందుల్లో ఎఫ్‌డీసీ ఔషధాల వినియోగం మన దేశంలో బాగా పెరుగుతోంది. 2020లో దేశంలో మనోవ్యాధుల చికిత్స కోసం వాడిన ఔషధాలలో 60.3 శాతం మందులు ఎఫ్‌డీసీలే. 2008లో ఇది 69.3 శాతంగా ఉంది. అప్పటి కంటే 2020లో ఎఫ్‌డీసీల వినియోగం తగ్గినప్పటికీ ఇప్పటికీ అధికంగానే ఉన్నదని పరిశోధకులు తెలిపారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను కలిపి, ఒకే క్యాప్సుల్ రూపంలో విక్రయిస్తారు. వీటినే ఎఫ్‌డీసీలు అంటారు. అయితే దేశంలో అందుబాటులో ఉన్న అనేక ఎఫ్‌డీసీలకు కేంద్ర నియంత్రణ సంస్థ సీడీఎస్‌సీఓ అనుమతి లేదు. సామర్థ్యత, భద్రతకు సంబంధించి ఎలాంటి రుజువులు చూపకపోయినా పట్టించుకోకుండా వాటి ఉత్పత్తికి రాష్ట్రాలు అనుమతిస్తున్నాయి.

ప్రీ ప్రైమరీ స్కూల్స్ నిర్వహించేలా ఏర్పాట్లు చేయండి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాం
- కోడిగుడ్డును రెండు ముక్కలు చేసి పిల్లలకివ్వాలి
- టేక్ హోమ్ రేషన్ విషయంలో మరింత జాగ్రత్త అవసరం
- విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : జిల్లా అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పూర్వ ప్రాథమిక పాఠాలను బోధించేలా అంగన్‌వాడీ కేంద్రాలను సమాయత్తం చేయాలని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) అధికారులను ఆదేశించారు. దేశానికి తెలంగాణ అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆ దిశలో టీచర్లకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం, మంత్రులు అంగన్‌వాడీ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తారని హెచ్చరించారు. పిల్లలకు ఇచ్చే కోడిగుడ్లను రెండు ముక్కలు చేసి ఇవ్వాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా అధికారులతో సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించడంపై దిశానిర్దేశం చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తు న్నట్టుగానే ప్రతినెలా ఆయాలకు కూడా ఇవ్వాలనీ, దీంతో అంగన్‌వా డీ కేంద్రాల్లో తలెత్తే సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించవచ్చు నని సూచించారు. గత ప్రభుత్వం సెంటర్లలో గుడ్లను, ఆహారపదార్థాల ను, ఇతర వస్తువులను భద్రపరుచు కునే వ్యవస్థను చేయలేకపో యింద ని విమర్శించారు. త్వరలో ఆహార పదార్థాలను నిల్వ చేసుకునే పాత్రల ను, కోడిగుడ్లను భద్రపరిచే రాక్‌లను అందచేస్తామన్నారు. టేక్ హోమ్ రేషన్‌లో భాగంగా ఇస్తున్న వస్తువుల నాణ్యతను లబ్దిదారుల నుంచి లిఖిత పూర్వకంగా ధ్రువీకరించుకోవా లని సూచించారు. పై అధికారులు అంగ న్వాడీ కేంద్రాలను విరివిగా సంద ర్శించాలని ఆదేశించారు. అంగన్‌వా డీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవా లన్నారు విధుల్లో అలసత్వం వహిస్తే మొదటి సారి హెచ్చరిస్తామనీ, రెండోసారీ తప్పు చేస్తే తప్పిస్తామని హెచ్చరించారు. సీఎం, మంత్రులు సైతం అంగన్వాడీ కేంద్రాలను సందర్శిస్తారని స్పష్టం చేశారు. వచ్చే నెల నాలుగో తేదీ నుంచి జిల్లాల్లో పర్యటించి శాఖ పరంగా అమలవుతున్న పథకాల అమలు తీరు, పనుల పురోగతిని సమీక్షిస్తానన్నారు. సమీక్షలో మంత్రితోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంలో పాల్గొంటాం : టీజీజేఎల్ఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల ఒకటిన పెన్షన్ విద్రోహ దినంలో పాల్గొంటామని టీజీజేఎల్ఏ-475 ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీలో భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు. సీపీఎస్, యూపీఎస్‌ను రద్దు చేయాలనీ, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఉద్యోగ జేఏసీలో భాగస్వామ్యమవుతాం : టీఎస్‌పాలా

సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినంలో భాగంగా జిల్లా కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని టీఎస్‌పాలా-200 అధ్యక్షులు ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు.

గురుకుల విద్యార్థులను ఎలుకలు కరవటం బాధాకరం

- రేవంత్‌రెడ్డి సర్కారు ఏం చేస్తున్నది? : హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వరుసగా గురుకులాల్లో విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటనలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొన్న మెదక్ జిల్లాలోని రామాయంపేట గురుకుల పాఠశాలలో 12మంది విద్యార్థుల మీద ఎలుకలు దాడి చేశాయనీ, నిన్న నల్లగొండ జిల్లాలోని కొండభీమనపల్లి గురుకుల పాఠశాలలో 13 మంది విద్యార్థుల మీద దాడి చేశాయని తెలిపారు. విద్యార్థులను ఎలుకలు కరిచి ఆస్పత్రుల పాలవుతుంటే రేవంత్‌రెడ్డి సర్కారు ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. గురుకుల ఎలుకలు, పాముల బాధితులుగా విద్యార్థులు మారటం, కలుషిత ఆహారం తిని ఆస్పత్రుల పాలవ్వటం రాష్ట్రంలో సాధారణమైపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 500 మందిపైగా గురుకుల విద్యార్థులు ఆస్పత్రుల పాలైతే 36 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. గురుకులాల అధ్వాన్న పరిస్థితికి, విద్యార్థుల మరణాలకు విద్యాశాఖ మంత్రి బాధ్యతలను చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డినే బాధ్యులని తెలిపారు. రాష్ట్ర సర్కారు మొద్దునిద్రను వీడి గురుకులాల్లో విద్య, భోజనం, వసతులు కల్పించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని సూచించారు.

త్వరలో భారత్ డోజో యాత్ర : రాహుల్



న్యూఢిల్లీ : త్వరలో భారత్ డోజో యాత్ర రాబోతుందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ గురువారం ప్రకటించారు. తాను ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన భారత్ జోడో న్యాయ్ యాత్ర క్యాంప్ సైట్లల్లో జరిగిన మార్షల్ ఆర్ట్స్ సెషన్లకు సంబంధించిన ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ పై విషయాన్ని రాహుల్‌గాంధీ తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ స్కూల్ లేదా మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ హాల్‌ను డోజోగా పేర్కొంటారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా మేం వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేశాం. మా ప్రతీ క్యాంప్‌సైట్ వద్ద ప్రతీ రోజూ దినచర్యగా జియు-జిట్సును సాధన చేశాం. ఫిట్‌గా ఉండటం కోసం దీని ప్రారంభించినా తరువాత ఇది కమ్యూనిటీ కార్యాచరణగా మారిపోయింది. ఇది మేం బస చేసే పట్టణాలకు చెందిన మార్షల్ ఆర్ట్స్ స్టూడెంట్స్‌ను యాత్రలోని సహచరులను కలిసిపోయేటట్లు చేసింది' అని రాహుల్ ఎక్స్‌లో చేసిన పోస్టులో తెలిపారు. 'మెడిటేషన్, జియు-జిట్సు, ఐకిడో, అహింసా కాన్‌ఫ్లిక్ట్ రిసోల్యూషన్ టెక్నిక్స్ యొక్క సామరస్య సమ్మేళనమైన 'జెంటిల్ ఆర్ట్' యొక్క అందాన్ని ఈ యువ హృదయాలకు పరిచయం చేయడమే మా లక్ష్యం' అని పేర్కొన్నారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కేటగిరీపై స్పష్టత ఇవ్వాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎస్సీ స్పోర్ట్స్ కేటగిరి ధ్రువపత్రాలపై విద్యాశాఖ స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మ్-1, ఫార్మ్-2 ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ వెల్లడించిందని పేర్కొన్నారు. కానీ ఫార్మ్-3, ఫార్మ్-4 కేటగిరి క్రీడల గురించి విద్యాశాఖ ప్రకటించలేదని తెలిపారు. రాష్ట్రంలో వేలాదిమంది అభ్యర్థులు రాష్ట్ర, జోనల్ క్రీడల్లో పాల్గొని మెరిట్ ధ్రువపత్రాలను కలిగి ఉన్నారని వివరించారు. కానీ వాటి గురించి విద్యాశాఖ ప్రకటించలేదని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న అభ్యర్థుల గురించే ప్రస్తావించారని తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర క్రీడల్లో పాల్గొన్న వారి ధ్రువపత్రాలకు కూడా రిజర్వేషన్ ఉంటుందని పేర్కొన్నారు. దాని ప్రకారం ఫార్మ్-3 ఉన్న వారికీ అవకాశం కల్పించాలని కోరారు. క్రీడా పోస్టుల్లో బ్యాక్‌లాగ్ లేకుండా చూడాలని సూచించారు.

రంగనాథ్ రాజకీయ నేతలా మాట్లాడుతున్నారు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మీరేలా జవాబిస్తారు?

- క్షమాపణ చెప్పాలి... లేకుంటే ప్రివిలేజ్ మెషన్ నోటీస్ ఇస్తా
- దమ్ముంటే పాతబస్తీలో కూల్చివేతలు మొదలు పెట్టండి
- బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తాను బీజేపీ నేతగా ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపితే హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనకు కౌంటర్ ఇస్తున్నట్టుగా మాట్లాడుతున్నారని ఆ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి విమర్శించారు. హైడ్రాపై తాను రాజకీయ ఉద్దేశంతో మాట్లాడుతున్నట్టు వ్యాఖ్యలు చేయడం సరైందికాదన్నారు. రాజకీయ నాయకుడిగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కమిషనర్ ఎలా సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వెంటనే రంగనాథ్ తనకు క్షమాపణ చెప్పాలనీ, లేదంటే ప్రివిలేజ్ మెషన్ నోటీస్ ఇస్తానని హెచ్చరించారు. రంగనాథ్ పోలీసు అధికారా లేక రాజకీయ నాయకుడా? అని ప్రశ్నించారు. తనను విమర్శించాలనుకుంటే ఖాకీ డ్రెస్ విప్పేసి ఖద్దరు బట్టలు వేసుకోవాలని సూచించారు. ఆ డ్రసులో ఉండి తనపై కామెంట్ చేయడం సరికాదని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియాపాయింట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైడ్రా కమిషనర్‌కు హైసెక్యూరిటీ అంటూ హంగామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. టెర్రరిస్టులు, నక్సల్స్‌తో పోరాడిన ఎంతో మంది అధికారులు ఉన్నారనీ, అంత కంటే ఈయన ఎక్కువేం చేశారని వ్యాఖ్యానించారు. హైడ్రా కమిషనర్ తీరు పని తక్కువ పబ్లిసిటీ ఎక్కువ అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సాధారణంగా పొలిటీషియన్లు తక్కువ పని చేసి ఎక్కువ పబ్లిసిటీ కోరుకుంటున్నారనీ, రంగనాథ్ వ్యవహారం కూడా ఇదే విధంగా ఉందని విమర్శించారు. సీఎం రేవంత్ ఆయనకు ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ వంటి పదవులు ఇస్తామని చెప్పినట్టుగా ఉందనీ, అందుకే ఆయన ఇప్పటి నుంచే కాంగ్రెస్ నాయకుడిలా వ్యవహరిస్తూ కామెంట్లు చేస్తున్నారని విమర్శించారు. రంగనాథ్ వృత్తిలో భాగంగా అవసరమైతేనే మీడియాతో మాట్లాడాలి, కానీ ఆయన తన ఇమేజ్ ప్రమోషన్ కోసం అదే పనిగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారని చెప్పారు. పాత బస్తీలోని సల్కం చెరువుల ఆక్రమణలను కూల్చాకే మిగతా అక్రమ కట్టడాలను కూల్చాలని సవాల్ విసిరారు. సల్కం చెరువులో ఒవైసీ భవనాలకు కావాలనే సమయం ఇస్తున్నారని ఆరోపించారు. ఒకవర్గం వారినే లక్ష్యంగా చేసుకుని మిగతా వారిని రక్షిస్తున్నారని విమర్శించారు. ఎంఐఎంకు భయపడి సీఎం రేవంత్‌రెడ్డి పాత బస్తీ వైపు చూడటం లేదని ఆరోపించారు. ప్రజానాయకుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేసి అప్పట్లో ఇలాగే రంగానాథ్ పబ్లిసిటీ చేసుకున్నారని గుర్తు చేశారు. సీఎం ఇచ్చే ప్రమోషన్, లేకుంటే రాజకీయ పదవి కోసమే ఆయన తాపత్రయ పడుతున్నారని విమర్శించారు. మాజీ ఐఏఎస్ అధికారి వెంకట్రామ్ రెడ్డి కూడా ఇలాగే వ్యవహరించి, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్సీ అయ్యారని గుర్తు చేశారు.

దేవాదులతో అదనపు ఆయకట్టు 89,312 ఎకరాలు సాగులోకి

- తుది దశకు ఫేజ్-3 పనులు
- 2947 ఎకరాల భూసేకరణకు గ్రీన్ సిగ్నల్
- నేడు పంపింగ్ స్టేషన్ దగ్గర మంత్రుల సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు ప్రయత్నిస్తున్నది. ఈమేరకు నీటిపారుదల శాఖ పనులను వేగవంతం చేసింది. మొత్తం మూడు దశల్లో దేవాదుల నిర్మాణం పూర్తి చేయాలన్న ప్రణాళికతో శ్రీకారం చుట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే భూసేకరణతో సహా 91శాతం పనులు పూర్తయ్యాయి. వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన పనులు పూర్తి చేసి 2025 మార్చి నాటికి 89312 ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా ఈ నెల 30న రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రాజెక్టు పురోగతిపై దేవాదుల ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ వద్ద నీటిపారుదల శాఖాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అలాగే జిల్లా ఇన్‌చార్జీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సహా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, (ధనసరి అనసూయ) సీతక్కతో పాటు రాజ్యసభ, లోక్‌సభ, శాసనమండలి, శాసనసభ్యులు పాల్గొననున్నారు. 2004-2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6016 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టును కాలక్రమంలో ఫేజ్-2, ఫేజ్-3 లుగా విస్తరించడంతో రూ. 17,500 కోట్లకు పెరిగింది. ఇప్పటి వరకు రూ. 14,188 కోట్ల ఖర్చుతో ప్రాజెక్టు నిర్మాణం పనులు తుదిదశకు చేరుకున్నాయని అధికారులు చెబుతున్నారు.

మొత్తం భూసేకరణ 33,224 ఎకరాలుగా నిర్ణయించగా ఇప్పటివరకు 30,268 ఎకరాలను సేకరించారు. మరో 2957 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి దశలో మూడు రిజర్వాయర్లు, నాలుగు పంపుహౌజ్‌ల ద్వారా 1.24 లక్షల ఎకరాల ఆయకట్టుకు 350 క్యూసెక్కుల నీరందించారు. అదేవిధంగా రెండో దశలో తొమ్మిది రిజర్వాయర్లు, ఏడు పంపు హౌజ్‌ల ద్వారా 1.93 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు సరఫరా చేసినట్టు అధికారిక సమాచారం.

మూడో దశ పనులు చివరలో ఉండటంతో 2.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు 10 పంపు హౌజ్‌ల ద్వారా 1750 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మల్టీ స్టోరేజి ఎత్తిపోతల పథకంగా పేరొందిన ఈ ప్రాజెక్టులో గోదావరి నీటి మట్టం నుంచి 469 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయనున్నారు. మొత్తం 39.16 టీఎంసీల నీటిని ప్రతియేటా 170 రోజులు ఎత్తిపోసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఐదు కొత్త చెరువుల నిర్మాణంతో సహా తొమ్మిది చెరువుల పునరుద్ధరణ జరుగుతున్నది. మరో మూడు కొత్త చెరువుల నిర్మాణపనులు ముగింపుదశలో ఉన్నట్టు సమాచారం.

రైల్వే అభివృద్ధి పనులకు సహకరించండి

- జీఎంకు ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తమ నియోజకవర్గాల్లో పలు రైలు అభివద్ధి పనులకు సహకరించాలని పలువురు ప్రజాప్రతినిధులు దక్షిణ, మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వినతిపత్రాలు సమర్పించారు. ఆయా పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు సైతం చేయాలని కోరారు. ఇందుకు రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ స్పందిస్తూ ఆయా రైల్వే అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజాప్రతినిధుల విలువైన సలహాలు, అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. కొత్త ప్రతిపాదనల విషయంలోనూ చర్చిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టుల పురోగతిని వారికి తెలియజేశారు. రైల్వే జీఎంను కలిసినవారిలో మహబూబాబాద్ ఎంపీ పి బలరాంనాయక్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పెద్దపల్లి శాసనసభ్యులు సీహెచ్ విజయ రమణారావు, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

డిస్కంలకు భట్టి అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సంతప్తికరంగా విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు డిస్కంల పనితీరు పట్ల డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అభినందనలు తెలిపారు. 2024-25లోనే గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో 15,573 మెగావాట్ల పీక్ డిమాండ్ చేరింది. గతేడాది కన్నా ఇది 5.11 శాతం అధికం. ఖరీఫ్ సీజన్ లో సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఈ డిమాండ్ 17 వేల మెగావాట్ల పీక్‌కు డిమాండ్ చేరుతుందని అంచనా ఉందనీ, దాని కోసమూ సిద్ధంగా ఉన్నట్టు ట్రాన్స్‌కో, జెన్కో సీఎండీ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులపై రేవంత్ సర్కార్‌కు అనుమానం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రుణమాఫీ కాని రైతులను రేవంత్ సర్కార్ అనుమానిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం సామాజిక వేదిక ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామా-ఇచ్చేది పక్కనబెట్టి వాపస్‌పై దృష్టి. మొన్న ఖమ్మంలో ముసలవ్వ పింఛన్ వాపస్-ఇప్పుడు రైతు రుణమాఫీలో వాపస్ అప్షన్. కేసీఆర్ గారు రైతు రాజును రాజు చేస్తే-మీరు అనుమానిస్తూ వేధిస్తున్నారు. ఇప్పటికే మాఫీపై మంత్రులు, ముఖ్యమంత్రి జూటా మాటలు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు .